ఐటీ పార్కుల పరిధిలో
కేంద్రీకృత రవాణా వ్యవస్థ



సమావేశంలో సీపీ అవినాశ్ మహంతి, జోయల్ డేవిస్, ఐటీ సంస్థల ప్రతినిధులు

ఈనాడు- హైదరాబాద్, రాయదుర్గం, న్యూస్‌టుడే: ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై సైబరాబాద్ పోలీసులు వేగంగా ముందుకెళ్తున్నారు. ఐటీ పార్కుల పరిధిలో కేంద్రీకృత రవాణా వ్యవస్థ, ఉమ్మడిగా వాడుకునే వాహనాల ఏర్పాటుపైనా కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఉద్యోగులు కార్‌పూలింగ్ వాడేలా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు. ఈ మేరకు ఐటీ పరిశ్రమల ప్రతినిధులతో సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి, జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్, మాదాపూర్ డీసీపీ వినీత్ సోమవారం సమావేశమయ్యారు.

- సాధారణ రోజులు, వారాంతాల్లో రద్దీ తక్కువ ఉండేలా వేళలు వేర్వేరుగా ఉండాలి.
- ఆఫీసు వేళల సమాచారం ఐటీ కంపెనీలు ఇస్తే ముందస్తు చర్యలు తీసుకుంటారు.
- వాహనాల నియంత్రణ కోసం ట్రాఫిక్ మార్షల్ల వినియోగంతో పాటు సీఎస్ఆర్ నిధుల్ని సమర్థంగా ఉపయోగించడం.
- ప్రభుత్వ విభాగాల సమన్వయంతో రోడ్లను మెరుగుపర్చడం, రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయడం.
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ ప్రాంతంలో ప్రజా రవాణా వ్యవస్థ, రాయదుర్గం మెట్రో స్టేషన్, ఇమేజ్ టవర్స్ దగ్గర బస్ బే, పార్కింగ్ సౌకర్యం మెరుగుపర్చాలి.
- టీజీఐఐసీ, టీఎస్ఆర్టీసీ, జీహెచ్ఎంసీ సహా ఇతర ప్రభుత్వ శాఖలతో చర్చించి మరిన్ని చర్యలు తీసుకోవాలి.

పరిహారంపై మల్లగుల్లాలు

మూసీ నిర్వాసితులకు ఖజానా నుంచి కేటాయించలేని పరిస్థితి

రూ.12 వేల కోట్లకు పైగా అవసరం



ఇటీవల చాదర్‌ఘాట్ వద్ద మూసీ పరీవాహకంలో కూల్చివేతలు

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయంలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇందుకు సుమారు రూ. 12 వేల కోట్లకు పైగా అవసరమని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంత పెద్దమొత్తం నిర్వాసితుల మీదే వ్యయం చేయడం చాలా కష్టమైన విషయమని సీనియర్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ ఖజానాలో మూసీకి పెద్దఎత్తున నిధులను కేటాయించే పరిస్థితి లేదని చెబుతున్నారు.

రుణం వస్తే ఊరట

మూసీ ప్రాజెక్టు కోసం రుణానికి వివిధ ఆర్థిక సంస్థలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఇందుకు రూ.50 వేల కోట్ల మేర రుణం తీసుకోవాలని అనుకుంటోంది. ఈ మొత్తం మంజూరైతే నిర్వాసితులకు పరిహారం ఇచ్చే అవకాశం ఉంటుందని అంటున్నారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి పలు సభల్లో కుండబద్దలు కొట్టారు. క్షేత్రస్థాయిలో మాత్రం అవంతరాలు ఎదురవుతున్నాయి.


బఫర్‌లో 15 వేల ఆక్రమణలు

మంచిరేవుల నుంచి నాగోలు వరకు 55 కి.మీ.ల పొడవున మూసీని సుందరీకరణతోపాటు ఆరు వరుసల రహదారి, మెట్రో సౌకర్యం కల్పించాలని ప్రణాళిక రూపొందించారు. దీనికి రూ.50 వేల కోట్లు అవసరమని అంచనా వేశారు. దాదాపు 15 వేల ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించారు. వాస్తవంగా మొత్తం చిన్నా పెద్దా నిర్మాణాలు దాదాపు 22 వేల వరకు ఉంటాయని చెబుతున్నారు. నదీ గర్భంలో ఉంటున్న 1600 మందికి రెండు పడక గదులను ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి 80 శాతం మంది అంగీకరించారు.

అపార్ట్‌మెంట్ల వాసుల అనాసక్తి

బఫర్ జోన్‌లో దాదాపు 5 వేల మందికిపైగా నిర్మాణదారులు బల్దియా నుంచి అనుమతులు తీసుకుని ఇళ్లను నిర్మించారు. ఇందులో అపార్టుమెంట్లూ ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో న్యాయం జరగదని వీరు ఖాళీ చేయడానికి ముందుకు రావడం లేదు. అత్తాపూర్ నుంచి బాపూఘాట్‌కు వెళ్లే ప్రాంతంలో ఒకచోట ఓ బిల్డర్ మూడేళ్ల కిందట 30 ఫ్లాట్లతో కూడిన అపార్టుమెంట్, ఆరు విల్లాలను నిర్మించారు. ఒక్కో ఫ్లాట్‌ను రూ.70 లక్షలకు, విల్లాలను కోటిన్నరకు విక్రయించారు. ప్రభుత్వం వీరికి ఇచ్చే పరిహారం 40 శాతం కూడా రావడం లేదు. వీరికి ఎలా న్యాయం చేయాలన్న దానిపై ప్రణాళిక లేదు. నగరంలో స్థలాన్ని సేకరించి వంద గజాల నుంచి ఆపైన పరిహారంగా ఇచ్చే విషయాన్నీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

చుట్టేద్దాం.. చూసొద్దాం



ఈనాడు, హైదరాబాద్

ఆహ్లాదకర వాతావరణం.. ఇటీవల కురిసిన వర్షాలతో పుడమికి పచ్చని రంగేసినట్లుగా పచ్చదనంతో ప్రకృతి పులకింపు.. నిండుకుండల్లా జలాశయాలు.. పండగ రోజులు.. పిల్లలకు సెలవులు.. విహారానికి ఇంతకుమించిన అనువైన సమయం ఇంకేం ఉంటుంది.

పాఠశాలల నుంచి ప్రత్యేక టూర్లు..

దసరా సెలవులు మొదలైన రెండో తేదీ నుంచే పిల్లలను పలు పాఠశాలలు విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లాయి. ఎక్కువగా ఉత్తర భారత యాత్రలకు, కొన్ని పాఠశాలలు ఇంటర్నేషనల్ టూర్లను ఏర్పాటు చేశాయి. వృత్తి, ఉద్యోగాలతో తీరిక లేకుండా ఉన్న తల్లిదండ్రులు.. సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తున్న ఈ తరహా విహారయాత్రలకు పంపిస్తున్నారు. ఐదారు రోజుల యాత్రకు విమానాల్లో వెళ్లి వస్తున్నారు. పండగ రోజు నాటికి ఇంట్లో ఉండేలా టూర్ షెడ్యూల్‌ను హైదరాబాద్‌లోని ఒక పాఠశాల డిజైన్ చేసింది.

విహారంలోనూ పండగ..

- దసరా ఉత్సవాలను చూసేందుకు పండగ రోజు మైసూర్‌లో ఉండేలా, ఇంకొంత మంది కోల్‌కతా వరకు పయనమవుతున్నారు. కన్నూర్‌లో దసరా వేడుకలు చూసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారని ట్రావెల్ సంస్థలు చెబుతున్నాయి.
- ఒత్తిడికి దూరంగా, ప్రకృతి ఒడిలో గడిపేందుకు దసరా సెలవులు అనువుగా భావిస్తున్నారు. కుటుంబంతో కలిసి రెండు నుంచి ఆరు రోజులు విహారానికి వేర్వేరు ప్రాంతాలకు వెళ్తున్నారు. ఎక్కువ పర్యాటక ప్రాంతాలకు మొగ్గుచూపుతున్నారు.
- బడ్జెట్, దొరికే సమయాన్ని బట్టి వికారాబాద్-అనంతగిరి, వరంగల్, శ్రీశైలం, తిరుపతి, విశాఖపట్నం, గోవా, షిర్డీ యాత్రలకు ఎక్కువగా వెళుతున్నారు.
- సెప్టెంబరు-నవంబరు మధ్య దేశీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రదేశాల సందర్శనకు జనవరి నుంచి అన్వేషిస్తున్నారని ట్రావెల్స్ నిర్వాహకులు తెలిపారు.
- లక్షద్వీప్, ఉజ్జయిని, వారణాసి వరకు ఆధ్యాత్మిక, తీర ప్రాంత సమ్మిళిత యాత్రలను ఇష్టపడుతున్నారని చెప్పారు. హైదరాబాద్ నుంచి డొమెస్టిక్ విమాన ప్రయాణాలు పెరగడం పర్యాటక జోరును తెలుపుతోంది.

క్రూజ్ టూర్లకు డిమాండ్



నగరవాసులు జలపాతాల చెంత గడిపేందుకు, జలాశయాల్లో పడవ షికారుకు కోరుకుంటున్నారు. సోమశిల, నాగార్జునసాగర్, పాపికొండల్లో క్రూజ్ టూర్లను పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించింది. వీటి కోసం ఎక్కువ మంది తమను సంప్రదిస్తున్నారని... అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో ఎదురుచూస్తున్నామని పర్యాటక శాఖ చెబుతుంది.

రిసార్ట్‌లకు బారులు



నగర శివార్లలో పేరున్న పలు రిసార్ట్‌లు ఉన్నాయి. దసరా వేడుకలు కుటుంబంతో అక్కడే జరుపుకొనేందుకు దాండియా, గార్బా ఆడేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారని తమ రిసార్ట్‌లో బుకింగ్స్ చేసుకున్నారని మొయినాబాద్‌లోని మృగవని రిసార్ట్ నిర్వాహకులు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న వారిలో ఎక్కువ మంది రామోజీ ఫిల్మ్‌సిటీ, హుస్సేన్‌సాగర్ పరిసరాలు చూడటానికి ఇష్టపడుతున్నారని పర్యాటక అధికారి ఒకరు తెలిపారు.

చెరువూ చెరువూ ఎక్కడున్నావ్?

- **ఓఆర్ఆర్ పరిధిలో నీటి వనరుల కబ్జా**
- **విస్తుగొలుపుతున్న తాజా ప్రభుత్వ నివేదిక**



పుప్పాలగూడ చెరువు ఇలా.. ఎరుపు రంగు అంతా ఆక్రమణ గుర్తించి

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా గత పదేళ్లలో అనేక నీటి వనరులు ఆక్రమణదారులు మాయం చేశారు. తాజాగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విడుదల చేసిన శాటిలైట్ మ్యాపులతో కూడిన నివేదిక ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఇటీవల విడిచిన నివేదికలో అవుటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న చెరువులు పూర్తిగా అన్యాక్రాంతం కావడం భయాందోళన కలిగిస్తోంది. హైడ్రా ఏర్పడిన నాటికి గ్రేటర్‌లో 225 చెరువులు పూర్తిగా అన్యాక్రాంతమయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో వేరే చెప్పాల్సిన అవసరం లేదు. మరో 196 పాక్షికంగా ఆక్రమించేశారు. ఇదంతా అవుటర్ రింగ్‌రోడ్డు లోపల జరిగిన ఆక్రమణల తంతు. అవుటర్ అవతల ప్రస్తుతం చెరువుల చుట్టూ అనేక భారీ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఆక్రమించి నిర్మాణాలు కడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా 2014 నాటికి అసలు ఆక్రమణలు లేని చెరువులు సైతం గత పదేళ్లలో ఆక్రమించేశారు. 20 చెరువుల్లో పూర్తిగా, మరో 57 చెరువుల్లో పాక్షికంగా ఆక్రమణలు ఉన్నట్లు తాజాగా శాటిలైట్ మ్యాపుల ద్వారా తెలుస్తోంది. చెరువుల్లోని ఎఫ్‌టీఎల్ ఎల్లో కట్టాలపై హైడ్రా దృష్టి సారించిన సంగతి తెలిసిందే. చాలా చోట్ల కూల్చివేతలు కూడా చేపట్టింది. 2014కు ముందు శాటిలైట్ మ్యాపుల్లో ఆక్రమణలు లేకపోయినా సరే.. తర్వాత కాలంలో దారుణంగా ఆక్రమణలు పాల్పడిన వైనం తేటతెల్లమైంది. దీంతో వేరే దారి లేక వరద నీరంతా సమీపం కాలనీలు, ఇళ్లల్లోకి ముంచెత్తుతోంది. పెద్దపెద్ద నీటి కుంటలను సైతం నామ రూపాలు లేకుండా అన్యాక్రాంతం చేసుకొని పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టారు. కొన్నిచోట్ల చెరువులు ఆక్రమించి లేఅవుట్లు వేసిన వైనం బయట పడింది. 2014 తర్వాత పలు చెరువుల ఆక్రమణల తీరును ఉపగ్రహ ఛాయాచిత్రాలు బయట పెట్టాయి.

గతేడాది కంటే 600 అధికంగా బస్సులు


ఈనాడు, హైదరాబాద్: దసరా పండగలకు ఆర్టీసీ 6,304 ప్రత్యేక బస్సులను నడుపుతోందని సంస్థ ఎండీ సజ్జనార్ తెలిపారు. మహాలక్ష్మి పథకంతో రద్దీ పెరగడంతో గతేడాది కంటే అదనంగా 600 స్పెషల్ సర్వీసులను నడుపుతున్నట్లు చెప్పారు. ఈనెల 9 నుంచి 12 వరకు ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెస్తున్నామని... తిరుగు ప్రయాణానికి ఈనెల 13, 14 తేదీల్లో ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. "జేబీఎస్ నుంచి 1,602, ఎల్బీనగర్ 1,193, ఉప్పల్ 585, ఆరాంఘర్ నుంచి 451 బస్సులను నడుపుతున్నాం. ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్ సైట్ Rtgsrtcbus.in లో చేసుకోవాలి. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలి." అని సజ్జనార్ వివరించారు.

నీరు దిగలే.. భవిష్యత్తు దిగులే

వర్షాలు కురిసినా నేలలోకి ఇంకని జలాలు

గతేడాదితో పోల్చితే మరింత లోతుకు

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా భూగర్భ జలాల నిల్వలు ఆందోళనకరంగా పడిపోతున్నాయి. ఏయేటికాయేడు కీలక ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాల్లో తగ్గుదల కనిపిస్తోంది. తాజాగా భూగర్భ జలవరుల విభాగం విడుదల చేసిన నివేదిక ప్రకారం... అనేక ప్రాంతాల్లో మీటర్ నుంచి 14 మీటర్ల వరకు తగ్గుదల కన్పిస్తోంది. ప్రధాన నగరం కంటే శివార్లలో తగ్గుదల ఆందోళనకరంగా మారింది. మహానగరం వేగంగా విస్తరించడంతోపాటు భారీ భవనాల నిర్మాణాలు... చెరువుల ఆక్రమణలు... మరోవైపు వాన నీటి సంరరక్షణలో నిర్లక్ష్యం వల్ల ఆ ప్రభావం భూగర్భ జలమట్టాలపై పడుతోంది. కూకట్‌పల్లిలో గతేడాదితో పోల్చితే ఏకంగా 13.72 మీటర్లు కిందికి పడిపోయాయి. ఇబ్రహీంపట్నంలో 14.83 మీటర్లు భూగర్భ జలమట్టాలు తగ్గాయి. అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతంలో 12.82 మీటర్లు తగ్గుదల కన్పిస్తోంది. ఎంపిక చేసిన ప్రాంతాల్లో భూగర్భ జల విభాగం పిజోమీటర్లు ఏర్పాటు చేస్తుంది. అక్కడ నమోదైన వర్షపాతం ఆధారంగా ఈ నీటి నిల్వలు లెక్క కడుతుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరిలోని 30మండలాల్లో సెప్టెంబరు నెలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువే నమోదైంది. సరాసరి 30శాతం వరకు తగ్గుదల కన్పించింది.



సెప్టెంబరులో భూగర్భ జలాలు తగ్గుదల ఇలా..(మీటర్లలో)

మండలం	2023	2024	తగ్గుదల
ఇబ్రహీంపట్నం	9.28	24.11	-14.83
కూకట్‌పల్లి	11.86	25.58	-13.72
అబ్దుల్లాపూర్‌మెట్	8.33	21.15	-12.82
మల్కాజిగిరి	16.51	25.68	-9.17
మేడిపల్లి	11.88	17.19	-5.31
మహేశ్వరం	9.43	14.02	-4.59

వాన నీటి సంరక్షణతోనే..

- హెచ్ఎండీఏ ఏరియా...సాధారణ వర్షపాతం లెక్కలోకి తీసుకుంటే ఏటా ఇక్కడ కురిసే వర్షం 15 టీఎంసీలకు సరిసమానం అని నిపుణులు అంచనా. ఇందులో 5శాతం కూడా భూమిలోకి ఇంకించలేని పరిస్థితి.
- గతంలో చాలా అపార్ట్‌మెంట్లు, 300 చదరపు మీటర్లు దాటిన వ్యక్తిగత గృహాల్లో ఇంకుడు గుంతలు నిర్మించినప్పటికీ నిర్వహణ లేక పూడుకుపోయాయి. కాలనీలు, పార్కుల్లో ఇంకుడుగుంతలదీ అదే దారి. దీంతో వర్షపు నీరు ఇంకడం లేదు.
- శివార్లలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరుగుతోంది. భారీ బోర్లు వేసి అక్కడ భూగర్భ జలాలను తోడేస్తున్నారు. అదే స్థాయిలో వాన నీళ్లు భూమిలోకి చేరక భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.
- గతంలో జలమండలి, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో భారీఎత్తున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. మరోసారి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలి. జలమండలి ఆ దిశగా దృష్టి సారించింది.

సిమెంట్ రహదారులు. .ఎక్కడికక్కడ భారీ నిర్మాణాల వల్ల భూమి లోపలకు నీళ్లు ఇంకడం లేదు. వాన నీరంతా మురుగు కాల్వల ద్వారా మూసీలోకి చేరుతోంది.

ఏసీబీకి చిక్కిన ఏఎస్ఐ



మేడ్చల్, న్యూస్‌టుడే: రూ.50వేలు లంచం తీసుకుంటూ సోమవారం మేడ్చల్ ఏఎస్ఐ ఏసీబీకి దొరికాడు. అధికారుల వివరాల ప్రకారం.. గౌడవెల్లి పరిధిలో బూసాకెత్‌లో ఓ విల్లా యజమాని శర్మ తన ఇంట్లో ఇంటిరియల్ పనికి విశ్వనాథ్‌ను సంప్రదించి రూ.8లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ముందస్తుగా రూ.4లక్షలు చెల్లించాడు. చెల్లించిన డబ్బులకు తగినట్లుగా పనులు పూర్తి చేశాడు. మిగిలిన పనులు పూర్తిచేయాలని శర్మ ఒత్తిడి చేశాడు. ఒప్పందం ప్రకారం మిగిలిన డబ్బులు ఇవ్వాలని విశ్వనాథ్ కోరాడు. అతనిపై కోపంతో శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు నెలల క్రితం కేసు నమోదైంది. విశ్వనాథ్‌కు బెయిల్ ఇచ్చేందుకు రూ.2లక్షలకు ఏఎస్ఐ మధుసూదన్‌రావు బేరం కుదుర్చుకొని.. ముందుగా రూ.10వేలు తీసుకున్నాడు. మిగిలిన డబ్బులు సోమవారం వరకు ఇవ్వాలని కోరడంతో విశ్వనాథ్ ఏసీబీని సంప్రదించాడు. ఏఎస్ఐ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి నగదుతో సహా అదుపులోకి తీసుకున్నారు.



శరన్నవరాత్రులు, బతుకమ్మ పండగ నేపథ్యంలో నగరంలోని పలు ప్రధాన కూడళ్లు, ఆలయాలు విద్యుద్దీపాలతో మెరిసిపోతున్నాయి. బేగంపేట ప్రధాన రహదారిపై ఉన్న కట్టమైసమ్మ దేవాలయం వద్ద విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంటోంది.



పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఛైర్మన్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నగర కార్పొరేటర్లు బతుకమ్మ ఆడారు. మేయర్ విజయలక్ష్మి, టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పట్నం సునీత మహేందర్ రెడ్డి తదితరులు సందడి చేశారు. - **న్యూస్‌టుడే, ఖైరతాబాద్, ఫిలింనగర్**

విద్యుత్తు తీగలకు నిచ్చెన తగిలి ఇద్దరి మృతి

మేడ్చల్, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కరెంటు తీగలు తగిలి ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ పారిశ్రామికవాడలోని హిందూస్థాన్ యూనిలివర్ లిమిటెట్ కంపెనీలో ఈ ప్రమాదం జరిగింది. ఈ కార్యాలయాన్ని శంషాబాద్‌కు తరలిస్తున్నారు. సామగ్రిని కార్మికులతో ఖాళీ చేయిస్తున్న సమయంలో 15 అడుగుల ఎత్తున్న ఇనుప నిచ్చెనను బిహార్‌కు చెందిన చోటా పాశ్వన్, గుడు బైటా, కరం కుమార్, లకిందర్‌కుమార్, పువో మాంజిలు బయటకు తోసుకుంటూ వెళ్తున్నారు. కంపెనీ గేటు సమీపంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు నిచ్చెన తగిలింది. కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని సీఎమ్మార్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గుడ్ బైటా(26),పువో మాంజీ(25)లు మృతి చెందారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. కంపెనీ అధికారులు, గుత్తేదారుపై కేసు నమోదు చేసినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

మునుగుతోందా.. ముంచుతున్నారా..?



చిలకలగూడలో పూడిక నిండిన నాలా

ఈనాడు, హైదరాబాద్: నాలాల్లో పూడిక తొలగించకపోవడంతో నగరంలోని పలు ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. కొన్నేళ్లుగా నాలాల్లోని పూడిక తీయడం లేదు. దీంతో క్రమంగా నాలాల్లోని బురద మట్టి మ్యాన్‌హోళ్ల మూతవరకు పేరుకు పోయింది. చివరికి వాటి మూత దాటి నాలాలోకి చుక్కనీరు చేరని పరిస్థితి. సికింద్రాబాద్ చిలకలగూడ చౌరస్తా నుంచి సీతాఫల్‌మండి రోడ్డు వైపు వరద నాలాను తవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జీహెచ్ఎంసీ మాత్రం ఏటా పూడికతీత పనులకు రూ.50కోట్ల మేర వెచ్చిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది.

మొండికేస్తున్న మూతలు.. చిలకలగూడ చౌరస్తా నుంచి రైల్వే క్వార్టర్స్ రోడ్డు మీదుగా గాంధీ చౌరస్తా వరకు చిన్న వర్షం కురిసినా రోడ్డు మునుగుతోంది. గాంధీ సర్కిల్ వరకు వరద రోడ్డు మీదుగానే ప్రవహించి నాలాలో కలుస్తుంది. స్థానికుల ఫిర్యాదుతో తాజాగా జీహెచ్ఎంసీ నాలా పునరుద్ధరణ పనులను చేపట్టింది. తెలిగ్గా తెరచుకోవాల్సిన మ్యాన్‌హోళ్ల మూతలు మొండికేశాయి. పేరుకుపోయిన మట్టి వాటిని పట్టేశాయి. అప్పటి వరకు 20 మ్యాన్‌హోళ్లను తెరిచామని, గాలి దూరేందుకు కూడా సందులేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

నిధుల మేతగా పూడికతీత..

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే పూడికతీత పనులు మొదట్నుంచీ గందరగోళమే. ఇటీవల టెండర్లలో కూకట్‌పల్లి జోన్, శేరిలింగంపల్లి జోన్ల సీనియర్ ఇంజినీరింగ్ అధికారులు బినామీ గుత్తేదారులను రంగంలోకి దించుతున్నారు. ఈ క్రమంలో కొందరు గరిష్ఠంగా 40శాతం తక్కువ ధరకే చేస్తామంటున్నారు. పూడిక మట్టిని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలిస్తేనే పూర్తిగా బిల్లును చెల్లించాలనే నిబంధన ఉంది. యార్డుకు వెళ్లే ప్రైవేటు వ్యర్థాలు, శివారు మున్సిపాలిటీల్లోని చెత్త వాహనాల 'వే బ్రిడ్జి' టోకెన్లను పూడికతీత గుత్తేదారులు కొనుగోలు చేసి జీహెచ్ఎంసీ వద్ద బిల్లులు తీసుకుంటున్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

పేద యువతుల వివాహాలకు భరోసా



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, న్యూస్‌టుడే: నియోజకవర్గ పరిధిలోని పేద యువతుల వివాహాలకు సంక్షేమ పథకాలు అండగా నిలుస్తున్నాయని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల అన్నారు. చార్మినార్ పరిధి పంజేషాలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సైదాబాద్, అంబర్‌పేట మండలాలకు చెందిన 123 మంది లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇళ్లు కూల్చడం సరికాదు: సీపీఎం



పార్టీ పతాకావిష్కరణలో నాయకులు

వనస్థలిపురం: మూసీ పరివాహక ప్రాంతంలోని పేదల ఇళ్లను ప్రభుతం కూల్చడం తగదని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సంధ్య అధ్యక్షతన సోమవారం సాహెబ్‌నగర్‌లో సీపీఎం మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కమిటీ సభ్యులు సర్కిల్ కార్యదర్శి కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా పేరిట పేదలు ఇళ్లను నేలమట్టం చేస్తుందన్నారు. పేదలకు ప్రత్యామ్నాయ నివాసం చూపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. పార్టీ కార్యదర్శిగా కొత్త గణేశ్ గౌడ్‌ను ఎన్నుకున్నారు.

'నరసింహ సేవలు చిరస్మరణీయం'



నరసింహ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కర్మన్‌ఘాట్: ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ ఛైర్మన్ దర్పల్లి నరసింహ సేవలు చిరస్మరణీయమని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దర్పల్లి నరసింహ వర్ధంతిని పురస్కరించుకొని సరూర్‌నగర్ పోస్టాఫీస్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, నాయకులు అశోక్, రవి, మహేందర్, రాజు, రాహుల్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

హయత్‌నగర్ ఆసుపత్రి తనిఖీ

హయత్‌నగర్: హయత్‌నగర్ ఆసుపత్రిని సోమవారం డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్యులంతా ఓపీ సమయం తప్పకుండా పాటించాలని ఆదేశించారు. 24గంటల పాటు డ్యూటీ డాక్టర్ అందుబాటులో ఉండాలన్నారు. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రి ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ, వైద్యులు పురుషోత్తం, లక్ష్మీనరసింహ, తిరుపతి, రేచల్, దుర్గ, వాణి, స్వాతి, గోపాల్ పాల్గొన్నారు.

సమగ్రంగా ఆస్తుల గుర్తింపు

- ముమ్మరంగా జీఐఎస్ సాంకేతిక సర్వే
- వెలుగులోకి అక్రమ, అనుమతి లేని కట్టడాలు

బండ్లగూడ, న్యూస్‌టుడే: జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం (జీఐఎస్) విధానంలో ఆస్తుల గుర్తింపు సర్వే, మ్యాపింగ్ చేపట్టాలని ఇటీవల జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. ఈ బాధ్యతలను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించడంతో నాగోల్ డివిజన్‌లో సర్వే ప్రారంభమైంది. సదరు సంస్థ సిబ్బంది డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారు.



బండ్లగూడ చౌరస్తాలో కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

ఏయే సమాచారం..

భవనాలు, అంతస్తుల కొలతలు తీసుకుంటున్నారు. విద్యుత్తు, నీటి బిల్లులు నమోదు చేసుకుంటున్నారు. ఇంటి ఫొటో తీసుకొని.. ఆయా వివరాలను జీహెచ్‌ఎంసీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో డ్రోన్లతో చేసిన మ్యాపింగ్‌కు అనుసంధానం కాని నిర్మాణాల వివరాలు సేకరిస్తున్నారు. అంతర్గత రోడ్ల విస్తీర్ణం, భూగర్భ డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆలయాలు, ప్రార్థన మందిరాలు, శ్మశాన వాటికల వివరాలు సైతం నమోదు చేస్తున్నారు.

ఉపయోగాలిలా..

నగరంలో చిరునామాలు సులువుగా తెలుసుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు, అగ్నిమాపక వాహనాలు, అంబులెన్స్‌లు.. నేరుగా ఘటనాస్థలానికి చేరుకోవచ్చు.

- జీఐఎస్ ఆధారిత సర్వే ద్వారా పన్నులు కచ్చితంగా నిర్ణయించి, వసూలు చేస్తారు. ఇప్పటివరకు నిర్మాణ అనుమతుల్లో పేర్కొన్న విధంగానే ఆస్తిపన్ను విధిస్తున్నారు. ఈ సర్వే సమాచారం ద్వారా పన్నులు విధిస్తే.. జీహెచ్‌ఎంసీకి ఆదాయం పెరుగుతుంది.
- ఏవి నివాసగృహాలు, ఏవి వాణిజ్య నిర్మాణాల్లో తెలుస్తుంది.
- సర్వేలో అక్రమ నిర్మాణాలు, అనుమతి లేని కట్టడాలు, అనుమతులు లేకుండా వేసి అదనపు అంతస్తుల వివరాలు వెల్లడవుతాయి.

అడ్డుకుంటున్న స్థానికులు..

జీఐఎస్ సర్వేపై స్థానికులకు అవగాహన లేదు. సర్వే చేస్తున్నవారు స్థానికులు కాకపోవడంతో, అనుమానంతో కాలనీవాసులు అడ్డుకుంటున్నారు. హైడ్రాగా భావించి బండ్లగూడ చెరువు సమీపంలో ఉన్న కాలనీల్లో జీఐఎస్ సర్వేను స్థానికులు అడ్డుకున్నారు. సర్వే సంస్థ బాధ్యులు వచ్చి జీహెచ్‌ఎంసీ ఆదేశాలు, జీవోలు, అనుమతులు చూపించాకే.. మొదలు పెట్టనిచ్చారు. తమ కాలనీ ఐదేళ్లుగా ముంపునకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని, బండ్లగూడ సమీపంలోని శ్రావణశ్రీ ఎన్‌క్లేవ్ వాసులు సర్వేను బహిష్కరించారు. ఈ విషయమై స్థానికులకు జీహెచ్‌ఎంసీ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.

నాగోల్ డివిజన్‌లో ఇలా..

సర్వే ప్రారంభం: ఆగస్టు 16
పూర్తి చేయాల్సిన కట్టడాలు: 21,500,
పూర్తయిన నిర్మాణాలు: 6,000
గడువు: మూడు నెలలు
సర్వే సిబ్బంది: 12 మంది

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030	మలక్‌పేట: 80085 73284
	హయత్‌నగర్: 98336 64897
	కర్మన్‌ఘాట్: 94400 32872
	బండ్లగూడ: 96034 78579
	మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, సైదాబాద్, అక్బర్‌బాగ్, కర్మన్‌ఘాట్

? సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి గతంలో మాదిరిగా ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేలా చూడాలి. – ఎంకే అఖిల్, సైదాబాద్

✓ రూట్ సర్వే చేపట్టి, అవసరమైతే బస్సులు నడుపుతాం. –విజయకుమార్, మేనేజర్, మిధాని డిపో

? ఓల్డ్ మలక్‌పేటలోని దోభీ గల్లీ లేన్‌లో గత పదిహేను రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోంది. – బాబుశ్రీనివాస్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే సమస్య పరిష్కార చర్యలు చేపడతాం. – ఆనంద్, ఏఈ, జలమండలి

? లింగోజిగూడ డివిజన్ సాగర్ రోడ్డు నుంచి పోస్టాఫీస్ చౌరస్తా వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి. – జంగారెడ్డి, లింగోజిగూడ

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే గుంతలకు మరమ్మతులు చేశాం. మరోమారు పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతాం. –విజయ్‌కుమార్, ఏఈ, లింగోజిగూడ

జీహెచ్‌ఎంసీ ప్రజావాణికి 139 అర్జీలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. జీహెచ్‌ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 90 విజ్ఞప్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ 22, హౌసింగ్ 59, ట్యాక్స్ విభాగం 5, ఐటీ సెక్షన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, మూసాపేట డిప్యూటీ కమిషనర్‌లకు సంబంధించి ఒక్కోక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో వచ్చిన 49 అర్జీల్లో కూకట్‌పల్లి జోన్‌లో 26, శేరిలింగంపల్లి జోన్‌లో 10, సికింద్రాబాద్ జోన్‌లో 7, ఎల్బీనగర్ జోన్‌లో 2, చార్మినార్ జోన్‌లో 3, ఖైరతాబాద్‌లో ఒక్కటి వచ్చాయని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరిరావు, జేసీ శానిటేషన్ వేణుగోపాల్, అడిషనల్ సీసీపీలు ప్రదీప్‌కుమార్, గంగాధర్, హౌసింగ్ ఎస్ఈ కృష్ణారావు, ఎస్ఈ ఇంజినీరింగ్ పనపరెడ్డి, ఇరిగేషన్ యస్ఈ నారాయణ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో రంగారెడ్డి జట్టు ప్రతిభ

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సంబరాల్లో భాగంగా ఈ నెల 5న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ పర్యవేక్షణలో కొత్తగూడెం ప్రకాశం మైదానం, పాల్వంచ నవభారత్ మైదానంలో గత మూడు రోజులుగా పోటీలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పది ఉమ్మడి జిల్లాల జట్లు మ్యాచ్‌లలో తలపడ్డాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జట్లు నిలిచాయి. విజేత జట్లకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడల పరిశీలకుడు వడ్డెన్న ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, ఖదీర్, మంగీలాల్, మదన్‌మోహన్, కృష్ణ, రాము, యుగంధర్, శ్రీనివాస్, సుందరమ్మ, సీతాదేవి, సుజాత పాల్గొన్నారు.

సురవర వర్షిణి.. సుందర రూపిణి

దేవి శరన్నవరాత్రి పూజలు అంగరంగవైభవంగా సాగుతున్నాయి. ఎల్బీనగర్, మలక్‌పేట పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. కాలనీల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, కాలనీ సంఘాల అధ్యక్షులు పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే యంత్రాంగం



సాయినగర్‌లో మహా చండీగా..



హరిహరపురంలో అన్నపూర్ణదేవిగా..



సైదాబాద్‌లో మహా చండీగా..



పల్టన్ హరిహరక్షేత్రంలో లలితత్రిపుర సుందరిగా..



ఎస్‌కేడీ నగర్‌లో పూజల్లో మధుయాస్కీ, నాయకులు



నాగోలు మమతానగర్‌లో ఉప్పల శ్రీనివాస్ గుప్తా..



కొత్తపేట నాగేశ్వర్‌రావు నగర్‌లో కార్పొరేటర్ పవన్ తదితరులు



ఎల్బీనగర్ ఠాణా ప్రాంగణంలో మహిళా పోలీసులు



సైదాబాద్‌లో కార్పొరేటర్ అరుణ

చిత్తూ చిత్తుల బొమ్మా.. శివుని ముద్దు గుమ్మ

నాగోలు, సైదాబాద్: బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. ఎల్బీనగర్ ఠాణా ప్రాంగణంలో సోమవారం ఎల్బీనగర్, సరూర్‌నగర్, చైతన్యపురి ఠాణాలతో పాటు మహిళా పోలీస్‌స్టేషన్‌కు చెందిన సిబ్బంది బతుకమ్మలను పేర్చి, ఆడి పాడారు. ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య పూజలు నిర్వహించి వేడుక ప్రారంభించారు. సైదాబాద్ ఏకలవ్యనగర్ హనుమాన్ ఆలయ మైదానంలో ఆదివారం రాత్రి కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, రవీందర్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడారు. సైదాబాద్ వాసులు, భాజపా భాగ్యనగర్ జిల్లా మహిళామోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తల శిక్షణ ప్రారంభం



ప్రసంగిస్తున్న ఎన్.కుటుంబరావు

బండ్లగూడ, న్యూస్‌టుడే: జియో సైన్స్‌లో అద్భుత అవకాశాలు ఉన్నాయని జీఎస్ఐ మాజీ డైరెక్టర్ జనరల్ ఎన్.కుటుంబరావు తెలిపారు. యూపీఎస్సీ ద్వారా ఎంపికైన జియాలజిస్టులు, ఏఈలకు బండ్లగూడ జీఎస్ఐ సంస్థలో శిక్షణ ఇస్తారు. ఇందులో భాగంగా సోమవారం 48వ బ్యాచ్ జియాలజిస్టులకు, 4వ బ్యాచ్ ఏఈలకు నిర్వహించిన శిక్షణ తరగతులకు కుటుంబరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శిక్షణ అనంతరం నిబద్ధతలో పని చేయాలని సూచించారు. శిక్షణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. మాథ్యూ జోసఫ్ మాట్లాడుతూ.. అందుబాటులోని అత్యాధుని సాంకేతికతను ట్రైనీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చీఫ్ ఇంజినీర్ అజయ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం 171 మంది జియాలజిస్టులు, ఐదుగురు ఏఈలకు 9 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. సంస్థ ప్రజా సంబంధాల అధికారి గంజి మల్లేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

దృష్టి మరల్చి.. ఫోన్లు కాజేస్తూ..

ఇటీవల పెరిగిన ఘటనలు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: 'జనసంచారం లేని రహదారిలో నడుచుకుంటూ వస్తున్న వ్యక్తిని గమనిస్తారు. ద్విచక్రవాహనంపై సమీపానికి వచ్చి పడిపోతున్నట్లు నటిస్తారు. అటుగా వెళుతున్న ఆ వ్యక్తి.. అయ్యో పాపం అంటూ పరుగున వచ్చి సాయం చేస్తుండగా, అదే సమయంలో ఫోను కాజేసి, వేగంగా వెళ్లిపోతారు'.. ఈ తరహా చోరీలు ఇటీవల హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెరిగాయి.

హయత్‌నగర్ పరిధిలో ఇలా..

- హయత్‌నగర్ డిపో వద్ద నివాసముండే అంజయ్య మార్చి 27న జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో ఎదురుగా బైక్‌పై వచ్చిన యువకుడు పడిపోతున్నట్లు నటించాడు. అంజయ్య వాహనం దిగి సాయం చేస్తుండగా, మరో బైక్‌పై వచ్చిన ఆగంతుకుడు..అతడి జేబులోని ఫోన్ తీసుకొని పారిపోయాడు.
- భాగ్యలతా కమాన్ సమీపంలోని శారదనగర్‌కు చెందిన ఓ వ్యక్తి సోమవారం సాయంత్రం విధులకు వెళ్తుండగా, ఓ యువకుడు బైక్‌పై వచ్చి అపోలో ఫార్మసీ దగ్గర కిందపడ్డాడు. ఈ వ్యక్తి సాయం చేసేందుకు వెళ్లగా, జేబులోని చరవాణి కాజేసి వేగంగా వెళ్లిపోయాడు.

ప్రత్యేక నిఘా పెడతాం..: నాగరాజు, సీఐ

సాధారణంగా రద్దీ ప్రదేశాలు, వారాంతపు సంతల్లో ఫోన్ల చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోగొట్టుకున్న, చోరీకి గురైన ఫోన్లు రికవరీకి పలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రద్దీ ప్రాంతాల్లో నిఘా పెడుతున్నాం. ప్రజలు సైతం అప్రమత్తంగా ఉండాలి. అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

న్యాయవాదుల రక్షణ చట్టం అవసరం

సైదాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. మలక్‌పేట కల్యాణ్‌నగర్ కాలనీలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రక్షణ చట్టం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సైతం వినతులు పంపినట్లు తెలిపారు.

పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరించాలి

హయత్‌నగర్, ఎల్బీనగర్: ఆటోనగర్, జింకల పార్కు మీదుగా ఉన్న పాత పోచంపల్లి రోడ్డును పునరుద్ధరించాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పాత పోచంపల్లి రోడ్డుకు అడ్డుగా నిర్మించిన గోడను సోమవారం ఆయన, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, స్థానికులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. కళ్లెం రవీందర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అలరించిన దాండియా

కర్మన్‌ఘాట్:సాగర్ ఎన్‌క్లేవ్‌లో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు సోమవారం దాండియా ఆడారు. టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాస్కీ గౌడ్, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్నలు పాల్గొని తిలకించారు. సుధాకర్, సాయి, విష్ణు, సత్యం పాల్గొన్నారు.

ఊరు వెళ్తున్నారా.. జాగ్రత్త

వనస్థలిపురం, న్యూస్‌టుడే: దసరా పండుగకు స్వగ్రామాలకు వెళ్లే ప్రజలు.. పోలీసుల సూచనలు పాటించాలని వనస్థలిపురం సీఐ అశోక్‌రెడ్డి సూచించారు. వనస్థలిపురం పోలీస్ స్టేషన్ వద్ద సోమవారం ఇందుకు సంబంధించిన ప్రచార ఆటోను ప్రారంభించి మాట్లాడారు. విలువైన వస్తువులు, నగదు, ఇతర సామగ్రిని ఇంట్లో ఉంచొద్దని సూచించారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే, పోలీసులకు సమాచారమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సైలు ఏడుకొండలు, అనిల్ కుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగిన బ్రహ్మోత్సవాలు



వనస్థలిపురం, న్యూస్‌టుడే: సచివాలయనగర్ రెడ్ ట్యాంకు సమీపంలోని శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయన బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు సోమవారం పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ కె.లక్ష్మయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ట్యూషన్లు చెబుతూ.. చోరీలు చేస్తూ

బంగారు గొలుసు అపహరణ.. నిందితుడి అరెస్ట్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మహిళల గొలుసులు చోరీ చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజుతో కలిసి వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా వద్దిపట్ల గ్రామానికి చెందిన బొంత అనీల్.. నగరంలోని శాలిబండలో నివాసం ఉంటున్నాడు. స్కూల్, కళాశాల విద్యార్థులకు ట్యూషన్లు చెబుతుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. చేసిన అప్పులు తీర్చడానికి దొంగతనాలు చేస్తున్నాడు. గత నెల 17 పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ సర్వీసు రోడ్డు వద్ద ఓ మహిళ మెడలో 4 తులాల బంగారు గొలుసు, ఈ నెల 4న ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ గ్రామానికి చెందిన భారతమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఎస్ఐ నాగరాజు, క్రైం పోలీసులు అనీల్ నుంచి, ఏడు తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

రెజిమెంటల్‌బజార్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని రైలులో బాంబు ఉందంటూ వచ్చిన ఫోన్‌కాల్ పోలీసులను ఉరుకులు పెట్టించింది. తనిఖీల అనంతరం ఇదంతా బూటకమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. గోదావరిఖనికి చెందిన మధుసూదన్ (26) నగరంలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొండాపూర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం 1 గంటకు వందేభారత్‌లో బాంబు ఉందంటూ డయల్ 100కు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు ఫోన్‌కాల్ ఆధారంగా యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ అతడి నుంచి వివరాలు సేకరించారు. తాను ఐటీ కంపెనీలో పనిచేస్తున్నానని, ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఎవరో హ్యాక్ చేశారని వివరించాడు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మాట్లాడుకున్న మాటలు విని, రైల్లో బాంబు పెట్టారనే భయంతో ఫోన్ చేశానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో పోలీసులు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవటం వల్లనే ఫోన్ కాల్ చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

శివారు.. సమస్యలతో బేజారు

డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానికుల అవస్థలు



బీఎన్‌రెడ్డినగర్ కాలనీలో అధ్వానంగా రహదారి

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ఎల్బీనగర్ నియోజకవర్గం రోజురోజుకు విస్తరిస్తోంది. హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, మన్సూరాబాద్ డివిజన్ల శివారు ప్రాంతాల్లో నూతన కాలనీలు ఏర్పాటవుతున్నాయి. పదుల సంఖ్యలో కాలనీలు ఏర్పాటై.. దశాబ్దం దాటుతున్నా, కనీస వసతులు కరవయ్యాయి. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ, రోడ్లు ఏర్పాటు కాలేదు. నిత్యం మురుగు వీధుల్లో పారుతుండటంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఎక్కడెక్కడంటే..

బీఎన్‌రెడ్డినగర్ పరిధిలో సాహెబ్ నగర్ మారుతీనగర్, గాంధీ నగర్, బ్యాంకు కాలనీ, గాయత్రీ నగర్ ఫేజ్-1, 2, 3, 4, శ్రీనివాసకాలనీ, పాపిరెడ్డికాలనీ, క్రిస్టల్ విల్లాస్, భవాని ఎన్‌క్లేవ్, జక్కిడి రాంరెడ్డి, జక్కిడినగర్ కాలనీ, బృందావన్ మిడోస్, సిద్ధివినాయక నగర్ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేదు. మట్టితో గుంతలు పడిన రోడ్లపైనే మురుగు పారతుండటంతో కాలనీవాసులకు సమస్యలు తప్పడం లేదు. వర్షం కురిస్తే, ఆయా కాలనీల్లో రాకపోకలు సాగించలేని పరిస్థితి. శివారు కాలనీల్లో డ్రైనేజీ పైపులైన్ నిర్మించాలంటే ఔట్‌లెట్ అవసరం. ఆయా కాలనీల మురుగు పారేందుకు మహాలక్ష్మీనగర్ నుంచి మార్గం లేదు. దీంతో క్రిస్టల్ అవెన్యూ వెంచర్ మీదుగా హయత్‌నగర్ జీ స్కూల్ వరకు ట్రంక్‌లైను నిర్మించాలి. ఈ పనులు పూర్తయితేనే, డ్రైనేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

నిధులు కేటాయించాలి..: లచ్చిరెడ్డి, కార్పొరేటర్

సాహెబ్‌నగర్ పరిధిలోని శివారు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ పనులు చేపట్టాలంటే ట్రంక్‌లైన్ అవసరం. ట్రంక్‌లైన్ నిర్మిస్తేనే, ఆయా కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారమవుతుంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు కేటాయించాలి.

ప్రతిపాదనలు పంపాం..: రాజగోపాల్, డీజీఎం

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో ఔట్‌లెట్ ఉన్న కాలనీల్లో ఇప్పటికే డ్రైనేజీ పైపులైన్లు వేశాం. క్రిస్టల్ నుంచి హయత్‌నగర్ జీ స్కూల్ వరకు నూతనంగా రూ.16 కోట్లతో ట్రంక్‌లైన్ నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు చేపడతాం.

డివిజన్: బీఎన్‌రెడ్డినగర్

శివారు కాలనీలు: 11
జనాభా : 10 వేలకు పైగా
ట్రంక్‌లైను దూరం: 5 కిలోమీటర్లు
అంచనా వ్యయం: రూ.16 కోట్లు

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

అమెరికాలో బతుకమ్మ సందడి



చార్మినార్, న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన మహిళలు, బాలికలు అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం అస్టిన్ నగరంలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయ బతుకమ్మ వేడుకలు ప్రతియేటా ఎన్ఆర్ఐ తెలుగు మహిళలు, బాలికలు అమెరికాలోని అస్టిన్‌నగరంలో ఎంతో కోలాహలంగా జరుపుతారని ఈ సందర్భంగా తెలియజేశారు.

బస్టాండులో చెత్తకు నిప్పు



గౌలిగూడ పాత బస్టాండులో పదడుగుల దూరంలో ఆర్‌టీసీ బస్సులు నిలిపి ఉన్నాయి. పక్కనే చెత్తాచెదారానికి నిప్పు పెట్టారు. ఏమాత్రం గాలి వీచిన అగ్గితో ప్రమాదమే అంటున్నారు ప్రయాణికులు. ప్రజలు తిరిగే ప్రాంతంలో ఇలా చెత్తకు నిప్పు పెట్టవద్దని కోరుతున్నారు.



ఆహ్వాన పత్రిక అందిస్తున్న మురళీకృష్ణగౌడ్, దేవర శ్రీనివాస్

విశాల్ జాగరణ కార్యక్రమానికి ఈటలకు ఆహ్వానం

కార్వాన్, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే మాతా వైష్ణవి విశాల్ జాగరణ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం అందించారు. ఈ మేరకు సోమవారం ఉత్సవ సమితి అధ్యక్షుడు ఎన్.మురళీకృష్ణగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ ఈటలను కలిసి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. తమ ఆహ్వానానికి ఎంపీ ఆమోదం తెలిపారని కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి అధ్యక్షుడు తెలిపాడు.

ప్రతాప రుద్ర నిర్మితం.. లక్ష్మీనారాయణ స్వామి ఆలయం





సాలగ్రామంతో తయారైన లక్ష్మీనారాయణుల విగ్రహం, దేవాలయ ముఖ మండపం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: చారిత్రకు సంపదకు నిలయమైన పాతనగరంలో ప్రాచీన కట్టడాలు, పురాతన ఆలయాలు అనేకం. వాటిలో గౌలిపురాలోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం ఒకటి. సుమారు 722 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయం నాటి కాకతీయుల వాస్తు శైలికి దర్పణం పడుతోంది. గౌలిపురా గాంధీబొమ్మ సమీపంలో ఉన్న దేవాలయాన్ని ఓరుగల్లు పాలించిన కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. పదహారు(16) రాతి స్తంభాలతో నిర్మితమైన ఈ ఆలయం ముఖమండపం 1302లో, రథశాల 1368లో నిర్మించినట్లు రాతిశాసనాలు ఇక్కడ లభించాయి.

చరిత్ర.. అప్పట్లో దట్టమైన అడవులతో కూడుకున్న ఈప్రాంతం గుండా ప్రతాపరుద్రుడు ప్రయాణ బడలికతో అలిసి పోయి, ఇక్కడ నిద్రలోకి జారుకోగా అతనికి శివకేశవులు కలలో వచ్చి తమకు ఆలయాలు నిర్మించాలని చెప్పారని, దీంతో ఇక్కడ లక్ష్మీనారాయణ స్వామి, శివాలయం, రాజరాజేశ్వరి దేవాలయాలను నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. బద్రీనాథ్‌లో స్వామి వారి విగ్రహం పోలిన విధంగా ఇక్కడ లక్ష్మీనారాయణ స్వామి విగ్రహాలు సాలగ్రామ (నల్ల శిల)పై సుందరంగా చెక్కి ఉండడం విశేషం. ఆలయ గోపురం నాటి కాకతీయ వాస్తు శైలికి దర్పణం పడుతోంది. అనంతర కాలంలో ముఖ మండపానికి బాలయ్య అనే భక్తుడు మరో నాలుగు రాతి స్తంభాలను చేర్చి, మండప విస్తీర్ణం పెంచారని ప్రతీతి. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే స్వామి వారి రథయాత్రలో భక్తుడు బాలయ్య పేరు స్మరించనిదే రథం ముందుకు కదలదని స్థానికులు చెబుతుంటారు.

మహాభిషేకంతో మొదలు..

– శేషాద్రి అయ్యంగార్, ఆలయ ధర్మకర్త

గౌలిపురా లక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షిక పంచాన్నిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి తిరుమంజనం, మహాభిషేకంతో ప్రారంభం కానున్నాయి. 13వతేదీ వరకు కొనసాగే ఈ ఉత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల్లో భాగంగా 9న ధ్వజారోహణం, 10న సుదర్శనహోమం, 11 వతేదీన లక్ష్మీనారాయణ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం, 12న రథోత్సవం, దసరా ఉత్సవాలు, రావణ దహనం, 13న మహా పూర్ణాహుతి, చక్రస్నానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉత్సవాల సందర్భంగా ఉదయం పంచసూక్త హోమం, సేవాకాలం, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

కార్వాన్, న్యూస్‌టుడే:

? మెహిదీపట్నం, జీవన్‌కల్యాణ్‌నగర్, బస్‌డిపో పరిసర ప్రాంతాలలో విద్యుత్ దీపాలకు అడ్డుగా చెట్లకొమ్మలు ఉన్నాయి.
- టి.పరమేశ్వర్‌రావు, మోహన్, మెహిదీపట్నం.

✓ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాము.
- ఎస్.సత్యనారాయణ, ఆసిఫ్‌నగర్ ట్రాన్స్‌కో సెక్షన్ ఏఈ.

కిషన్‌రెడ్డికి లేఖ రాసిన టీడీసీఏ అధ్యక్షుడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి(టీడీసీఏ) సభ్యత్వం వచ్చేలా బీసీసీఐకి లేఖ రాసి మద్దతు ఇవ్వాలంటూ టీడీసీఏ అధ్యక్షుడు, మాజీ సాట్స్ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వరరెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. దీనిపై ఆయన స్పందించి తెలంగాణ గ్రామీణ క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాల సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చి వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పెండింగ్ పనులు వెంటనే చేపడుతాం

అబిడ్స్, న్యూస్‌టుడే: దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారుల విస్తరణ పనులు వెంటనే పూర్తి చేస్తామని జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ పట్టణ ప్రణాళిక సహాయ అధికారిణి (ఏసీపీ) మంజులా సింగ్ తెలిపారు. ఆబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. బోయిగూడకమాన్ నుంచి మంగళ్‌హాట్, ధూల్‌పేట మీదుగా పురానాపూల్ వరకు ప్రధాన రహదారి విస్తరణ పనులకు సంబంధించి ఇప్పటి వరకు జరిగిన కసరత్తు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అదేవిధంగా గోషామహల్ అలాస్కా జంక్షన్ నుంచి దారుస్సలాం జంక్షన్, ఆగాపురా, సీతారాంబాగ్ మీదుగా మల్లేపల్లి వరకు ప్రధాన రహదారి వెడల్పు పనులు కూడా త్వరలోనే చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని వెల్లడించారు.

పెట్టుబడుల పేరుతో రూ.7.28 లక్షల టోకరా

నారాయణగూడ, న్యూస్‌టుడే: పెట్టుబడుల పేరుతో రూ.7.28 లక్షల మోసం చేశారంటూ ఓ బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి కాగ్నిజెంట్ ప్రతినిధినంటూ ఫోన్ వచ్చింది. పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆగంతుకుడు నమ్మించాడు. ఉద్యోగికి ముందుగా లాభాలివ్వడంతో క్రమంగా రూ.7.28 లక్షలు పెట్టేశారు. దానికి లాభాలు రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'ఉపాధ్యాయ ఉద్యోగాల నియామక పత్రాలు వర్గీకరణ తర్వాతే ఇవ్వాలి'



అసెంబ్లీ ముందు సాష్టాంగ నమస్కారం చేస్తున్న సతీశ్‌మాదిగ, ఇతర నాయకులు

నారాయణగూడ, న్యూస్‌టుడే: అక్టోబరు 9న జరిగే ఉపాధ్యాయ ఉద్యోగాల నియామక పత్రాలను వర్గీకరణ తరువాతే ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవని సతీశ్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట నెగ్గాలని సోమవారం అసెంబ్లీ ముందు సాష్టాంగ నమస్కారం చేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనిపై ఆగస్టు 1న సీఎం అసెంబ్లీలో వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడి, ఉద్యోగ నియామకాల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. కానీ అధికారులు ముఖ్యమంత్రి మాటను పట్టించుకోకుండా ఉద్యోగాల భర్తీ చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాదిగ దండోర నాయకులు శ్యాంసుందర్ మాదిగ, బొల్లె సైదులు, మోజెస్, రాములు తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌పై అవగాహన కార్యక్రమం రేపు

కార్వాన్, న్యూస్‌టుడే: అగ్నివీర్ వాయు రిక్రూట్‌మెంట్‌పై బుధవారం నిరుద్యోగ యువత కోసం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఉపాధికల్పనాధికారి జి.జయశ్రీ తెలిపారు. ఇంటర్, ఏదైనా డిగ్రీ కలిగిన నిరుద్యోగ అభ్యర్థులు తగిన ధ్రువపత్రాలతో విజయనగర్‌కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధికల్పనా కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి నేరుగా హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని వెల్లడించారు.

ప్రజావాణికి 139 అర్జీలు



మహిళతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటాచారి



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 90 విజ్ఞప్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ 22, హౌసింగ్ 59, ట్యాక్స్ విభాగం 5, ఐటీ సెక్షన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, మూసాపేట డిప్యూటీ కమిషనర్‌లకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో వచ్చిన 49 అర్జీల్లో కూకట్‌పల్లి జోన్‌లో 26, శేరిలింగంపల్లి జోన్‌లో 10, సికింద్రాబాద్ జోన్‌లో 7, ఎల్బీనగర్ జోన్‌లో 2, చార్మినార్ జోన్‌లో 3, ఖైరతాబాద్‌లో ఒక్కటి వచ్చాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరిరావు, జేసీ శానిటేషన్ వేణుగోపాల్, అడిషనల్ సీసీపీలు ప్రదీప్ కుమార్, గంగాధర్, హౌసింగ్ యస్ఈ కృష్ణారావు, యస్ఈ ఇంజినీరింగ్ పనపరెడ్డి, ఇరిగేషన్ యస్ఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి 'ప్రజావాణి'

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి దోహదపడుతుందని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్లు వెంకటాచారి, కదిరవన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. 146 దరఖాస్తులు రాగా, వీటిలో 101 గృహ నిర్మాణ శాఖ, 15 పెన్షన్లు, 3 భూ సమస్యలు, కళ్యాణలక్ష్మీకి సంబంధించి ఒకటి, ఇతరత్రా శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 26 వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు జి.ఆశన్న, పెరిక యాదయ్య, ఆర్.కోటాజీ, పవన్‌కుమార్, డాక్టర్ సురేందర్, ఇలియాజ్ అహ్మద్, ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

గర్బా, దాండియా వేడుకలు ప్రారంభం



వేడుకలు ప్రారంభించిన గోవింద్ రాఠీ, చిత్రంలో సురేందర్‌రెడ్డి, వంశతిలక్, హన్మంత్‌రావు తదితరులు

అబిడ్స్, న్యూస్‌టుడే: రాజస్తానీ ప్రగతీ సమాజ్, ఎగ్జిబిషన్ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గర్బా, దాండియా వేడుకల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఉత్సవ సమితి చీఫ్ కన్వీనర్ గోవింద్‌రాఠీ కోరారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సొసైటీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, వంశ తిలక్, హన్మంత్‌రావు తదితరులతో కలిసి వేడుకలను ప్రారంభించారు. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు కొనసాగే ఈ వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. గిరిదారిలాల్ డాగా, మనోజ్ జైస్వాల్, సుమీత్ రాఠీ తదితరులు పాల్గొన్నారు.

ప్రవక్త సందేశాలతో సామరస్య జీవన స్ఫూర్తి

చార్మినార్: మహ్మద్ ప్రవక్త సందేశాలు జనంలో శాంతిసామరస్య జీవన స్ఫూర్తిని కల్పిస్తాయని యాఖుత్‌పుర మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్‌పాషాఖాద్రీ పేర్కొన్నారు. సోమవారం రాత్రి చార్మినార్ వద్ద మజ్లిస్ పార్టీ పత్తర్‌గట్టీ మాజీ కార్పొరేటరు మోసీన్ బలాలా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ మిలాద్ ఉన్ నబీ నాత్ ఏ షరీఫ్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రవక్త సందేశాలపై నిర్వహించే ప్రత్యేక నాత్ ఏ షరీఫ్ జల్సా జనంలో నైతిక విలువల పట్ల చైతన్యం కల్పిస్తాయన్నారు. శాలిబండ కార్పొరేటరు ముస్తాఫా అలీముజఫర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

గోషామహల్, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ముగ్గురు పరారీలో ఉండగా, వినియోగదారులైన 37 మందిపై కూడా కేసులు నమోదు చేసి గాలిస్తున్నారు. ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్ నుంచి జియాగూడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఎక్సైజ్ బృందం రూట్‌వాచ్ చేస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ధూల్‌పేట జాలీహనుమాన్ ప్రాంతానికి చెందిన అభిషేక్‌సింగ్, శుభంసింగ్‌లను అరెస్టు చేశారు. 1.560 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా నగరానికి చెందిన రోహిత్ జాదవ్, మహేందర్‌సింగ్‌లతో ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

22 కిలోల గంజాయి స్వాధీనం..

ధూల్‌పేట, న్యూస్‌టుడే: ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఈఎస్ ఎన్.అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేటకు చెందిన లడ్డూసింగ్, సాగర్‌సింగ్, వైష్ణోసింగ్ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. నగరం వెలుపల ఉన్న బీరంగూడ, అమీన్‌పూర్‌లోని రెండు పడక గదుల ఇళ్లలో గంజాయి నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తుండగా గత నెల 27న వీరిని అరెస్టు చేశారు. వారికి సంబంధించిన గంజాయి నిల్వలు లోయర్ ధూల్‌పేటలో దాచి ఉంచినట్లు సమాచారం అందడంతో సోమవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ధూల్‌పేట స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించి 22.92 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా లోధికిషోర్ సింగ్, జ్యోతి భాయిలను అరెస్టు చేశారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అమ్మ దర్శనం.. ఆధ్యాత్మిక శోభితం



ఛత్రినాక: అమ్మవారిని దర్శించుకున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ



బాంజావాడి తుల్జాభవాని ఆలయంలో కొలువైన జగన్మాత




మహంకాళి ఆలయంలో అమ్మవారి ప్రత్యేక అలంకరణ



ఇసామియాబజార్‌లో అమ్మవారి విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నేతలు



చండీహోమంలో విజిలెన్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు దంపతులు



పూజలు చేస్తున్న మెట్టు సాయికుమార్, చిత్రంలో పరమేశ్వరీసింగ్ తదితరులు

గోషామహల్, గన్‌ఫౌండ్రి, కార్వాన్, చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ శాఖల అధికారులు అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీసింగ్ ఆధ్వర్యంలో మంగళ్‌హాట్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతా అమ్మవారి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● ఉత్సవాల్లో భాగంగా సోమవారం లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయంలో అమ్మవారు వెండి చీర ధరించి స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఛత్రినాక శివగంగానగర్ లక్ష్మణేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్, ఆలయకమిటీ ఛైర్మన్ దామోదర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ట్యూషన్లు చెబుతూ... చోరీలు చేస్తూ..

బంగారు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మహిళల గొలుసులు దొంగతనం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజుతో కలిసి దొంగతనం వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా వద్దిపట్ల గ్రామానికి చెందిన బొంత అనీల్.. నగరంలోని శాలిబండలో నివాసం ఉంటున్నాడు. స్కూల్, కళాశాల విద్యార్థులకు ట్యూషన్లు చెబుతుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అప్పులు చేసి వాటిని తీర్చడానికి దొంగతనాలు చేస్తున్నాడు. గత నెల 17 పహడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ సర్వీసురోడ్డు వద్ద ఓ మహిళ మెడలో 4 తులాల బంగారు గొలుసు, ఈనెల 4న ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ గ్రామానికి చెందిన మొద్దు భారతమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఎస్ఐ నాగరాజు, క్రైం పోలీసులు నిందితుడు అనీల్‌ను గుర్తించి 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.

యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్



సిబ్బందికి సూచనలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్‌వ్యాప్తంగా మురుగు తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి. అక్టోబరు 2వ తేదీ నుంచి 90 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ దిశగా అధికారులు కార్యాచరణ ముమ్మరం చేశారు. ఈ మేరకు సోమవారం ఎండీ అశోక్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించి ఈ పనులను పర్యవేక్షించారు. ఎర్రగడ్డ, హైమావతినగర్‌లలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. దాదాపు 500 ఇళ్లు ఉన్న ఈ ప్రాంతంలో 1979లో నిర్మించిన సీవరేజ్ లైన్ తరచూ పొంగుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరిగినప్పటికీ అవే పాత మురుగు లైన్లు ఉంటున్నాయి. ఒత్తిడి ఎక్కువై మురుగంతా రోడ్లపైకి చేరుతోంది. 90 రోజుల ప్రణాళికలో భాగంగా అలాంటి వాటిని గుర్తించి పరిష్కారం చూపిస్తామని ఎండీ తెలిపారు. కొన్నింటికి తాత్కాలిక మరమ్మతులు చేసి... కొన్ని రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో జలమండలి రెండు అంశాలపై దృష్టి సారించిందన్నారు. నగరంలో కొన్ని ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే కాకుండా.. ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించి వాననీటిని సంరక్షించాలనేది ప్రధాన ఉద్దేశమని ఎండీ వివరించారు.

హిందూ దేశం చేస్తే మిగతా మతస్థులు ఎక్కడికెళ్లాలి: వీహెచ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారత్‌ను హిందూ దేశం చేయాలన్న విశ్వ హిందూ పరిషత్తు(వీహెచ్‌పీ)చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు సమాధానం చెప్పాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్ సెక్యులర్ దేశం, స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఇక్కడ అనేక మతాల వారు ఉన్నారన్నారు. మోహన్ భగవత్ ఆలోచన సరికాదు, హిందూ దేశం చేస్తే ముస్లిం, సిక్కు, ఇతర మతస్థులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. దేశాన్ని.. కులాలు, మతాల పేరిట విభజకండి. ఓట్ల రాజకీయం కోసం దేశాన్ని విభజిస్తారా? అని వీహెచ్ ప్రశ్నించారు.

జేఎన్ఏఎఫ్ఏయూకు పదెకరాల స్థలం కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న పసునూరి దయాకర్. చిత్రంలో గౌరీ శంకర్, రవీందర్‌రెడ్డి, రమణారెడ్డి, పీరం తదితరులు

ఖైరతాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) కొత్త క్యాంపస్ నిర్మాణం కోసం జూబ్లీ హిల్స్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పదెకరాలు కేటాయించడంపై హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, కళాశాల మాజీ ప్రిన్సిపల్స్, మాజీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కళలపై ఉన్న అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. స్థల కేటాయింపును అంబేడ్కర్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది రాజకీయ కోణంలో చూడొద్దని, కొత్త క్యాంపస్ ఏర్పాటుకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణా రెడ్డి, వరంగల్ మాజీ ఎంపీ, పూర్వ విద్యార్థి, శిల్పి పసునూరి దయాకర్, మాజీ ప్రిన్సిపల్స్ ప్రొ.ఎస్.ఎం.పీరం తదితరులు మాట్లాడారు. యూనివర్సిటీ విస్తరణకు స్థలాన్ని కేటాయించి, అందులో అధునాతన వసతులతో క్యాంపస్, థియేటర్ల నిర్మాణం చేపట్టడం వల్ల తెలంగాణ సాంస్కృతిక, కళారంగానికి తలమానికంగా నిలుస్తుందని అన్నారు. అమరవీరుల స్మారకాన్ని నిర్మించింది ఇక్కడి పూర్వ విద్యార్థులేనని, నగరంలో జీవీకే, ప్రసాద్ ఐమాక్స్‌లలో ఏఐ టెక్నాలజీతో రెండు థియేటర్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

రామేశ్వరం ఆలయం షాద్‌నగర్‌కు కీర్తికిరీటం : వీర్లపల్లి



ఎమ్మెల్యే శంకర్‌కు ఆలయంలోకి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

షాద్‌నగర్, న్యూస్‌టుడే: మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతున్న రామేశ్వరం రామలింగేశ్వర క్షేత్రం షాద్‌నగర్‌కు కీర్తికిరీటమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కొనియాడారు. ఫరూక్‌నగర్ మండలం రామేశ్వరం ఆలయాన్ని సోమవారం సందర్శించిన ఆయన ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించిన కలెక్టర్



వివరాలు ఆరా తీస్తున్న శశాంక, ఇతర అధికారులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ గుమ్మకొండకాలనీలో పైలట్ ప్రాజెక్టు కింద నిర్వహిస్తున్న కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక సోమవారం పరిశీలించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నాలుగు రోజులుగా గుమ్మకొండకాలనీలోని ఓ రేషన్ దుకాణం పరిధిలో ఉన్న 900 కుటుంబాలకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. సర్వే జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ అక్కడ అధికారులు, స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవికుమార్, తహసీల్దార్ రాములు, కార్పొరేటర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

చేవెళ్ల, న్యూస్‌టుడే: ముడిమ్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ గోనె ప్రతాప్ రెడ్డి సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. సోమవారం చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల చౌరస్తా నుంచి గ్రామం వరకున్న గుంతలను శిథిలాలతో పూడ్చడంతో ఇరువైపుల మొరం పోయించారు. 2 కిలోమీటర్లుండే ఈ రోడ్డుపై భారీ గుంతలు పడటంతో నిత్యం ప్రమాదాలు జరిగేవని, మరమ్మతులు చేయించిన ప్రతాప్ రెడ్డికి గ్రామస్థులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

కేశంపేట సీఐగా బి.నరహరి



కేశంపేట, న్యూస్‌టుడే: కేశంపేట ఠాణా సీఐగా బి. నరహరి నియమితులయ్యారు. ఎకనామిక్ అఫెన్స్ వింగ్‌లో పనిచేస్తున్న ఆయన్ను కేశంపేటకు బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వచ్చిన సీఐకి ఎస్సై రాజ్‌కుమార్ మొక్క అందించి స్వాగతం పలికారు.

పేరు మారినా.. తీరు మారలే

మెరుగుపడని సర్కారు బడులు ● అసౌకర్యాల మధ్యే విద్యాబోధన

కొత్తూరు, కేశంపేట, జిల్లేడుచౌదరిగూడ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు గత ప్రభుత్వం 'మన ఊరు- మనబడి పథకం' తీసుకొచ్చింది. మధ్యలో ఎన్నికలు జరగడం.. అనంతరం వచ్చిన కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని 'అమ్మ ఆదర్శ పాఠశాల'గా మార్చింది. షాద్‌నగర్ నియోజకవర్గంలో గతంలో చేపట్టిన పనులకే బిల్లులు సరిగా రాకపోవడంతో గుత్తేదారులు సగంలోనే పనులను ఆపేశారు. నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

12 రకాల వసతులు.. 'మన ఊరు- మన బడి' పథకం కింద 12 రకాల వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్, నాన్ టెండర్ విధానంలో పనులు విడదీశారు. అవసరమైన చోట కొత్త భవనాల నిర్మాణం, మరమ్మతులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, వంటగది, నీరు, విద్యుత్తు, లైబ్రరీ, తరగతి గదిలో టేబుళ్లు, బ్లాక్ బోర్డులు వంటి మౌలిక వసతులు కల్పించాల్సి ఉంది. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకానికి అమ్మ ఆదర్శ పాఠశాలగా పేరుమార్చి ఒక్కో పాఠశాలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మరమ్మతులకు మాత్రమే కేటాయించింది. దీంతో కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయి కొత్త కళను సంతరించుకోగా మరి కొన్ని పాఠశాలల్లో బిల్లులు అందక అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఎక్కువ బడుల్లో పనులు మధ్యలోనే నిలవడంతో విద్యార్థులు అసౌకర్యాలమధ్యే విద్యనభ్యసించాల్సి వస్తోంది.

మండలం పేరు	కొందుర్గు	జిల్లేడు చౌదరిగూడ	కేశంపేట	కొత్తూరు	ఫరూక్‌నగర్
ఎంపికైన పాఠశాలలు	12	13	17	11	33
కేటాయించిన నిధులు రూ.కోట్లలో :	2.92	2.87	10.5	4.16	9.27
పూర్తయినవి:	5	0	3	4	2



చౌదరిగూడ పాఠశాలలో మరమ్మతుకు నోచుకోని తాగు నీటి నల్లాలు

ఇదీ పరిస్థితి.. కేశంపేట మండలంలో చేపట్టిన పనులకు ఇప్పటి వరకు విడుదలైన నిధులు రూ.10 లక్షలు మాత్రమే. కొత్తూరులో 80 శాతం పనులు పూర్తవగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రావాల్సి ఉంది. చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో విద్యుత్తు పనులు చేసిన గుత్తేదారు నష్టపోయాడనీ తాగునీటి వసతి పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పాత పథకంలో నందిగామ, కొత్తూరు మండలాలను ఉమ్మడి మండలంగానే పరిగణించారు. ఇక్కడ ప్రగతి దశలోనే పనులు సాగుతున్నాయి. విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికైనా పనులు పూర్తవుతాయో లేదో సందేహంగానే ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి : 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

చేవెళ్ల, న్యూస్‌టుడే: ? చేవెళ్లలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రధాన రహదారి పక్కనే చెత్త వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. –రమేష్,

✓ పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికి తిరిగి చెత్త సేకరిస్తున్నా కొందరు కాలనీవాసులు రోడ్ల పక్కన తెచ్చి వేస్తున్నారు. అలాంటి వారిని గుర్తించి జరిమానా విధిస్తాం. పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగిస్తాం.

–రాఘవేందర్, గ్రామ కార్యదర్శి, చేవెళ్ల

నార్సింగిలో సామాజిక భవనం ప్రారంభం



భవన ప్రారంభ శిలాఫలకం వద్ద ప్రకాష్‌గౌడ్, జ్ఞానేశ్వర్, నాగపూర్ణ తదితరులు

నార్సింగి: నార్సింగి మున్సిపాలిటీ 8వ వార్డులో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన డా.బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముదిరాజ్ కార్పొరేషన్ ఛైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి.క్రిష్ణమోహన్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: మణికొండ చిత్రపురికాలనీ పుప్పాలగూడకు చెందిన సత్యనారాయణ, లలిత తదితరులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ సోమవారం అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్, రామకృష్ణారెడ్డి, జైహింద్‌రావు, కుమార్, శ్రవణ్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న సబితారెడ్డి



పూజలు నిర్వహిస్తున్న సబిత

మొయినాబాద్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి చిలుకూరు బాలాజీ దేవాలయంలో పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం దేవాలయానికి చేరుకున్న ఆమెకు పూజారులు, భారాస కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని బాలాజీకి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలోనూ పూజలు చేశారు. ఆమె చిన్న కుమారుడు కళ్యాణ్ రెడ్డి దంపతులు సైతం దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు.

వేంకటేశ్వర దేవాలయ ప్రాకారంపై అష్టాదశ పీఠాల ఏర్పాటు: బక్కని

షాద్‌నగర్: ఫరూక్‌నగర్ మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాకారంపై అష్టాదశ పీఠాలతో పాటు గుడిలో జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆలయంలో అడుగు పెట్టే భక్తులను ఆధ్యాత్మిక సేవలు అందించే లక్ష్యంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. పురపాలిక ఛైర్మన్ కొందూటి నరేందర్ ఆలయంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింటు, కోఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిశోర్, దామోదర్‌రెడ్డి, కుమార్ గౌడ్, భూపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం ఇవ్వాలి: భాజపా

రాజేంద్రనగర్: శివరాంపల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో పురాతన శివాలయాన్ని పునర్నిర్మిస్తుంటే ఉద్యాన వర్సిటీ అధికారులు స్థలం తమదంటూ అందులోకి వెళ్లకుండా గోడ నిర్మించారని భాజపా నాయకులు వై.శ్రీధర్, బాబురావు ఆరోపించారు. అక్కడ గతంలో పురాతన ఆలయం ఉండగా ఇటీవల వర్షాలకు అది కూలిపోయిందన్నారు. దాని స్థానంలో కొత్త ఆలయం నిర్మాణానికి స్థానికులు శ్రీకారం చుట్టగా ఆ స్థలం తమదంటూ ఉద్యాన కళాశాల అధికారులు అడ్డుతగులుతున్నారన్నారు. దీనిపై ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ నీరజ ప్రభాకర్‌కు వివరించిన ప్రయోజనం లేకపోయిందన్నారు.

అమ్మలగన్న అమ్మ.. సల్లంగా చూడమ్మ



నార్సింగిలో మాతారాణి జాగరణ్ కార్యక్రమంలో..



కొందుర్గులోని మండపంలో..



చేవెళ్లలో భక్తుల పూజలు

కాటేదాన్, నార్సింగి, చేవెళ్ల, షాబాద్, షాద్‌నగర్‌న్యూటౌన్, కొందుర్గు, జిల్లేడుచౌదరిగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అయిదో రోజైన సోమవారం అమ్మవారు మహాచండీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. నార్సింగిలోని లక్ష్మమ్మ ఆలయం ప్రాంగణంలో జైశాంభవి భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మాతారాణి జాగరణ్ వైభవంగా జరిగింది. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామువరకు జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి, భజన గీతాలు ఆలపించారు. జిల్లేడుచౌదరిగూడెం మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజుర్వేద పారాయణ సహిత యజ్ఞం చౌదరిగూడెం నిర్వహిచారు.



షాద్‌నగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సంతానదేవిగా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం: పీవీఆర్

నందిగామ, న్యూస్‌టుడే: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బూత్ స్థాయిలో పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వాలు చేయించాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. నందిగామ మండలంలోని నర్సప్పగూడ, అంతిరెడ్డిగూడ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్టీ బలోపేతం చేయడానికి కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్, మల్లేష్, నర్సింహులుగౌడ్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: భాజపా సభ్యత్వ నమోదుకు విశేష ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్ అన్నారు. అత్తాపూర్‌లో సోమవారం భాజపా ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ... ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా భాజపా నిలిచిందన్నారు. గతంలో దేశంలో 11కోట్ల సభ్యత్వాలు ఉండగా, ఈ సారి 20 కోట్లు చేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్.వెంకటేష్, కొమ్రయ్య, రాజు, సత్యనారాయణ ముదిరాజ్, రాజశేఖర్, కె.సుధాకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి: మధుసూదన్‌రెడ్డి

షాబాద్, బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన్ను నగరంలోని స్వగృహంలో చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. . మూసీ ప్రక్షాళనపై ప్రతిపక్షాలు అవాకులు, చవాకులు పేల్చడం మానుకోవాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మూసీ ప్రక్షాళన చేపట్టి తీరడం ఖాయమని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, చెన్నయ్య, అశోక్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, పెంటారెడ్డి, మజారుద్దీన్ రవీందర్‌నాయక్, జనార్దన్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో



శంకర్‌పల్లిలో వనిత చేయూత మహిళా విభాగం ఆధ్వర్యంలో..



మణికొండలో భారాస మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి తదితరులు

మణికొండ, నార్సింగి, చేవెళ్ల, న్యూస్‌టుడే: బతుకమ్మ వేడుకలతో పట్టణాలు, గ్రామాల్లో కోలాహలం నెలకొంది. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. నార్సింగి పురపాలక సంఘం ఆధ్వర్యంలో కోకాపేట సామాజిక భవన ప్రాంగణంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ నాగపూర్ణ 16 అడుగుల ఎత్తయిన బతుకమ్మకు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. మణికొండ భారాస మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి ఆధ్వర్యంలోల్యాంకోహిల్స్ రోడ్‌లోని హనుమాన్ మందిర ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు అత్యంత వైభవంగా జరిగాయి. శంకర్‌పల్లిలో వనిత చేయూత మహిళా విభాగం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు.

ఘాన్సిమియాగూడలో వీధికుక్కల పట్టివేత

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్ మున్సిపల్ పరిధి ఘాన్సిమియాగూడలో చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసిన నేపథ్యంలో సోమవారం అధికారులు వాటిని బంధించి శస్త్ర చికిత్స కేంద్రానికి తరలించినట్లు పారిశుద్ధ్య విభాగం ఇన్‌స్పెక్టర్ బి.లక్ష్మయ్య తెలిపారు. శంషాబాద్‌లో 16 వందల వీధి శునకాలు సంచరిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా శునకాలకు శస్త్ర చికిత్స చేయించి ఎక్కడివాటిని అక్కడే వదిలేశామన్నారు. చిన్నారులను ఒంటరిగా బయటకు పంపించొద్దని తల్లిదండ్రులకు సూచించారు.

షెఫర్డ్ ఇండియా ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ



కొత్తూరు: షెఫర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ తెలంగాణ కమిటీ ప్రధాన కార్యదర్శిగా రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం ఎస్బీపల్లికి చెందిన ఎమ్మె సత్యనారాయణ నియమితులయ్యారు. హైదరాబాద్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కేంద్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర కమిటీని నియమించారు. తెలంగాణ కురుమ సంఘంతో కలిసి జాతీయ స్థాయిలో గొర్రెల కాపరుల సంక్షేమం కోసం ఈ కమిటీ పని చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మె సత్యనారాయణ తెలిపారు. ఆయా రాష్ట్రాల్లో వివిధపేర్లతో పిలవబడే కాపరులను ఒకే గొడుగు కిందకు చేర్చి వారి హక్కుల సాధనకు కృషి చేయనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. షెఫర్డ్ ఇండియా కమిటీలో చోటు దక్కడంపై స్థానిక కురుమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలని డ్రెస్ మేకర్స్ శిక్షకురాలు గీత అన్నారు. జనశిక్షణ సంస్థాన్ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో కొత్తూరు పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారభించారు. 40 మంది మహిళలకు రెండు బృందాలుగా మూడు నెలలు పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఉచిత శిక్షణతో మహిళల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ రామమోహన్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ

కొందుర్గు, న్యూస్‌టుడే: మండలంలోని 22 గ్రామపంచాయతీల పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, ఏపీడీ చరణ్‌గౌతమ్, ఎంపీడీవో అనురాధ, అంబుడ్స్‌మెన్ సునీత, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజాపూర్ జాతీయ రహదారి పనులు చేపట్టాలి: సీఐటీయూ

మొయినాబాద్: హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పనులు చేపట్టాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మొయినాబాద్‌లో ధర్నా నిర్వహించారు. తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి వికారాబాద్ జిల్లా మన్నెగూడ వరకు తలపెట్టిన రహదారి విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో అలీ దేవేందర్, మహేందర్, చెన్నయ్య, బాలు, రవి, శ్రీను, రవీందర్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని కార్మికుడి బలవన్మరణం

శంషాబాద్, న్యూస్‌టుడే: పని చేస్తున్న పరిశ్రమలోనే ఓ కార్మికుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆర్జీఐఏ ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల సూరారానికి చెందిన జానకీరావు(23) కొంత కాలంగా గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలోని పుష్ప స్టీల్ కంపెనీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఎప్పటిలా పనికి వెళ్లిన జానకీరావు కంపెనీ బాత్‌రూంలో ఉరేసుకున్నాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా శవాగారానికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్

మొయినాబాద్: గుంతలమయంగా మారిన రహదారికి మరమ్మతులు చేయించాలంటూ చందానగర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మొయినాబాద్ ఎంపీడీవో సంధ్యకు వినతి పత్రం అందజేశారు. పెద్దమంగళారం-చందానగర్ గ్రామాల మధ్య రోడ్డు కంకర తేలి గుంతలుగా మారినట్లు.. రోడ్డుపై రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని వివరించారు. చిలుకూరు బాలాజీ దేవాలయం-అపోజిగూడ రోడ్డు సైతం పాడైందన్నారు. కార్యక్రమంలో గణేష్, రాజమల్లేష్, ఎల్లేష్‌గౌడ్, జగపతి, శ్రీకాంత్, నిఖిల్, పవన్‌కుమార్, శ్రీధర్‌చారి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి



చేవెళ్ల గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తల్లారం అనుబంధ గ్రామమైన దుద్దగుకు చెందిన గూడం శ్రీనివాస్40) న్యాలట గ్రామ శివారులో సాంచారీ ఫామ్‌హౌస్‌లో మూడేళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఎప్పటి మాదిరిగానే విధులకు వెళ్లి పనిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అక్కడి సిబ్బంది చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి పట్నం మహేందర్ రెడ్డి వైద్య కళాశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు.

కబ్జా నుంచి నక్షబాటను విడిపించాలని వినతి

నందిగామ: తమ గ్రామ శివారులో కబ్జాకు గురైన నక్షబాటను విడిపించి రాకపోకలకు సహకరించాలని అప్పారెడ్డిగూడ రైతులు నందిగామ తహసీల్దారు రాజేశ్వర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన జంగయ్య నక్షబాటపై ముళ్లకంచె ఏర్పాటు చేసి దారి మూసివేయడంతో అటుగా వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు రైతులు ఏడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

బస్సెక్కుతుండగా మహిళ పర్సు చోరీ

షాద్‌నగర్: షాద్‌నగర్ బస్టాండులో ప్రయాణికురాలి నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. కేశంపేట మండలం చింతకొండపల్లికి చెందిన అలివేలు జడ్చర్లకు వెళ్లేందుకు బస్సెక్కారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె చేతిలో ఉన్న పర్సును దొంగిలించారు. అందులో 2 తులాల బంగారం, రూ.28 వేల నగదు ఉన్నట్లు బాధితురాలు తెలిపారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

స్వేరో సర్కిల్‌కు ప్రొజెక్టర్ బహూకరణ

కేశంపేట: మండల పరిధి కాకునూరులోని స్వేరో సర్కిల్‌కు అంబేడ్కర్ పే బ్యాక్ టు ద సొసైటీ ప్రొజెక్టర్‌ను బహూకరించింది. సోమవారం సొసైటీ ప్రతినిధులు విక్రాంత్, అమృత్‌రావు, సంతోష్ తదితరులు సర్కిల్ కేంద్రాన్ని సందర్శించారు. పోటీ పరీక్షలతో పాటు ఇతర విద్యార్థులకు అవసరమైన డిజిటల్ తరగతుల నిర్వహణ కోసం దీన్ని అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

షాబాద్: షాబాద్ మండలం సర్దార్‌నగర్‌కు చెందిన ఎం. శివకుమార్ తన కిరాణా దుకాణంలో అక్రమంగా ప్రజాపంపిణీ రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదుకాణంలో తనిఖీ చేయగా 20.5 క్వింటాళ్ల బియ్యం లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని శివకుమార్‌పై కేసు నమోదుచేసినట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు.

మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

ప్రజావాణికి 57 వినతులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు 57 వినతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత

మహేశ్వరం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోందని నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం తుక్కుగూడలో 11వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. స్కేటింగ్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కందుకూరు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నరేష్‌గౌడ్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



తుక్కుగూడలోని పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

యాచారం, న్యూస్‌టుడే: క్రీడలకు యువత ప్రాధాన్యం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. యాచారం మండలం మాల్‌లో దసరా సందర్భంగా కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బిట్టు శ్రీనివాస్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను సీఐ శంకర్‌కుమార్‌తో కలిసి ఏసీపీ సోమవారం ప్రారంభించారు.

చెక్కుల అందజేత

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం తహసీల్దార్ నాగార్జున పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, రఘురాములు, అంజాజీ, రమేశ్‌యాదవ్, ఆజీజ్, వెంకయ్య, ఆరీఫ్ పాల్గొన్నారు.

వీధి దీపాల వితరణ

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామ పంచాయతీలో 20 వీధి దీపాలను ఏర్పాటు చేయడానికి ఇదే గ్రామానికి చెందిన యువకుడు జి.రమేశ్‌చారి ఆర్థిక సాయం అందించారు.

సాయన్న విగ్రహావిష్కరణకు భూమి పూజ

మీర్‌పేట, న్యూస్‌టుడే: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై సోమవారం తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు ముదిరాజ్ మహాసభ నాయకులు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు సిద్దాల పెద్దబీరప్ప, కార్పొరేటర్లు ఎడ్లమల్లేష్ ముదిరాజ్, జి.రాంచందర్, పి.భాస్కర్‌రెడ్డి, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

బాలాపూర్, న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరిస్తున్నామని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత తెలిపారు. సోమవారం ఆమె 13, 31వ డివిజన్లలోని సుల్తాన్‌పూర్ టౌన్‌షిప్, శ్రీ విద్యాకాలనీలో రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు ఎస్.బాలునాయక్, పి.సుదర్శన్‌రెడ్డి, వి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లారీ పట్టివేత

యాచారం: అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న లారీని యాచారం పోలీసులు సోమవారం పట్టుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దారుకు లారీని అప్పగించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉప్పరిగూడ గ్రామ పంచాయతీ కార్మికులకు మాజీ సర్పంచి బూడిద రాంరెడ్డి సోమవారం దసరా సందర్భంగా నూతన దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: బాటసింగారం రెవెన్యూ పరిధి జాఫర్ గూడ గ్రామంలోని సర్వే నంబర్ 319 లోని భూదాన భూమిలో ఆక్రమణలను మండల తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది సోమవారం తొలగించారు.

పండగ వేళ.. సంబరాల జోరు

శివారుల్లోని రిసార్ట్స్, ఫాంహౌస్‌ల్లో సందడి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: దసరా పండగకు నగరం నుంచి సొంతూళ్లకు వెళ్లే వారు కొందరైతే.. బంధుమిత్రులతో కలిసి సందడిగా పండగను ఆస్వాదించే వారు మరికొందరు. హైదరాబాద్ నగర వాసుల్లో చాలామంది దసరా పండగను తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఇరుగుపొరుగు వారితో కలిసిమెలిసి నిర్వహించుకోవడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలాంటి వారు తమ అపార్ట్‌మెంట్‌ల వద్ద, ఇళ్ల మధ్య వేడుకలకు సరైన ఏర్పాట్లు చేసుకోవడం కష్టంగా మారుతోంది. ఈ దసరా వేళ అంతా కలిసి నగర శివారుల్లోని ఫాంహౌస్‌ల్లో, రిసార్ట్స్‌లో, ఇతర ప్రైవేటు ప్రాంగణాలను ఎంచుకొని సందడిగా వేడుకలను జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పండగ ఏర్పాట్లను పూర్తి చేసుకున్నారు. పండగ రోజులను అంతా కలిసి దైవ దర్శనాల అనంతరం ప్రత్యేక వేదికల్లో కోలాహలంగా గడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు, ఆహారం, పిండి వంటలు తదితరాలకు ఆర్డర్లు ఇచ్చేశారు.



నగర శివారులోని ఓ రిసార్ట్‌లో..

ప్రముఖ ఆలయాలకు సమీపంలో..

నగరానికి మణిహారమైన అవుటర్ రింగ్‌రోడ్డుకు సమీపంలోని ప్రముఖ ఆలయాల్లో దసరా వేళ దర్శనాల అనంతరం అక్కడికి చేరువలో ఉన్న రిసార్ట్స్‌ను ఎంపిక చేసుకున్నారు. వేదికల వద్దకు చేరుకొని బృందాలుగా సందడి చేసేందుకు పట్టణ వాసులు సిద్ధమయ్యారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు దసరా వేళ ఉత్సాహంగా గడిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. బతుకమ్మ ఆటపాటలు, కోలాటం, దాండియా తదితరాలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. నిత్య జీవితంలో తీరిక లేకుండా గడిపే నగరవాసులు.. పండగ సందర్భంగా ఆటవిడుపు కోరుకుంటూ ఆహ్లాదకరమైన ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించుకోవడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠశాలలకు ఇప్పటికే సెలవులు ఇవ్వడంతో కొన్ని కుటుంబాలు రిసార్ట్స్, ఫాంహౌస్‌ల్లో బస చేస్తున్నారు. పలు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. దీంతో శివారు ప్రాంతాల్లో రిసార్ట్స్ సందడిగా దర్శనమిస్తున్నాయి.



మహేశ్వరం సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో ఏర్పాట్లు..

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

న్యూస్‌టుడే, బాలాపూర్, ఆర్కేపురం

? నాదర్‌గుల్‌లో అంబేడ్కర్ విగ్రహం ముందున్న రోడ్డు అధ్వానంగా మారింది. – సురేందర్, నాదర్‌గుల్

✓ రహదారికి మరమ్మతులు చేస్తాం. – వినీల్‌కుమార్‌గౌడ్, ఏఈ, బడంగ్‌పేట

? ఎస్.ఆర్కేపురంలో రోడ్లు అధ్వానంగా మారాయి. –వైష్ణవి, ఎస్.ఆర్కేపురం

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – సుజాత, జీహెచ్ఎంసీ, సరూర్‌నగర్ డీసీ

చిలుకూరు బాలాజీని దర్శించుకున్న సబితారెడ్డి



చిలుకూరు బాలాజీ దేవాలయంలో సబితారెడ్డి తదితరులు

మొయినాబాద్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి చిలుకూరు బాలాజీ దేవాలయంలో పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం దేవాలయానికి చేరుకున్న ఆమెకు పూజారులు, భారాస కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని బాలాజీకి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలోనూ పూజలు చేశారు. ఆమె వెంట చిన్న కుమారుడు కళ్యాణ్ రెడ్డి దంపతులు సైతం దేవాలయంలో పూజల్లో పాల్గొన్నారు.

ప్రజల సమస్యలపై పోరాటం



బడంగ్‌పేటలో సభ్యత్వం అందిస్తున్న శ్రీరాములుయాదవ్

బాలాపూర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడతామని మహేశ్వరం భాజపా ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ తెలిపారు. బడంగ్‌పేటలో బీజేవైఎం అధ్యక్షుడు ఆర్.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధ్యక్షుడు సీహెచ్.వెంకట్‌రెడ్డి, సభ్యత్వ నమోదు కన్వీనర్ ఎన్.యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి తోడ్పాటు



తుక్కుగూడలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఛైర్‌పర్సన్ హేమలత

మహేశ్వరం, న్యూస్‌టుడే: తుక్కుగూడ పురపాలక పరిధిలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని ఛైర్‌పర్సన్ బరిగెల హేమలత అన్నారు. సోమవారం పురపాలక కార్యాలయ ఆవరణలో కమిషనర్ వెంకట్రామ్‌తో కలిసి హేమలత కార్మికులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శివకుమార్, విలాస్, లావణ్య, భావన, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి దందా.. 8మందిపై కేసు



మహేశ్వరం పోలీసులు సీజ్ చేసిన మూడు టిప్పర్లు

ఈనాడు కథనానికి స్పందన

మహేశ్వరం, న్యూస్‌టుడే: 'సర్కారు భూమిలో మట్టి పక్కదారి' శీర్షికన ఈనెల 6న 'ఈనాడు'లో వచ్చిన కథనానికి మహేశ్వరం పోలీసులు స్పందించారు. తుమ్మలూరు, మహేశ్వరం గ్రామాలలోని మట్టి తవ్వకాలు, అక్రమ తరలింపుపై దృష్టి పెట్టారు. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు వెంకట్ రెడ్డి, మధుసూదన్ తదితరులు.. ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. రెండుచోట్ల అసైన్డ్ భూమిలో మట్టి తవ్వుకునేందుకు విక్రయించిన ఇద్దరు రైతులపై, మట్టి రవాణాకు చెందిన ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. మూడు టిప్పర్లు, మూడు పొక్లెయిన్లు సీజ్ చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు



మీర్‌పేట ప్రశాంతిహిల్స్‌కాలనీ ఫేజ్-2లో..



నాదర్‌గుల్‌లో మేయర్ పారిజాత



జల్‌పల్లి శ్రీరామకాలనీలో భారాస నేత కార్తీక్‌రెడ్డి



ఆర్కేపురంలో..

బాలాపూర్, మీర్‌పేట, యాచారం, పహాడీషరీఫ్, మహేశ్వరం, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, కడ్తాల్, ఆర్కేపురం, ఆదిభట్ల, న్యూస్‌టుడే: ఆయా గ్రామాల్లో సోమవారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. కొన్నిచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



బాటసింగారంలో...



ఆమనగల్లు వాసవీ ఆలయంలో..



కొత్తపేటలో..



మైసిగండి శివాలయంలో..



ఇబ్రహీంపట్నంలో..



కొంగరరావిర్యాలలో..



మహేశ్వరంలో...

గుంతలమయంగా రహదారి

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ నుంచి హరిపురి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామ పంచాయతీ కార్మికులు, సిబ్బందితో కలిసి కందుకూరు ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ సరితకు అందజేశారు. కార్యక్రమంలో బాలరాజ్‌గౌడ్, మాధవ్, జంగయ్య, నర్సింహ, పాండు, బాలయ్య, యాదమ్మ, బాలమ్మ,సుగుణమ్మ, పద్మరాణి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో మంత్రికి ఘన స్వాగతం



కడ్తాల్, (ఆమనగల్లు), న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. నూతన కార్యాలయంలో మంత్రిని ఎమ్మెల్యే సత్కరించారు. ముందుగా మంత్రి.. కార్యాలయ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. కొత్త కార్యాలయంలో తహసీల్దార్ ముంతాజ్‌తో సంతకం చేయించారు. పలు సమస్యలు పరిష్కరించాలని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్.. మంత్రికి వినతిపత్రం అందజేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని మంత్రికి పలువురు వినతిపత్రం అందజేశారు.

సైబర్ మాయగాళ్లను పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న మాయగాళ్లను పట్టుకునేందుకు నగర పోలీసులు సిద్ధమయ్యారు. కంబోడియా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాల్లో పాగా వేసిన కేటుగాళ్లు భారతదేశంలో దళారులను ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నారు. ఫెడెక్స్ కొరియర్, సెక్స్‌టార్షన్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట సామాన్యులకు వలవేసి రూ.కోట్లు వసూలు చేస్తున్నారు. కమీషన్ ఆశచూపి బ్యాంకు ఖాతాలను అద్దెకు తీసుకొని తమ గుట్టు బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. తాజాగా మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌కు చెందిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరి ద్వారా సేకరించిన వివరాలతో విదేశాల్లో ఉన్న 18 మంది కీలక నిందితులను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు జారీచేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

యాచారం: యాచారం మండలం గున్‌గల్ జడ్పీ ఉన్నత పాఠశాల 1994-95లో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం సమావేశమయ్యారు. నాటి ఉపాధ్యాయులు వెంకటయ్య, బుగ్గయ్య, ఆంజనేయులు, నరసింహారెడ్డి తదితరులను సన్మానించారు.



గున్‌గల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో..



కోహెడ గ్రామంలో..

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: 1975-1976వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం హైదరాబాద్ శివారు కోహెడ గ్రామంలో సమావేశమయ్యారు.

అక్రమంగా తరలిస్తున్న 150 గోవుల స్వాధీనం

ముగ్గురు లారీ డ్రైవర్లపై కేసు నమోదు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ సమీపంలోని ఇబ్రహీంపట్నానికి అక్రమంగా తరలిస్తున్న 150 గోవులను గంపలగూడెం పోలీసులు ఆదివారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులు వరుసగా రెండో రోజు కూడా వాహనాల తనిఖీ ద్వారా గోవుల అక్రమ రవాణాకు చెక్ పెట్టారు. ఎస్సై శ్రీను తన సిబ్బందితో అక్కడికి వెళ్లి ఆవులు, 3 లారీలను స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్లను విచారించగా శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ సమీప ఇబ్రహీంపట్నం తరలిస్తున్నట్లు బదులిచ్చారు. ఆవులను రాజధాని అమరావతి సమీప తుళ్లూరు మండలం అనంతవరం వద్ద ఉన్న గోశాలకు సోమవారం తరలించామన్నారు. నెమలికి చెందిన జోనబోయిన వెంకటకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోమాతల అక్రమ రవాణాపై సోమవారం ఉదయం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్లైన తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా మంచాలకు చెందిన రామవత్ మోహన్, మాడుగులకు చెందిన రట్లావత్ శంకర్, వెల్దండకు చెందిన కొర్ర సురేష్‌ను అరెస్టు చేశామన్నారు. మూడు లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుక



తుక్కుగూడ జాగృతి మహిళా డిగ్రీ కళాశాలలో..



మహేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

మహేశ్వరం, యాచారం, న్యూస్‌టుడే: మహేశ్వరం జూనియర్ కళాశాలతో పాటు తుక్కుగూడలో జాగృతి మహిళా డిగ్రీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. జాగృతి డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ జయశ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జంగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్వర్టు మరమ్మతుల్లో నిర్లక్ష్యం

వంతెన నిర్మాణాన్ని పట్టించుకోని పాలకులు, అధికారులు

జల్‌పల్లి, న్యూస్‌టుడే: వర్షాల కారణంగా దెబ్బతిన్న కల్వర్టులతో జల్‌పల్లి మార్గాలు ప్రమాదకరంగా మారాయి. ఓవైపు విమానాశ్రయానికి చుట్టూ పదుల సంఖ్యలో అంతర్జాతీయ ప్రమాణాలతో రహదారులు నిర్మిస్తున్నారు. మరోవైపు నవాబుల కాలం నాటి చారిత్రక జల్‌పల్లి మార్గాలన్నీ మూసుకుపోతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. 2020 సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాల తాకిడికి మామిడిపల్లి, పహాడీషరీఫ్ బస్తీల మధ్య రహదారిపై ఉన్న కల్వర్టు కుప్పకూలి జల్‌పల్లి పెద్దచెరువు వరదలో కొట్టుకుపోయింది. నాడు మంత్రిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి వెంటనే వంతెనను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా ఫలితం లేదు. జల్‌పల్లి, శ్రీశైలం మార్గం మధ్యలో ఉన్న ప్రధాన రహదారిలోని కల్వర్టు శిథిలావస్థకు చేరి మూడేళ్లు అయింది. అప్పట్లో మంత్రి, అధికారులు దీనిపై చర్చించి ఎనిమిది నెలల పాటు ఈ రోడ్డుపై రాకపోకలు సాగకుండా మూసివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇప్పటికీ ఈ కల్వర్టును బాగుచేయలేదు. కొత్త రోడ్డును నిర్మించి తిరిగి రాకపోకలు ప్రారంభించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వంతెనపై వాహనాల రాకపోకల సందర్భంలో శబ్దాలు వస్తుండడంతో వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు చేపట్టి ఈ సమస్యను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



సెప్టెంబరులో మామిడిపల్లి, పహాడీషరీఫ్ మార్గంలో కొట్టుకుపోయిన కల్వర్టు



సరూర్‌నగర్‌లో అకాడమీని ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణయ్య

స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం

సరూర్‌నగర్, న్యూస్‌టుడే: సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలో సోమవారం ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు చల్లా పవన్‌కుమార్, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ట్యూషన్లు చెబుతూ... చోరీలు చేస్తూ..

బంగారు గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మహిళల గొలుసులు దొంగతనం చేసిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజుతో కలిసి దొంగతనం వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా వద్దిపట్ల గ్రామానికి చెందిన బొంత అనీల్.. నగరంలోని శాలిబండలో నివాసం ఉంటున్నాడు. స్కూల్, కళాశాల విద్యార్థులకు ట్యూషన్లు చెబుతుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. అప్పులు చేసి వాటిని తీర్చడానికి దొంగతనాలు చేస్తున్నాడు. గత నెల 17 పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుటర్ సర్వీసురోడ్డు వద్ద ఓ మహిళ మెడలో 4 తులాల బంగారు గొలుసు, ఈనెల 4న ఇబ్రహీంపట్నం సమీపంలోని శేరిగూడ గ్రామానికి చెందిన మొద్దు భారతమ్మ మెడలోని 3 తులాల బంగారు గొలుసు చోరీ చేశారు. ఎస్ఐ నాగరాజు, క్రైం పోలీసులు నిందితుడు అనీల్‌ను గుర్తించి 7 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు తరలించారు.



అన్నపూర్ణాదేవిగా బల్కంపేట ఎల్లమ్మ

బల్కంపేట: ఎల్లమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలవిరాట్‌ను వివిధ రకాల డ్రై ఫ్రూట్స్‌, 108 కేజీల 21 రకాల మిఠాయిలతో తీర్చిదిద్దారు.



లలితాదేవిగా జూబ్లీహిల్స్‌ పెద్దమ్మ

జూబ్లీహిల్స్‌: పెద్దమ్మతల్లి సోమవారం లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కనకాంబరం రంగు చీర, చేతిలో చెరకుగడ, పాశాంకుశాలను ధరించి భక్తులను అలరించారు.



మహాచండీ దేవిగా ప్రత్యంగిరా మాత

ఆర్కేపురం: కుర్తాళం పీఠంలో వారాహి సమేత ప్రత్యంగిరా దేవి మహాచండీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. విశేష అభిషేకం, హోమం నిర్వహించారు.



భవానీదేవిగా శ్రీఉజ్జయిని మహాకాళీ

సికింద్రాబాద్: శ్రీఉజ్జయిని మహాకాళీ అమ్మవారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ భవానీదేవిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కృత్రిమ మేధ సాంకేతికతతో విప్లవాత్మక మార్పులు



ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అజయ్‌మిశ్రా తదితరులు

మాదాపూర్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం బ్లూ క్లౌడ్‌ సాఫ్ట్‌టెక్‌ సొల్యూషన్స్‌ కంపెనీవారు కృత్రిమ మేధ ఆధారంగా రూపొందించిన నాలుగు కొత్త అప్లికేషన్లను ఆవిష్కరించారు. బ్లూ క్లౌడ్‌ సాఫ్ట్‌టెక్‌ సొల్యూషన్స్‌ చీఫ్‌ టెక్నాలజీ ఆఫీసర్‌ విజయ్‌బాబు, బ్లూ క్లౌడ్‌ సాఫ్ట్‌టెక్‌ కంపెనీ గ్లోబల్‌ సేల్స్‌ డైరెక్టర్‌ నాథ్‌ తోట, రెడ్‌ క్రాస్‌ సొసైటీ ఛైర్మన్‌ డా. అజయ్‌మిశ్రా, బ్లూ క్లౌడ్‌ సంస్థ ప్రతినిధులు డా. కె.అఖిల, జనార్దన్‌, కీర్తిప్రియ తదితరులు పాల్గొన్నారు.



ఎల్బీ స్టేడియంలో ఈనెల 9న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉపాధ్యాయ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సూచించారు. సోమవారం విద్యుత్‌ శాఖ ఎండీ ముష్రాఫ్‌ అలీ, కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి, ఆర్‌అండ్‌బీ కార్యదర్శి హరిచందన, అదనపు డీజీపీ మహేష్‌ భగవత్‌, నగర అదనపు (ట్రాఫిక్‌) పోలీసు కమిషనర్‌ విశ్వప్రసాద్‌ ఏర్పాట్లు పరిశీలించారు. – న్యూస్‌టుడే, నారాయణగూడ

మొక్కే కదా అని వదిలేస్తే..

నగరంలో గుట్టుగా గంజాయి పెంపకం

● మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌కు చెందిన 19 ఏళ్ల యువకుడు స్థానిక రైల్వే ట్రాక్‌ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గట్టిగా ప్రశ్నించగా.. రైల్వే ట్రాక్‌ పక్కన గంజాయి మొక్కలు పెంచుతున్నట్లు అంగీకరించాడు. ● బిహార్‌కు చెందిన యువకుడు దూలపల్లిలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతని నివాసం వద్ద కొత్తరకం మొక్కలు పెంచుతున్నట్లు సమాచారం అందుకున్న మేడ్చల్‌ ఆబ్కారీ పోలీసులు దాడి చేయగా గంజాయి అని తేలింది.



ఆబ్కారీ సిబ్బంది గుర్తించిన గంజాయి మొక్కలు

నగరంలో గంజాయి మొక్కల పెంపకం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల నుంచి ఓవైపు పెద్దఎత్తున గంజాయి సరఫరా అవుతుండగా.. కొందరు కేటుగాళ్లు ఇక్కడే సొంతంగా మొక్కలు పెంచడం పోలీసు, ఆబ్కారీ శాఖకు సవాల్‌గా మారింది. గంజాయి స్మగ్లింగ్‌, విక్రయాలపై నిఘా పెరగడం, పట్టుబడితే కఠినంగా శిక్షలు తప్పవన్న కారణంతో కొందరు ఇంటి ఆవరణలో, నగర శివార్లలో మొక్కలు పెంచుతున్నారు. ● ఆబ్కారీ శాఖ ఈ ఏడాది సెప్టెంబరు వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో 663 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకుంది. సెప్టెంబరులోనే 203 మొక్కలను పట్టుకున్నారు. ● నగరంలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అయ్యే గంజాయిలో దాదాపు 40 శాతం ధూల్‌పేట నుంచే వెళ్తోంది. ● ఏవోబీలో కిలో రూ.3 వేలుగా ఉన్న గంజాయి ధర నగరానికి సరఫరా అయిన తరువాత రూ.30 వేలకు చేరుతోంది.

ఈనాడు, హైదరాబాద్‌

120 బస్‌షెల్టర్లు అత్యవసరం

400 షెల్టర్ల నిర్మాణాలకు ఏళ్లుగా ప్రతిపాదనలు

హైదరాబాద్‌లో అవసరమైన బస్‌ షెల్టర్లు లేకపోవడంతో ఎండా, వానల్లో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్‌ పరిధిలో 2800 బస్సుల్లో నిత్యం 19 లక్షల మంది ప్రయాణిస్తుంటారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆ సంఖ్య మరింత పెరిగింది. ప్రస్తుతం 1370 బస్సు షెల్టర్లు వేర్వేరు ప్రాంతాల్లో ఉండగా 400కు పైగా ప్రాంతాల్లో షెల్టర్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో 120 ప్రాంతాల్లో అత్యవసరంగా నిర్మించాలి. ఎప్పటి నుంచో ఈ ప్రతిపాదనలు జీహెచ్‌ఎంసీ వద్ద ఉండగా దీనిపై ఇప్పటి వరకు స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు.



లంగర్‌హౌజ్‌ వద్ద..

ఈ మార్గాల్లో ఇబ్బందులు..

పంజాగుట్ట మార్గంలో ప్రయాణికులు ఎక్కువ. అయితే కూడలికి సమీపంలో షెల్టర్‌ నిర్మించడం ఇబ్బందిగా మారింది. బస్సు ఆగితే వెనకాల వచ్చే వాహనాలు ఆగిపోవాల్సి వస్తుండటం రద్దీ ఏర్పడుతోంది. వీటితో పాటు హిమాయత్‌నగర్‌రోడ్డు, అమీర్‌పేట్‌, కోఠి, ఉప్పల్‌, లంగర్‌హౌజ్‌, చందానగర్‌, మెహిదీపట్నం నుంచి శంషాబాద్‌ మార్గం తదితర మార్గాల్లో బస్‌ షెల్టర్లు అందుబాటులో లేవు. మరోవైపు హైటెక్‌సిటీ, మాదాపూర్‌, జూబ్లీహిల్స్‌, ఫిల్మ్‌నగర్‌, సోమాజిగూడ ప్రాంతాల్లో అవసరానికి మించి షెల్టర్ల నిర్మాణాలు చేపట్టారు. ఐటీ ఉద్యోగులు, ఎక్కువగా క్యాబ్‌లు, ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతున్నారు. బస్‌షెల్టర్ల ఏర్పాటులో జాప్యం, నిర్వహణ లోపం కారణంగా ఆర్టీసీ ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. అయితే ఆర్టీసీ అధికారులతో కలిసి జాయింట్‌ సర్వే నిర్వహించనున్నట్టు బల్దియా చెబుతోంది. 80 షెల్టర్ల నిర్మాణానికి సంయుక్తంగా సర్వే చేపట్టనున్నట్టు ఓ అధికారి వెల్లడించారు.

ఈనాడు, హైదరాబాద్‌

పనిచేయని బోరుకు ప్రాణం

● సమాంతరంగా ఇంజక్షన్‌ వెల్స్‌ ఏర్పాటు



చాలా కాలంగా చుక్క నీరు రాకుండా.. మూలకు చేరిన జలమండలి బోర్లు తిరిగి ప్రాణం పోసుకోనున్నాయి. గ్రేటర్‌ వ్యాప్తంగా ఈ వినూత్న ప్రక్రియకు జలమండలి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేసింది. లేదంటే వచ్చే వేసవి నుంచి అలాంటి ఇళ్లకు నీటి ట్యాంకర్లను మూడు రెట్ల ధరకు విక్రయించనున్నారు. ఇందులో భాగంగా పనిచేయకుండా ఉన్న బోర్ల వద్ద ఇంజక్షన్‌ వెల్‌లను ఏర్పాటు చేసి తిరిగి వాటిని పనిచేసేలా చేయనున్నారు. గ్రేటర్‌ వ్యాప్తంగా జలమండలి చెందిన 3,222 వరకు పవర్‌ బోర్లు, చేతి పంపులు ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో కొన్ని పనిచేయడం లేదు. ఎండిపోయిన బోరుకు సమాంతరంగా ఇంజక్షన్‌ వెల్‌ ఏర్పాటు చేయనున్నారు. వర్షపు నీరు ఆ ఇంజక్షన్‌ వెల్‌లోకి పంపనున్నారు. ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరిగి తిరిగి బోర్లు పనిచేయనున్నాయి. దీనివల్ల మరో సారి బోరు ఎండిపోయే పరిస్థితి ఉండదు.

నగరంలో జలమండలికి చెందిన బోర్‌ వెల్స్‌ ఇలా..

మొత్తం పవర్‌ బోర్లు	2,796
పనిచేయనివి	942
కూలినవి	84
మొత్తం చేతి పంపులు	3070
పనిచేయనవి	1717
కూలిపోయినవి	339

ఈనాడు, హైదరాబాద్‌

కాపర్‌ ల్యాండ్‌లైన్లకు.. కాలం చెల్లినట్లేనా?

సిటీలో 40వేల కనెక్షన్లు.. ఫైబర్‌లోకి మారాలంటున్న బీఎస్‌ఎన్‌ఎల్‌

నగరంలో ఇప్పటికీ ల్యాండ్‌లైన్‌ ఫోన్లను ఇళ్లు, కార్యాలయాల్లో వినియోగిస్తున్నారు. వీటిలో 40వేల దాకా బీఎస్‌ఎన్‌ఎల్‌కు చెందిన కాపర్‌ ఆధారిత కనెక్షన్లు ఉన్నాయి. బ్రాడ్‌బ్యాండ్‌ సేవలకు కూడా వినియోగిస్తున్నారు. మెరుగైన సేవల కోసం వీటిని ఫైబర్‌లోకి మార్చుకోవాలని వినియోగదారులను బీఎస్‌ఎన్‌ఎల్‌ కోరుతుంది.



నిర్వహణ కష్టమని.. : గ్రేటర్‌లో బీఎస్‌ఎన్‌ఎల్‌కు విస్తృతమైన ఫైబర్‌ నెట్‌వర్క్‌ ఉంది. ఫైబర్‌ టూ ద హోమ్‌ పేరుతో బ్రాడ్‌బ్యాండ్‌ కనెక్షన్లు ఇస్తోంది. అదే సమయంలో తొలినాళ్లలో వేసిన కాపర్‌ ఆధారిత నెట్‌వర్క్‌ కల్గిన కనెక్షన్లు సిటీలో ఉన్నాయి. వీటిలో నెట్‌వర్క్‌ లోపాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి. నిర్వహణ కూడా బీఎస్‌ఎన్‌ఎల్‌కు సవాల్‌గా మారింది. కాబట్టి కాపర్‌ నుంచి ఫైబర్‌కు మారాలని వినియోగదారులను అభ్యర్థిస్తుంది.

సానుకూలతల దృష్ట్యా.. కాపర్‌తో పోలిస్తే ఫైబర్‌లో ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. అధిక బ్యాండ్‌విడ్త్‌ కల్గి ఉండటం, సిగ్నల్‌ లోపాల సమస్యలు తక్కువ. అయితే కాపర్‌ నుంచి ఫైబర్‌కు మారాలంటే ప్యాకేజీలను ఎంపిక చేసుకోవాలి. కాపర్‌ నుంచి ఫైబర్‌కు మారేందుకు ఎలాంటి సర్వీస్‌ ఛార్జీలు ఉండవని బీఎస్‌ఎన్‌ఎల్‌ చెబుతోంది.

4జీ నెట్‌వర్క్‌ నవీకరణ..

హైదరాబాద్‌ బిజినెస్‌ ఏరియా పరిధిలో 1500 ప్రాంతాల్లో టవర్లను 4 జీ నెట్‌వర్క్‌లోకి నవీకరిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని బీఎస్‌ఎన్‌ఎల్‌ ప్రయత్నిస్తోంది. మరిన్ని సేవల ఆధునికీకరణపై దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు.

ఈనాడు, హైదరాబాద్‌

ముగ్గురిని బలిగొన్న బస్సు

బీదర్, న్యూస్‌టుడే : కర్ణాటకలోని జిల్లా కేంద్రం బీదర్‌ దేవవన పార్కు సమీపంలో సోమవారం సాయంత్రం సంభవించిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన జగన్నాథ్‌ (35), రేణుక (34), వినోద్‌ (14) అనే వారు మరణించారు. జగన్నాథ్‌, రేణుక దంపతులు. వినోద్‌ వారి కుమారుడు. బీదర్‌లో ఉంటూ వీరు వ్యవసాయం చేసుకుంటున్నారు. పొలం పనులు ముగించుకుని ముగ్గురూ ఒకే బైకులో ఇంటికి వెళుతుండగా.. హైదరాబాద్‌ నుంచి బీదర్‌కు వస్తున్న బస్సు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాద తీవ్రతకు ముగ్గురూ అక్కడికక్కడే మరణించారు. బీదర్‌ నగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సమగ్ర కులగణన చేపట్టాలి



నిరసన తెలియజేస్తున్న రాజేందర్‌ పటేల్‌గౌడ్‌

కాచిగూడ, న్యూస్‌టుడే: ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం వెంటనే సమగ్ర కులగణనను చేపట్టాలని జాతీయ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. కులగణన చేపట్టాలని కోరుతూ సోమవారం కాచిగూడలో నేతలు పులిజాల కృష్ణ, సీహెచ్‌ ప్రదీప్‌గౌడ్‌, భూషణ్‌భాస్కర్‌ తదితరులతో కలిసి చేపట్టిన నిరసన కార్యక్రమంలో రాజేందర్‌ పటేల్‌గౌడ్‌ మాట్లాడారు. కులగణనకు జీవో జారీ చేసి నిధులను కేటాయించిన ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్‌ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే కులగణనకు హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.



ఆకట్టు.. కొనేట్టు

వినియోగదారులను ఆకట్టుకోవడం.. వారితో ఏదైనా వస్తువును కొనిపించడం అంటే ఆషామాషీ కాదు. తానూ స్వయంగా ధరించి ఖైరతాబాద్‌ కూడలి వద్ద మాస్కులు విక్రయిస్తున్న మహిళ.

చెరువులకు పూర్వ వైభవం

● హైడ్రా ఆధ్వర్యంలో కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్: ఓఆర్‌ఆర్‌ లోపలి చెరువులకు వాస్తవ రూపం ఇచ్చేందుకు హైడ్రా సిద్ధమైంది. ఆక్రమణల తొలగింపు, వ్యర్థాలను వెలికితీయడం వంటి చర్యలతో జలవనరులకు పూర్వ వైభవం కల్పించే చర్యలను ప్రారంభించింది. మొదటగా మాదాపూర్‌లోని సున్నంచెరువు, ఎర్రకుంట, గగన్‌పహాడ్‌లోని అప్పాచెరువు, కూకట్‌పల్లిలోని నల్లచెరువులకు పునరుజ్జీవం కల్పించేందుకు హైడ్రా కమిషనర్‌, చెరువుల పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌ ఏ.వి.రంగనాథ్‌ సిద్ధమయ్యారు. చెరువులన్నింటి హద్దులను పక్కాగా గుర్తించే చర్యల్లో భాగంగా సోమవారం ట్యాంక్‌బండ్‌ బుద్ధభవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. నీటిపారుదలశాఖ, రెవెన్యూ, నేషనల్‌ రిమోట్‌ సెన్సింగ్‌ ఏజెన్సీ, స్టేట్‌ రిమోట్‌ సెన్సింగ్‌ అప్లికేషన్‌ సెంటర్‌, సర్వే ఆఫ్‌ ఇండియా అధికారులతో ఆయన చర్చించారు.

భువనేశ్వర్‌లోని యాప్‌ తరహాలో.. ఒడిశాలోని భువనేశ్వర్‌లోనూ ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలు పెరుగుతుండటంతో.. అక్కడి సర్కారు దేశంలోనే మొదటిసారి 2020లో ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఆక్రమణలను నిమిషాల్లో పసిగట్టే బీఎల్‌యూఐఎస్‌ (భువనేశ్వర్‌ ల్యాండ్‌ యూజ్‌ ఇంటెలిజెన్స్‌ సిస్టమ్‌) పేరిట కొత్త వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ స్థలాన్నింటికీ అక్షాంశాలు, రేఖాంశాలు, సర్వే నెంబర్లతో హద్దులను నిర్ణయించారు. భూములు ఏ రెవెన్యూ గ్రామం, పోలీస్‌ స్టేషన్‌, నగరపాలక సంస్థ పరిధిలో ఉన్నాయి, ఇతర వివరాలతో డిజిటల్‌ పటాన్ని రూపొందించారు. అందులో ఏవైనా మార్పులు చోటు చేసుకోగానే సంబంధిత అధికారికి వెంటనే సందేశం వెళ్లేట్లు సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశారు.

హిమాయత్‌సాగర్‌ మాదిరి.. టన్నుల కొద్దీ వ్యర్థాలతో, ఆక్రమణలతో కుంచించుకుపోయిన జలవనరులకు పూర్వ స్థితిని తీసుకురావడమే హైడ్రా ప్రధాన లక్ష్యమని సమావేశంలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు రంగనాథ్‌ స్పష్టం చేశారు. శాస్త్రీయంగా తటాకాల పూర్తిస్థాయి నీటి మట్టం(ఎఫ్‌టీఎల్‌) నిర్ధారణకు తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. ఎన్‌ఆర్‌ఎస్‌ఏ, ఇతర సంస్థల వద్దనున్న 45ఏళ్ల నాటి నగరపటాల్లోని చెరువుల విస్తీర్ణం, నీటి పారుదలశాఖ వద్దనున్న హద్దులను సరిపోల్చితే అసలైన హద్దులు తేలతాయని నిర్ణయించారు. భూమి సర్వే నెంబర్లు, జలవనరులు, పచ్చదనం వంటి వివరాలతో కూడిన గ్రామ పటాలనూ పరిశీలిద్దామని అభిప్రాయం వ్యక్తం చేశారు. హిమాయత్‌సాగర్‌తో ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ జోన్ల గుర్తింపు ప్రారంభించి, అదే విధానాన్ని అన్ని చెరువులకు వర్తింపజేయాలని, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న చెరువుల పరిరక్షణ విధానాలపైనా సమీక్షించాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి



షేక్‌ మదీనా భాషా, శ్రావణ్‌కుమార్‌

బాలాపూర్, న్యూస్‌టుడే: ఒకరు విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా.. మరొకరు విధులు ముగించుకుని ఇంటికి వెళుతూ.. ఇద్దరూ అనుకోకుండా కలుసుకుని బయలుదేరిన 5 నిమిషాల వ్యవధిలోనే మృత్యువాతపడ్డారు. లారీ ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌ కె. నాగరాజు కథనం ప్రకారం.. విశాఖపట్టణానికి చెందిన షేక్‌ మదీనా భాషా(42) మీర్‌పేటలో ఉంటూ ఫిర్జాదిగూడలోని ఆర్టీసీ వర్క్‌షాప్‌లో అసిస్టెంట్‌ మెకానికల్‌ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. మహబూబ్‌నగర్‌ హన్వాడా మండలం దర్పల్లి గ్రామానికి చెందిన అన్నోజు శ్రావణ్‌కుమార్‌(40) నందనవనం ప్రాంతంలో ఉంటూ టీకేఆర్‌ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నారు. సోమవారం ఉదయం భాషా బైక్‌పై విధులకు వెళ్తున్నాడు. శ్రావణ్‌ డ్యూటీ దిగి ఇంటికి వెళ్లేందుకు రహదారిపై వేచి ఉన్నాడు. భాషాను లిఫ్ట్‌ అడిగి ఎక్కాడు. కొద్ది దూరం వెళ్లగానే వెనుక నుంచి వచ్చిన లారీ. . ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యంతర బెయిల్‌ ఉపసంహరణకు జానీ మెమో దాఖలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీకి మంజూరు చేసిన నాలుగు రోజుల మధ్యంతర బెయిలు అవసరం లేదంటూ అతడి తరపు న్యాయవాది కోర్టులో మెమో దాఖలు చేశారు. జాతీయ ఉత్తమ నృత్య దర్శకుడు అవార్డును అందుకోవడానికి దిల్లీ వెళ్లడానికి జానీ అభ్యర్థన మేరకు రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. అయితే అతడి అవార్డును తాత్కాలికంగా అవార్డుల కమిటీ నిలిపి వేసిన నేపథ్యంలో బెయిలు పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు మెమో దాఖలు చేశారు.

నార్మల్‌ డెయిరీకి పూర్వవైభవం తెస్తాం: మంత్రి



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: నార్మల్‌ డెయిరీకి పూర్వవైభవం తెస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో నూతన ఛైర్మన్‌ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌ జయశ్రీ, డీసీసీ ఛైర్మన్‌ సంజీవరెడ్డి హాజరయ్యారు.

లండన్‌కు బయల్దేరిన వివాహిత అదృశ్యం

శంషాబాద్, న్యూస్‌టుడే: లండన్‌కు బయల్దేరిన ఓ వివాహిత శంషాబాద్‌లో అదృశ్యమైంది. హైదరాబాద్‌కు చెందిన మహిళ లండన్‌ నుంచి ఇటీవల ఇక్కడికి వచ్చారు. ఈ నెల 5న రాత్రి తిరిగి తాను లండన్‌కు బయలుదేరుతున్నట్లు భర్తకు సమాచారం ఇచ్చారు. ఆమె అక్కడికి చేరుకోక పోవడంతో ఆన్‌లైన్‌లో భర్త చేసిన ఫిర్యాదు మేరకు విమానాశ్రయం పోలీసులు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్‌ ధరలు

ఫాంరేటు	114–00	డ్రెస్డ్‌	197–00
రిటైల్‌	136–00	స్కిన్‌లెస్‌	224–00

వివాహితుడి వేధింపులు.. బాలిక ఆత్మహత్య

అల్వాల్, న్యూస్‌టుడే: వివాహితుడి వేధింపులు తాళలేక ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. అల్వాల్‌ పోలీసుల కథనం ప్రకారం.. లోతుకుంట పరిధిలో నివసించే బాలిక(17) పదో తరగతి చదువుతోంది. కొంతకాలం క్రితం స్థానికంగా బ్యాండ్‌ వాయించే 30ఏళ్ల వ్యక్తి బాలికతో పరిచయం పెంచుకున్నాడు. అతనికి అప్పటికే వివాహమైంది. భార్య, పిల్లలు ఉన్నారు. బాలికతో చనువు పెంచుకొని పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడు. బాలిక పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో తరచూ వెంటపడటంతో ఆమె విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు హెచ్చరించినా నిందితుడు వేధింపులు ఆపలేదు. దీంతో ఆదివారం రాత్రి బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, వేదికపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్‌ శశాంక

కడ్తాల్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ల లాంటివని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌ మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన తహసీల్దార్‌ కార్యాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్‌ శశాంకతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆమనగల్లు, కడ్తాల్‌, తలకొండపల్లి, మాడ్గుల మండలాలకు చెందిన గీత కార్మికులకు కాటమయ్య కిట్లు, లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. నేతలు చల్లా నర్సింహారెడ్డి, బాలాజీసింగ్‌, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌- మజ్లిస్‌ మధ్య ఘర్షణ

కార్వాన్, న్యూస్‌టుడే: రోడ్డు నిర్మాణ విషయంలో తలెత్తిన వివాదం కాంగ్రెస్‌- మజ్లిస్‌ పార్టీల మధ్య ఘర్షణకు దారితీసింది. ఆసిఫ్‌నగర్‌ ఫిరోజ్‌గాంధీనగర్‌లో రోడ్డు నిర్మాణం సాగుతోంది. కాంగ్రెస్‌ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌ సోమవారం అక్కడకు వెళ్లారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్‌హుస్సేన్‌ మద్దతుదారులు, కాంగ్రెస్‌ కార్యకర్తల నడుమ ఘర్షణ జరిగి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై మాజిద్‌ హుస్సేన్‌ డీసీపీకి ఫిర్యాదు చేశారు.

పిల్లల్ని అప్పగించాలని శిశువిహార్‌ వద్ద నిరసన



వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: తమ పిల్లలను అప్పగించాలని మధురానగర్‌లోని శిశువిహార్‌ ఆవరణలో తల్లిదండ్రులు సోమవారం నిరసన తెలిపారు. ఈ ఏడాది మే 28న పిల్లలను కొనుగోలు చేశారన్న ఆరోపణలపై శిశు సంక్షేమశాఖ అధికారులకు తల్లిదండ్రులు తమ పిల్లలను మధురానగర్‌లోని శిశువిహార్‌లో అప్పగించారు. దీనిపై తల్లిదండ్రులు హైకోర్టుని ఆశ్రయించారు. సానుకూలంగా స్పందించిన హైకోర్టు తల్లిదండ్రుల నుంచి పిల్లలను స్వాధీనం చేసుకునే హక్కు లేదని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ తల్లిదండ్రులు ఉత్తర్వులతో శిశువిహార్‌కు చేరుకున్నారు. పిల్లలను అప్పగించాలని అధికారులతో గొడవకు దిగారు. సీఐ శ్రీనివాస్‌, పోలీసులు ఇరువురిని సముదాయించారు.

PUBLIC NOTICE

On behalf of my clients **(1)** Corvine Chemicals and Pharmaceuticals (P) Ltd., and **(II)** Goutham Bacha, S/o. Srinivas Bacha, this notice is issued to the general public and it is issued ONLY **to notify that the persons dealing with M/s. SUKHII Projects LLP should not setup, at a later stage, that they have not been notified as to the following: (A)** that the disputes have arisen between the other designated partners and my clients, who are also designated partners holding 55% Stake/share in **M/s.SUKHII** Projects LLP, Plot No. 59, Sagar Society, Road No.2, Banjara Hills, Hyderbad-500034. **(B)** That because of said disputes, Arbitration Clause/ Agreement of LLP Agreement dated **05-12-2019** as amended by Supplement Agreement dated **08-01-2022,** has been invoked by my clients and Arbitration Application No. 245 of 2024 has also been filed in the Hon'ble High Court of Telangana, **(C)** That my clients have also filed an Application under Section 9 of the Arbitration and Conciliation Act, 1996 seeking interim reliefs and vide orders dated **11-09-2024** passed in the **CRP No. 2846 of 2024** read with the Order dated **1-10-2024** disposing off the said CRPS of the Hon'ble High Court of Telangana arising out of the said **COP No. 100 of 2024** on file of the Commercial Court, the other Designated Partners (Numbering 6) have been directed not to take such steps which would render the Award to be passed in the said Arbitration become useless and non-executable. **(D)** That the **COP. No. 100 of 2024** is also pending for adjudication before the Hon'ble Commercial Court, City Civil Court, at Hyderabad.

Sd/- **N.ANIL KUMAR,** Advocate
3-6-237, Flat No.214, 2nd Floor, Lingapur House,
Amrutha Estates, Himayathnagar,
Hyderabad - 500029. T.S.

బాలికపై విశ్రాంత ఎస్సై తనయుడి అత్యాచార యత్నం

– తండ్రి పని చేసిన ఠాణాలోనే పోక్సో కేసు నమోదు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ఓ విశ్రాంత పోలీసు అధికారి తనయుడు బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. తండ్రి ఉద్యోగ విరమణ చేసిన ఠాణాలోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. జీడిమెట్ల ఠాణా పోలీసుల కథనం ప్రకారం... విశ్రాంత ఎస్సై కుమారుడు ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతంలో ఉండే బాలికతో పరిచయం ఉంది. ఆదివారం సాయంత్రం పండ్లు ఇస్తానని ఇంట్లోకి తీసుకెళ్లాడు. అత్యాచార యత్నం చేయడంతో కేకలు పెడుతూ బయటకు వచ్చింది. జరిగిన విషయాన్ని బాలిక కుటుంబీకులు నిందితుడి తండ్రి దృష్టికి తీసుకెళ్లారు. తన కుమారుడిపై లేనిపోని నిందలు వేస్తారా.. అంటూ వారిపై చిందులు తొక్కాడు. బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు ఆధ్యాత్మికత ప్రాధాన్యం తెలియజేయాలి



ఆలయంలో శ్రీనివాస్‌గుప్తా తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: నేటి యువతకు భారతీయ ఆధ్యాత్మికత ప్రాధాన్యతను తెలియజేయాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు, కాంగ్రెస్‌ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్‌ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. సోమవారం అంబర్‌పేటలో జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. సనాతన హిందూ ధర్మంలో ఆధ్యాత్మిక చింతనకు విశిష్ట స్థానం ఉందన్నారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తిరుపతిగుప్తా, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఆకట్టుకున్న యువ కళోత్సవం



కళోత్సవంలో అలేఖ్య పుంజల తదితరులు

రవీంద్రభారతి న్యూస్‌టుడే: తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో యువ కళోత్సవం కర్ణాటక, హిందుస్థానీ సంగీత కార్యక్రమాలు శ్రోతలను అలరించాయి. వేడుకల్లో భాగంగా సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల మాట్లాడుతూ..ప్రకృతిని ఆరాధించే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీమతి ఎ.వాణిప్రసాద్, కేంద్ర ప్రభుత్వ నార్త్ ఈస్ట్ జోన్ కల్చర్ సెంటర్ సంచాలకుడు ప్రసన్న గొగోయి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొని మాట్లాడారు.

ఎస్సీ 57 కులాలను 'ఎ' గ్రూప్‌లో చేర్చాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ 57 కులాల ఐక్య వేదిక నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో అత్యధిక వెనుకబాటులో ఉన్న ఎస్సీల్లోని 57 కులాలను 'ఎ' గ్రూప్‌లో చేర్చి 8 శాతం రిజర్వేషన్ కేటాయించాలని ఎస్సీ 57 కులాల ఐక్య వేదిక కోరింది. వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం నేతృత్వంలోని ప్రతినిధుల బృందం ఎస్సీ వర్గీకరణ కమిటీ అధికారి కిషన్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 57 కులాలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఉద్యోగపరంగా వెనుకబడి ఉన్నాయని, ఊరి బయట గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, సొంత గూడు లేని ఈ సామాజిక వర్గాలను ఎస్సీ ఏ జాబితాలో చేర్చి 8 శాతం వాటా ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఏర్పుల యాదయ్య, శంకర్, తులసీరామ్, రాజు, ఎల్లేష్ ఉన్నారు.

కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే మాగంటి గోపూజ



జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నిర్వహిస్తున్న చక్ర అర్చన పూర్వక మాలమహా మంత్ర చండీహవనంలో సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారిని లలితాదేవి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ నిర్వహించారు. –న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

అమ్మవారి మండపాల వద్ద అన్నదానాలు

బోరబండ: దసరా వేడుకల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బోరబండ బస్టాపు, బంజారానగర్, సైట్-1 కాలనీ, రహ్మత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్, ఇందిరానగర్ ఫేజ్-2, ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీ, శ్రీరామ్‌నగర్, రహ్మత్‌నగర్ మండపాల వద్ద రోజూ అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

నిబంధనలు చెబుతారు.. మార్గదర్శనం చేస్తారు

ట్రాఫిక్ విధుల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

నారాయణగూడ, న్యూస్‌టుడే: నగరంలో జనాభా పెరుగుతోంది. తదనుగుణంగా ఏటా రోడ్లపైకి కొత్త వాహనాలు లక్షల్లో వస్తున్నాయి. ట్రాఫిక్ ఉల్లంఘనుల సంఖ్య కూడా నానాటికీ పెరుగుతూనే ఉంది. ట్రాఫిక్ విభాగం సిబ్బంది అవసరమైన స్థాయిలో లేరనే చెప్పవచ్చు. ఫలితంగా నగర పౌరులు నిత్యం పద్మవ్యూహాన్ని దాటుకొని ముందుకుసాగాల్సి వస్తోంది. పలు సందర్భాల్లో నాలుగైదు కిలోమీటర్లు వెళ్లేందుకు రెండు గంటల సమయం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) వాలంటీర్లను ట్రాఫిక్ విధులకు ఉపయోగించుకోవాలని సంకల్పించారు. దీనికి విద్యాశాఖకు సహకరించడంతో ఆరొందల మంది వాలంటీర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. నారాయణగూడ ట్రాఫిక్ పోలీసు ఠాణా పరిధిలోని హిమాయత్‌నగర్ వై.జంక్షన్, నారాయణగూడ ఫ్లైఓవర్ కూడలి, హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్, నారాయణగూడ వైఎంసీఏ కూడలి, బషీర్‌బాగ్ ఫ్లైఓవర్, లిబర్టీ కూడలి, కింగ్‌కోఠి వంటి ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు (యువతీ, యువకులు) ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ కనిపిస్తున్నారు. నారాయణగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వారికి తగిన మార్గదర్శనం చేస్తున్నారు.



నారాయణగూడ కూడలిలో సిగ్నల్ పడినప్పుడు ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

వీరేం చేస్తారంటే..

ఆయా కూడళ్లలో రెడ్‌సిగ్నల్ పడటంతోనే ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 'శిరస్త్రాణాలు ధరించండి', 'కారులో ప్రయాణించేటప్పుడు 'సీట్ బెల్టు పెట్టుకోండి', సిగ్నల్ జంప్ చేయవద్దు అంటూ నినాదాలతో ముద్రించిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే శిరస్త్రాణాలు ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలు, వాహనాలు నడిపేవారు కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనల్ని పాటించడం, నిబంధనల్ని అతిక్రమిస్తే ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయో.. వివరిస్తున్నారు.

● ఒక్కో కూడలిలో కనీసం నలుగురు, అయిదుగురు వాలంటీర్లను వినియోగించుకుంటున్నామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ చెప్పారు. "ప్రజలు, ముఖ్యంగా యువత బాధ్యతారాహిత్యంగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. రేసింగ్ బైక్‌లతో విన్యాసాలు చేస్తుంటారు. చాలా మంది కూడలిలో రెడ్‌సిగ్నల్ జంప్ చేసే ప్రయత్నం చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో ఏదైన ప్రమాదం జరిగితే ఒక్కరి మాత్రమే నష్టం కాదని, వారి కుటుంబాలు నష్టపోతాయని గ్రహించాలి. వాలంటీర్లకు జాకెట్లు ఇవ్వాలనే ఆలోచన చేయడం జరిగింది. త్వరలోనే ఇస్తాము" అని సీఐ తెలిపారు.

ప్రజావాణికి 139 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 90 విజ్ఞప్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ 22, హౌసింగ్ 59, ట్యాక్స్ విభాగం 5, ఐటీ సెక్షన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, మూసాపేట డిప్యూటీ కమిషనర్‌లకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో వచ్చిన 49 అర్జీల్లో కూకట్‌పల్లి జోన్‌లో 26, శేరిలింగంపల్లి జోన్‌లో 10, సికింద్రాబాద్ జోన్‌లో 7, ఎల్బీనగర్ జోన్‌లో 2, చార్మినార్ జోన్‌లో 3, ఖైరతాబాద్‌లో ఒక్కటి వచ్చాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరిరావు పాల్గొన్నారు.

అయోధ్యలో 57 రోజులపాటు చండీ మహాయాగం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరాజు, డీఎస్ఎన్ మూర్తి, ఎల్వీసుబ్రహ్మణ్యం, సత్యమూర్తి, డీఎస్ఆర్ మూర్తి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, కంచిలోని శ్రీ కంచి కామాక్షి పీఠం, విజయనగరంలోని చిన్మయి సేవా ట్రస్ట్ సంయుక్తంగా నవంబర్ 2 నుంచి 57 రోజులపాటు అయోధ్యలో శ్రీ మహా నారాయణ దివ్య రుద్ర సహిత శత సహస్ర చండీ విశ్వశాంతి మహాయాగం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక ప్రతినిధి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహక సంస్థల ప్రతినిధులు వీఎస్ఎన్ సత్యమూర్తి, డీఎస్ఆర్ మూర్తి, డీఎస్ఎన్ మూర్తి, డా.జి.వెంకటేశ్వరరాజు తదితరులతో కలిసి మహాయాగానికి చెందిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ మహాయాగం నవంబర్ 2 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకు అయోధ్యలో జరుగనుందని తెలిపారు.



ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీ సీతా రామాంజనేయ స్వామి ఆలయంలో..



జీటీఎస్ దేవస్థానంలో లలిత త్రిపురసుందరీ దేవి అలంకరణలో



ఓల్డ్ కమేళాలోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో



బంజారాహిల్స్‌లో దుర్గామాత మండపంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని సత్కరిస్తున్న భక్తులు



ఫిల్మ్‌నగర్ జ్ఞానీజైల్‌సింగ్‌నగర్‌లో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

మహాచండి.. చాముండి

దుర్గా ఉత్సవం.. బెంగాలీ సంబరం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : భక్తుల్లో స్నేహభావం పెంపొందించాలనే ఉద్దేశంతో బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గా పూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంజిత్ పాల్, ఉపాధ్యాక్షుడు సంజయ్ పాన్, కార్యవర్గ సభ్యుడు త్రిశీతా ముఖర్జీలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బంజారాహిల్స్ రోడ్ నం.1లోని బంజారా ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 8 నుంచి 13 వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. బెంగాలీ వంటకాలతో ప్రత్యేక స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు.



ప్రత్యేకాలంకరణలో దుర్గామాత



బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో దాండియా ఆడుతున్న మహిళలు

గుండె మార్పిడితో మహిళకు పునర్జన్మ

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ఎడమ జఠరిక పనిచేయకపోవడంతో తలెత్తిన గుండె వైఫల్యం, అరిథ్మియాతో డైలేటెడ్ కార్డియోమియోపతితో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న 39 ఏళ్ల మహిళకు బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి వైద్య బృందం విజయవంతంగా గుండె మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారు. సోమవారం ఓ ప్రకటనలో కేర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.అజిత్ సింగ్ వివరాలను వెల్లడించారు. తీవ్రమైన హృద్రోగ సమస్యతో బాధపడుతున్న మహిళకు గతంలోనే ఆటోమేటిక్ ఇంప్లాంటబుల్ కార్డియోవర్టర్ డిఫిబ్రిలేటర్ (ఏఐసిడి) అమర్చారు. అయితే గుండె వైఫల్యం, వెంట్రిక్యులర్ టాకికార్డియో తదితర సమస్యలతో కేర్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించడంతో పూర్తిస్థాయి పరిశీలన చేసి గుండె మార్పిడి చేయాలని నిర్ధారించారు. జీవన్‌దాన్‌లో నమోదు చేసుకోవడంతో.. ఐదు నెలల అనంతరం అవసరమైన గుండె లభించడంతో సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డా.నగేష్ నేతృత్వంలో నిపుణుల బృందం రోగికి గుండె మార్పిడి ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. డా.నగేష్ మాట్లాడుతూ.. గుండె మార్పిడి మహిళకు కొత్త జీవితాన్ని అందించిందని, త్వరితంగా కోలుకున్నారని తెలిపారు.

యూసుఫ్‌గూడ:

? శ్రీకృష్ణదేవరాయనగర్ ప్లాట్ నెం.45, పంజాబ్ నేషనల్ బ్యాంకు సమీపంలో మూడు నెలలుగా వీధిదీపాలు వెలుగడం లేదు. పండుగల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వెంటనే స్పందించాలి. –భాస్కర్‌రాజు, శ్రీకృష్ణదేవరాయనగర్‌కాలనీ.

✓ వెలగని వీధిదీపాలకు వెంటనే మరమ్మతులు చేపడతాం.
–సుష్మ, బల్దియా, ఎలక్ట్రిసిటీ విభాగం ఏఈ.

జీవో 477ను వెంటనే రద్దు చేయాలి: భారాస



మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి

ఫిలింనగర్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం రూ.1.5లక్షల కోట్ల భారీ బడ్జెట్‌తో మూసీ నది అందాల ప్రాజెక్టును ప్రతిపాదించినప్పటికి ఈ ప్రాజెక్టు అమలులో పేదల ఇళ్లను కూల్చివేయడం తీవ్ర ఆందోళన కల్గిస్తోందని భారాస సీనియర్ నాయకుడు దాసోజు శ్రవన్ విమర్శించారు. మూసీ నది ప్రాజెక్టు జీవో నం.477ను రద్దు చేయాలని ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు. పూర్తిస్థాయి పునరావాస ప్రణాళికను రూపొందించి పారదర్శకతతో ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. రూ.1.5లక్షల కోట్ల ప్రాజెక్టు ఖర్చు వివరాలను పూర్తిగా వివరించి ప్రజలకు తెలియజేయాలన్నారు. మూసీ నది ప్రాజెక్టు పర్యావరణ వేత్తలు, పట్టణ ప్రణాళిక కర్తలు, ప్రభావిత వర్గాలతో సరైన స్థాయిలో సంప్రదింపులు లేకుండా చేపట్టడం ప్రజాస్వామ్య పద్ధతులను తారుమారు చేసే చర్య అని విమర్శించారు.

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారం కుప్పకూలింది: రాకేశ్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ మొత్తం కుప్పకూలిందని భారాస నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కట్టిన ఫ్లాట్స్ కూడా అమ్ముడుపోవడం లేదన్నారు. నగరంలో ఎక్కడ చూసిన టూలెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో టెక్స్‌టైల్ ఇండస్ట్రీ కుదేలు అవుతోందని, మనీ సర్క్యులేషన్ లేదన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ వచ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. మూసీపై అఖిలపక్షాన్ని పిలవాలన్నారు. హైడ్రాను వెనక్కి తీసుకోవాలని కోరారు.


జేఎన్ఏఎఫ్ఏయూకు పదెకరాల స్థలం కేటాయింపుపై హర్షం



మాట్లాడుతున్న పసునూరి దయాకర్

ఖైరతాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ) కొత్త క్యాంపస్ నిర్మాణం కోసం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పదెకరాలు కేటాయించడంపై హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, కళాశాల మాజీ ప్రిన్సిపల్స్, మాజీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కళలపై ఉన్న అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. స్థల కేటాయింపును అంబేడ్కర్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది రాజకీయ కోణంలో చూడొద్దని, కొత్త క్యాంపస్ ఏర్పాటుకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణా రెడ్డి, వరంగల్ మాజీ ఎంపీ, పూర్వ విద్యార్థి, శిల్పి పసునూరి దయాకర్, మాజీ ప్రిన్సిపల్స్ ప్రొ.ఎస్.ఎం.పీరం మాట్లాడారు. యూనివర్సిటీ విస్తరణకు స్థలాన్ని కేటాయించి, అధునాతన వసతులతో క్యాంపస్, థియేటర్ల నిర్మాణం చేపట్టడం వల్ల తెలంగాణ సాంస్కృతిక, కళారంగానికి తలమానికంగా నిలుస్తుందని అన్నారు. ప్రొ.కె.దశరథ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గౌరీశంకర్, సుధానిధి, బస్వరాజ్ పాల్గొన్నారు.

బీఎస్పీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా దొరపల్లి రమేష్



బంజారాహిల్స్ న్యూస్‌టుడే : బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన దొరపల్లి రమేష్ నియమితులయ్యారు. నగరంలోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లాల సమీక్ష సమావేశంలో బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్.. రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. రమేష్ మాట్లాడుతూ..బీఎస్పీ విధానాలను సమాజంలో ప్రచారం చేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

బంజారాహిల్స్‌లో డి సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శన



వస్త్ర ప్రదర్శన ప్రారంభిస్తున్న డా. సుధా జైన్. చిత్రంలో నిర్వాహకులు

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు చెందిన విభిన్న వస్త్ర ఉత్పత్తులతో 'డి సన్స్ పటోలా ఆర్ట్' వస్త్ర ప్రదర్శన పేరిట సోమవారం బంజారాహిల్స్‌లోని రోడ్ నం.1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ప్రారంభమైంది. మిస్ ఇండియా ఆసియా పసిఫిక్, నగర సోషలైట్ సుధా జైన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ రాజ్ కోటా, పటోల దుపట్టా, శాలువాలు, సింగిల్ పఠాన్ చీరలు, సిల్క్ టిష్యూ పటోల ఉత్పత్తులు ప్రదర్శనలో కొలువుదీరాయన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 15వ తేదీ వరకు కొనసాగనుంది.

వాహనాలను పార్కింగ్ ప్రాంతంలోనే నిలపండి



పార్కింగ్ నిర్వాహకులకు సూచనలిస్తున్న ఏసీపీ హరిప్రసాద్

ఈనాడు కథనానికి స్పందన

జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మ గుడి చుట్టూ ట్రాఫిక్ కష్టాలను 'ముందుచూపు లేక.. ముందుకు కదల్లేక' అనే శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన వార్తకు ట్రాఫిక్ అధికారులు స్పందించారు. పశ్చిమ మండల ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సోమవారం జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్సై నర్సింహరావుతో కలిసి పెద్దమ్మగుడి ప్రాంతంలో పర్యటించారు. పెద్దమ్మగుడి ఆలయంలో ఉన్న పార్కింగ్‌ను పరిశీలించి.. పార్కింగ్ గుత్తేదారు కనకరాజుతో మాట్లాడారు. ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్‌లోనే నిలపాలని, పార్కింగ్ సౌకర్యం లేదంటూ తిప్పి పంపొద్దని సూచించారు. ఆలయానికి వచ్చే వాహనాలు రోడ్డుపై నిలిస్తే గుత్తేదారు బాధ్యత వహించాల్సి ఉంటుందని సూచించారు. దేవి ఉత్సవాలు ముగిసేవరకు ఎలాంటి సమస్య రాకుండా చూసేందుకు ప్రయత్నిస్తామని కట్టా హరిప్రసాద్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ట్రాఫిక్‌ను పర్యవేక్షించేందుకు అదనపు సిబ్బంది సంఖ్యను కొంత పెంచుతామని తెలిపారు.

బంగారం తక్కువ ధరకంటూ రూ.3 లక్షల బురిడీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంగారం తక్కువ ధరకు ఇప్పిస్తానంటూ మోసానికి పాల్పడిన ఇద్దరిపై కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. హుమాయున్‌నగర్‌కు చెందిన ఎన్‌టి.జగన్నాథ్ ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కొద్ది నెలల క్రితం మహబూబ్‌నగర్‌లోని రాంనగర్‌కు చెందిన సాయిచందు గౌడ్‌తో పరిచయం ఏర్పడింది. తనకు కేరళలోని బంగారం వ్యాపారులతో మంచి సంబంధాలున్నాయని, తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని జగన్నాథ్‌ను నమ్మించాడు. దీంతో ఏడాది జూన్ 23న రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో ముందస్తుగా రూ.3 లక్షలు సాయిచందు తీసుకున్నాడు. రోజులు గడిచినా బంగారం, డబ్బులు తిరిగి ఇవ్వలేదు. సాయిచందు గౌడ్, సీతారాం వల్లభ్‌లపై జగన్నాథ్ కోర్టును ఆశ్రయించగా కోర్టు ఆదేశాల మేరకు వారిద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవం.. వాహనసేవ వైభవం



సూర్యప్రభ వాహనసేవలో శ్రీవారు

యూసుఫ్‌గూడ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ఉదయం సూర్యప్రభ వాహనసేవ, సాయంత్రం చంద్రప్రభ వాహన సేవలను నిర్వహించారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తికి రెండు రోజుల జైలు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: మహిళ వెంట పడుతూ వేధిస్తున్న వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్ష విధించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెందిన శివకుమార్ గౌడ్ క్యాబ్ డ్రైవర్. హౌజ్ కీపింగ్ పనిచేస్తున్న ఓ మహిళను వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం గాంధీభవన్ వద్ద గల మనోరంజన్ కాంప్లెక్స్‌లోని పదో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి మంద మురళీ రెండు రోజుల జైలు శిక్షను విధించారు.

వేగంగా దూసుకొచ్చి.. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: రెడ్ సిగ్నల్ జంప్ చేసి ర్యాష్‌గా డ్రైవింగ్ చేసి ఓ యువకుడిని ఢీ కొట్టిన యువకుడిపై మధురానగర్ ఠాణాలో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్సార్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న రాకేష్ స్విగ్గీ డెలవరి బాయ్. ఈనెల 6న రాత్రి 7.30గంటల సమయంలో సత్యం థియేటర్ నుంచి యూసుఫ్‌గూడకు పార్సిల్ ఇవ్వడానికి వెళ్తున్న సమయంలో పంజాగుట్ట నుంచి ఎస్సార్‌నగర్‌కు ట్రిపుల్ రైడింగ్‌తో వస్తున్న కేపీహెచ్‌బీ ప్రాంతానికి చెందిన యశ్వంత్‌రెడ్డి రెడ్ సిగ్నల్‌ను జంప్‌చేసి రాకేష్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాకేష్ ముఖానికి, కుడిచేతికి, కుడికాలుకు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం ధ్వంసమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి పరిరక్షణ.. భావితరాలకు పునాది



చర్చా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వాణిప్రసాద్, విమలక్క తదితరులు

రవీంద్రభారతి : ప్రకృతి పరిరక్షణ అనేది భవిష్యత్తు తరాలకు పునాది అని పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణిప్రసాద్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న బతుకమ్మ సంబరాలలో భాగంగా అరుణోదయ విమలక్క సారథ్యంలో 'బతుకమ్మ, పర్యావరణం, మహిళల భద్రత, చెరువుల పరిరక్షణ'పై చర్చా కార్యక్రమం జరిగింది. వాణిప్రసాద్ మాట్లాడుతూ.. బతుకమ్మ అంటే అనవాయితీ, సంస్కృతి మాత్రమే కాదని.. అందులో ఆలోచింపజేసే అంశాలు చాలా ఉన్నాయని, విమలక్క మొదలుపెట్టిన బహుజన బతుకమ్మను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంలో భాగం చేయడం జరిగిందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రకృతి, పర్యావరణంపై స్పష్టంగా ఉంటారన్నారు. విమలక్క మాట్లాడుతూ.. తెలంగాణలో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. గతంలో తాము బహుజన బతుకమ్మను ఎత్తుకున్నప్పుడు దానిని అణచివేయాలని చూశారన్నారు. బతుకమ్మ ఉత్సవం మాత్రమే కాదని.. ఉద్యమం కూడా అన్నారు. ప్రకృతికి, స్త్రీకి మధ్య ఉన్న బంధాన్ని, అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, దాసోజు లలిత, జ్యోతి, అనిత, గోగు శ్యామల, సుజాత తదితరులున్నారు.

సినిమా ఫొటోల స్థానంలో అశ్లీల చిత్రాల పోస్ట్

● సహాయకుడిపై సినీ దర్శకనిర్మాత ఫిర్యాదు

జూబ్లీహిల్స్: ఇన్‌స్టాగ్రామ్ పేజీలోని సినిమా ఫొటోలు తొలగించి అశ్లీల చిత్రాలు పెట్టిన తన సహాయకుడిపై చర్యలు తీసుకోవాలంటూ ఓ సినీ దర్శకనిర్మాత బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ సాగర్ సొసైటీలో షేక్ నాగుల్ షరీఫ్ అనే దర్శకనిర్మాత తాను నిర్మిస్తున్న సినిమా కోసం సూరజ్‌సాయి అనే యువకుడిని సహాయకుడిగా నియమించుకున్నాడు. ఆడిషన్స్ జరిగే సమయంలో సినిమా అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీని కొత్తగా తెరిచి పలు జిల్లాల్లో పాల్గొన్న ఔత్సాహిక నటులు ఆయా సినిమా పేజీని అనుసరించేలా సూరజ్‌సాయికి బాధ్యతలు అప్పగించారు. అయితే ఇన్‌స్టా పాస్‌వర్డ్ తెలిసిన సూరజ్‌సాయి కొంతమందితో తప్పుగా ప్రవర్తించడం, అనధికారిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి విధుల్లో నుంచి తొలగించారు. ఆదివారం కార్యాలయానికి వచ్చిన సూరజ్‌సాయి పని కావాలంటూ కోరగా కుదరదని అక్కడి నుంచి పంపించారు. దీంతో సూరజ్‌సాయి ఇన్‌స్టా పేజీలోని సినిమా ఫొటోలు తొలగించి అసభ్యకరమైన ఫొటోలు పెట్టాడు. పేజీ పేరు మార్చి అసభ్యకర సందేశాలను పెట్టాడు. పలువురు సినిమా కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. నాగుల్ షరీఫ్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు.

పవన్‌కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలంటూ కె.ఎ.పాల్ ఫిర్యాదు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ వ్యవహారంలో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ.. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ కోరారు. ఈ మేరకు నగరంలోని పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యల వల్ల భక్తుల్లో అశాంతి వాతావరణం ఏర్పడిందని, తన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అడ్మిన్ ఎస్ఐ ప్రదీప్‌ను కోరారు.

సినీ కార్యాలయాల్లో చోరీ

యూసుఫ్‌గూడ: చిత్ర పరిశ్రమకు సంబంధించిన రెండు కార్యాలయాల్లో చోరీ జరిగింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం...రహ్మత్‌నగర్‌కు చెందిన బలరామ్ ప్రసాద్ మధురానగర్‌లోని ఫ్లాట్ నెంబరు సీ-64 గ్రౌండ్ ఫ్లోర్‌లో శ్రీహరిత ప్రొడక్షన్ పేరుతో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నాడు. ఈనెల 6న ఉదయం తన కార్యాలయాన్ని తెరవడానికి వచ్చిన సమయంలో కార్యాలయం తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా ల్యాప్‌టాప్ కనబడలేదు. తన ఇంటి ఓనర్ రాకేష్‌కు సమాచారం ఇవ్వగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న రామ్ మీడియా సర్వీసెస్ లిమిటెడ్ పేరుతో వీడియో ఎడిటింగ్ కార్యాలయం ఉంది. షాపు నిర్వాహకుడిని పిలిచి కార్యాలయంలో పరిశీలించగా కార్యాలయంలో భద్రపర్చిన రూ.80 వేలతో పాటు, కెమెరా చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని తాపీమేస్త్రీ ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: భార్యతో గొడవపడిన భర్త మనస్తాపంతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన నరేష్(29), లత దంపతులు. వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. నరేశ్ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన నరేశ్ పనికి సరిగా వెళ్లకపోవడంతో తరచుగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో ఈ నెల 6న బాబును తీసుకుని ఉప్పుగూడలో ఉండే తన సోదరుడు రమేష్ ఇంటికి లత వెళ్లిపోయింది. అనంతరం భర్తకు ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో నరేష్‌కు మామ వరుస అయిన వీరేష్‌కు ఫోన్‌చేసి నరేష్ ఫోన్ ఎత్తడం లేదు, ఇంటికి వెళ్లి చూడమని తెలిపింది. 6న అర్ధరాత్రి వీరేష్ వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతు కనిపించాడు. పోలీసులకు, స్థానికులకు సమాచారం ఇచ్చి, నరేష్‌ను కిందికి దించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి



బండి రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

నాలాపై వంతెన నిర్మించాలి

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ నవజీవన్‌నగర్-కల్యాణీనగర్ మధ్య నాలాపై వంతెన నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్‌ను కోరారు. సోమవారం శోభన సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతి పత్రం సమర్పించారు. రామ్మోహన్, శివ, లక్ష్మయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంబరాలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: దేవర సినిమా విజయవంతమైన సందర్భంగా కూకట్‌పల్లి జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు భాగ్యనగర్‌కాలనీలోని విశ్వనాథ్ థియేటర్‌లో సోమవారం సంబరాలు నిర్వహించారు. థియేటర్ మేనేజర్ చౌదరి, అభిమానులు మురళి, రంగస్వామి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



సీఐ బాధ్యతల స్వీకరణ



బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ సీఐగా నరసింహరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నవీన్ కుమార్ రాజేంద్రనగర్ డీఐగా బదిలీ కాగా ఆయన స్థానంలో పేట్‌బషీరాబాద్ డీఐ నరసింహరాజును నియమించిన విషయం తెలిసిందే. ఆయన్ని ఎస్సైలు, సిబ్బంది అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి కృషి జరగాల్సిన అవసరం ఉందని జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమాటిక్స్(ఐఎస్‌జీ), జేఎన్‌టీయూహెచ్ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్(ఐసీఈఎం-24) ఈ నెల 4నుంచి జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు ముగింపు వేడుకలు సోమవారం వర్సిటీ గోల్డెన్ జూబ్లీహాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో ఇలాంటి సదస్సులు ఎంతో ముఖ్యమని నిర్వాహకులను అభినందించారు. నాలుగు రోజుల పాటు జరిగిన సదస్సులో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ హెడ్ డాక్టర్ వి.హిమబిందు, ఐఎస్‌జీ ఛైర్మన్ డాక్టర్ కె.మృత్యుంజయరెడ్డి, ఎన్ఆర్ఎస్‌సీ ప్రతినిధి డాక్టర్ దాస్, సదస్సు కార్యదర్శి డాక్టర్ టి.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కారకులు బాధితులు వారే

కేపీహెచ్‌బీలో ఎక్కువగా అపసవ్యదిశ ప్రయాణాలు, ప్రమాదాలు



మెట్రోపిల్లర్లు 732-733 వద్ద నాలుగో రోడ్డు వైపు వెళ్తున్న వాహనదారుడు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే:

- కరీంనగర్ జిల్లా వాసి తిరుపతి(47) భార్యతో గతనెల 19న ఎల్లమ్మబండ నుంచి మైండ్‌స్పేస్ వెళ్లేందుకు కేపీహెచ్‌బీ పరిధి జాతీయ రహదారిలో మెట్రో పిల్లర్ నంబరు 733 వద్ద యూటర్న్ తీసుకునేందుకు ద్విచక్ర వాహనంపై అపసవ్యదిశలో దూసుకొచ్చాడు. వేగంగా వచ్చిన ఆటోకు ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. 100 మీటర్లు వెళ్తే మరో యూటర్న్ ఉంది.
- నిజాంపేట బాలాజీకాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కాపలాదారుడు చిన్నారావు(40) కేపీహెచ్‌బీ గోపాల్‌నగర్ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో మెట్రోపిల్లర్లు 658-659 మధ్య ఉన్న యూటర్న్ వద్ద అపసవ్యదిశలో రహదారి దాటుతుండగా ఆర్టీసీ బస్సు కింద పడి ప్రాణాలు కోల్పోయాడు.

కేసులు(జనవరి నుంచి): 31(168 మంది)
మరణాలు : 4



ఇందూ అపార్ట్‌మెంట్స్ ఎదురు అపసవ్యదిశలో రైల్వే ట్రాక్ కింద మార్గం వైపు ప్రయాణిస్తున్న వాహనదారుడు

ఇందూ అపార్ట్‌మెంట్స్ ముందు(ఉదయం 10 గంటలు)

నిమిషానికి 10మంది వాహనదారులు హఫీజ్‌పేట వైపు నుంచి ఇందూ అపార్ట్‌మెంట్స్ సమీపంలోని రైల్వే ట్రాక్ కింద నుంచి త్వరగా హైటెక్‌సిటీ వెళ్లాలని అపసవ్యదిశలో ప్రయాణిస్తున్నారు. రాత్రిళ్లు ప్రమాదం పొంచి ఉంది.

మెట్రోపిల్లర్లు 732-733(ఉదయం 11.02 గంటలు)

పోలీసులున్నా వాహనదారులు మస్కా కొట్టి అపసవ్యదిశలో నాలుగో రోడ్డు ప్రవేశంపై దూసుకొస్తున్నారు. ముగ్గురు వాహనంపై ప్రయాణిస్తుండటం ప్రమాదకరంగా మారింది. నిమిషానికొక వాహనం దూసుకొస్తోంది. జాతీయ రహదారి వైపు హోటళ్లు తెరిచి ఉండటంతో అపసవ్యదిశలో వస్తున్నారు.

మెట్రోపిల్లర్లు 679-680(ఉదయం 11.50 గంటలు)

రెండువైపులా నిమిషానికి 10నుంచి 20 మంది వాహనదారులు అపసవ్యదిశలోనే దూసుకొస్తున్నారు. వీరితో సవ్యదిశలో వచ్చేవారికి విఘాతం కలుగుతోంది. ప్రాణాలు సైతం కోల్పోతున్నారు.

అపసవ్యదిశలో ప్రయాణించడం మానవ బాంబుతో సమానమని చెబుతున్న ట్రాఫిక్ పోలీసులు వరస మరణాల మృతిపై మాత్రం దృష్టిసారించడంలో విఫలమవుతున్నారు. నిఘా నేత్రాలు బిగించాం.. కేసులు నమోదు చేస్తున్నామంటున్నారు. కేపీహెచ్‌బీ పరిధిలో 'ఈనాడు' పరిశీలన చేయగా నిఘా నేత్రాలున్నా నియంత్రణ లేక యూటర్న్‌ల వద్ద వాహనదారులు అపసవ్యదిశలో దూసుకొస్తూ.. ప్రమాదాలకు కారకులవుతున్నారు. నిజాంపేట రోడ్డులో 3 యూటర్న్‌లు, జేఎన్‌టీయూ రోడ్డులో ఆల్మండ్ హౌజ్ యూటర్న్, బ్రాండ్ ఫ్యాక్టరీ ఎదురు ప్రమాదం పొంచి ఉంది.

మెట్రోపిల్లర్లు 712-713(ఉదయం 11.28 గంటలు)

సాయినగర్, సర్దార్‌పటేల్‌నగర్, పిస్తా హౌజ్ నుంచి జేఎన్‌టీయూ సిగ్నల్ వైపు వచ్చేందుకు నిమిషానికి 5నుంచి 10 మంది వాహనదారులు ఇక్కడ యూటర్న్ వద్ద అపసవ్యదిశలో ప్రయాణిస్తున్నారు. పోలీసులు పగలు పత్తా లేకుండాపోతున్నారు. జేఎన్‌టీయూ సిగ్నల్ పడితే వాహనాలు రయ్‌మంటూ వెళ్తుంటాయి.

మెట్రోపిల్లర్లు 658-659(మధ్యాహ్నం 12.15 గంటలు)

హైదర్‌నగర్ యూటర్న్ మాదిరి ట్రాఫిక్ లేదనే వాహనదారులు అతివేగంగా అపసవ్యదిశలో రహదారి దాటేందుకు ప్రయాణిస్తున్నారు. రెండు వైపులా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో జరిమానాలు అందుతాయి:
వెంకటయ్య, ట్రాఫిక్ ఏసీపీ

సీసీ కెమెరాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. అపసవ్యదిశ వాహనదారులకు ఆన్‌లైన్‌లో జరిమానాలు అందుతాయి. కేసులు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెడుతున్నాం. ముున్ముందు కఠిన చర్యలుంటాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

మ్యాన్‌హోల్ మూత పునరుద్ధరణ



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బాలాజీనగర్‌లోని వైఎస్ఆర్ విగ్రహం రోడ్డులో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత కుంగింది. దీంతో రాకపోకలకు వాహనదారులకు అంతరాయం కలుగుతూ వస్తుంది. ఈ విషయాన్ని జలమండలి బాలాజీనగర్ సెక్షన్ అధికారుల దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా వారు సత్వరమే స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి మూతను పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

రామాలయానికి రూ.55లక్షల వితరణ



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, దాతలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రామాలయంలో దాతలు రూ.55లక్షల విరాళం అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారిని సన్మానించి ప్రత్యేక పూజలు చేశారు. రథము, సోలార్ కైంకర్యాలు, సహస్రదీపారాధన మండపం ఏర్పాటుకు రాధాకృష్ణ, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.30లక్షలు, మహాలక్ష్మి అమ్మవారి మందిరం వెండి ద్వారానికి ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్, ధరణి దంపతులు రూ.25 లక్షలు వితరణగా అందించారు.

☛ ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన సత్యవతికి సోమవారం ఎమ్మెల్యే శేషాద్రినగర్‌లోని తన కార్యాలయంలో రూ.1.5లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు.

సకాలంలో ఏర్పాట్లు పూర్తిచేయండి

కూకట్‌పల్లి: బతుకమ్మ ముగింపు వేడుకల ఏర్పాట్లు సకాలంలో పూర్తిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. సోమవారం రంగధాముని చెరువు కట్టపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కోనేరును తీర్చిదిద్దాలని, కట్టపై సదుపాయాలు కల్పించాలన్నారు. కార్పొరేటర్లు పగుడాల శిరీష, ఆవుల రవీందర్‌రెడ్డి, డీసీ రమేశ్, ఈఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ నామస్మరణం.. తరిస్తున్న భక్తజనం



మూసాపేట ఆంజనేయనగర్‌లో మహాలక్ష్మీదేవిగా..

కూకట్‌పల్లి, మూసాపేట, అల్లాపూర్: నియోజకవర్గం పరిధిలో దేవీశరన్నవరాత్రి వేడుకల్లో అమ్మ నామస్మరణతో భక్తులు తరిస్తున్నారు. ఐదోరోజు అమ్మవారు విభిన్న అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పలు ప్రత్యేక మండపాల్లో పూజలు, అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి కొనసాగుతుంది.



శ్రీలలితాత్రిపురసుందరీ దేవి అలంకరణలో శ్రీపర్వతవర్ధిని అమ్మవారు



కూకట్‌పల్లి చిత్తారమ్మ దేవాలయంలో లలితాదేవి అలంకరణ

ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సీపీఎం ప్రదర్శన



మూసాపేట, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మూసాపేట వై జంక్షన్‌లో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ..ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధ వాతావరణం సృష్టించి పబ్బం గడుపుకోవాలని కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయన్నారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ దేశాల మధ్య తరచూ జరుగుతున్న ఘటనలు సైతం యుద్ధవాతావరణానికి దారి తీసేలా ఉన్నాయన్నారు. ఈ విషయంలో అగ్రదేశాలు ఒక్కతాటిపైకొచ్చి ఆయా దేశాల మధ్య శాంతిని నెలకొల్పే ప్రయత్నం చేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి జి.కృష్ణ, సుందర్యన్, శంకర్, చెన్నకేశవులు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

'డి సన్స్ పటోలా' వస్త్ర ప్రదర్శన



ప్రారంభోత్సవంలో డా. సుధా జైన్

బంజారాహిల్స్: ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు చెందిన విభిన్న వస్త్ర ఉత్పత్తులు, చేనేతచీరలు, పటోలా, హ్యాండ్లూమ్స్ సిల్క్ వస్త్రోత్పత్తుల ప్రదర్శన 'డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన' పేరిట సోమవారం బంజారాహిల్స్‌లోని రోడ్ నం.1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ప్రారంభమైంది. మిస్ ఇండియా ఆసియా పసిఫిక్, నగర సోషలైట్ సుధా జైన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. అక్కడి ఉత్పత్తులను పరిశీలించి బాగున్నాయని ప్రశంసించారు.

ఉపాధి కోసమొస్తే ఉసురు తీసింది

బాలానగర్, న్యూస్‌టుడే: జీవనోపాధి కోసం వచ్చిన కొన్ని మాసాలకే ఓ కార్మికుడు జీవితాన్ని కోల్పోయిన ఉదంతం బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై రామనాయణ కథనం ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్రం బలఘత్‌కు చెందిన కమలేష్ మెశ్రం(46) భార్య రేఖ, 8, 13ఏళ్ల ఇద్దరు కుమార్తెలతో కలిసి మూడు మాసాల క్రితం నగరానికి వచ్చి పద్మానగర్ ఫేజ్-1లో ఉంటున్నాడు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే ప్రాంతంలో ఓ నిర్మాణంలో ఉన్న భవనంలో కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఐదో అంతస్తు భవనం ఎలివేషన్‌లో తడికెలపై నిలబడి ప్లాస్టరింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. సొంత గ్రామంలో పని లేక ఉపాధి కోసం ఊరొస్తే.. ఉసురు తీసిందని మృతుడి భార్య రోధించడం తోటి కార్మికులను కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 90 విజ్ఞప్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, సత్యనారాయణ, యాదగిరిరావు, జేసీ శానిటేషన్ వేణుగోపాల్, అడిషనల్ సీసీపీలు ప్రదీప్‌కుమార్, గంగాధర్, హౌసింగ్ యస్ఈ కృష్ణారావు, యస్ఈ ఇంజినీరింగ్ పనపరెడ్డి, ఇరిగేషన్ యస్ఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయంలో..

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి జోన్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్లలో సోమవారం జరిగిన ప్రజావాణికి 10 ఫిర్యాదులు అందాయి. జోనల్ కార్యాలయంలో జడ్సీ అపూర్వ్ చౌహాన్ ఫిర్యాదులు స్వీకరించగా ఇక్కడ ఆరు వినతిపత్రాలు అందాయి. మూసాపేట సర్కిల్ పరిధిలో నాలుగు ఫిర్యాదులు రాగా.. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఒక్క ఫిర్యాదు అందలేదు.

ఎందుకిలా.. మౌనమేళ?



వసంత్‌నగర్ డబుల్ రోడ్డు పక్కన



డివైడర్‌పై కొట్టేసి వదిలేసిన కొమ్మలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: చెట్ల కొమ్మలు కొట్టేసిది.. డబ్బు తీసుకునేది వారే. కానీ, తొలగించాల్సింది మాత్రం పారిశుద్ధ్య సిబ్బంది. ఎందుకిలా..? ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతుండడానికి కారణాలేమిటీ..? అని అన్వేషిస్తే.. ఇరు ప్రభుత్వ విభాగాల నిర్లక్ష్యం కనిపిస్తుంది. కొట్టేసేవారికి చిన్న సమస్యే కావచ్చు.. ఎత్తేవారికి ఇబ్బంది లేకపోవచ్చు. కానీ, మధ్యలో నెలలకొద్ది చెట్లకొమ్మల గుట్టలతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. తాజా నిదర్శనంగా నిలుస్తున్న ఈచిత్రాలు.. కేపీహెచ్‌బీకాలనీ పరిధిలోనివి. వసంత్‌నగర్ డబుల్ రోడ్డులో వారం రోజుల క్రితం టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు గుత్తేదారుతో రోడ్ల పక్కన, డివైడర్‌పై ఉన్న భారీచెట్ల కొమ్మలను కొట్టేసి రోడ్ల పక్కన.. డివైడర్‌పై గుట్టలుగా వదిలేశారు. భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-2లోనూ పదిరోజుల క్రితం కొట్టేసి వదిలేశారు. రెండు చోట్ల జనం సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొమ్మలను తరలించేందుకు కరెంటు అధికారులు గుత్తేదారుకు డబ్బులిస్తున్నారు. వదిలేస్తున్నా.. కిమ్మనకపోవడం వెనుక అనుమానాలు రేకెత్తుతున్నాయి. కరెంటు అధికారులకు జరిమానా విధించడంలో సర్కిళ్ల ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తుంది.

కేపీహెచ్‌బీలో కుక్కల బెడద

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని పలు ఫేజుల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రిళ్లు కాకుండా ఉదయం, ఇతర సమయాల్లోనూ వెంట పడుతున్నాయని కాలనీవాసి చంద్రశేఖర్ రావు వాపోయారు. పిల్లల్ని బయటికి పంపాలంటే భయమేస్తుందని చెబుతున్నారు. ఈ విషయాన్ని వెటర్నరీ ఇన్‌ఛార్జి నాగార్జున దృష్టికి తీసుకెళ్లగా వెంటనే డాగ్ స్క్వాడ్ బృందాలను పంపి కుక్కలను పట్టుకుంటామని సమాధానమిచ్చారు.

జేఎన్ఏఎఫ్ఏయూకు స్థలం కేటాయింపుపై హర్షం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ) కొత్త క్యాంపస్ నిర్మాణం కోసం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పదెకరాలు కేటాయించడంపై హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, కళాశాల మాజీ ప్రిన్సిపల్స్, మాజీ విద్యార్థులు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కళలపై ఉన్న అవగాహనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని కృతజ్ఞతలు తెలిపారు. స్థల కేటాయింపును అంబేడ్కర్ యూనివర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది రాజకీయ కోణంలో చూడొద్దని, కొత్త క్యాంపస్ ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, వరంగల్ మాజీ ఎంపీ, పూర్వ విద్యార్థి, శిల్పి పసునూరి దయాకర్, మాజీ ప్రిన్సిపల్స్ ప్రొ.ఎస్.ఎం.పీరం తదితరులు మాట్లాడారు. యూనివర్సిటీ విస్తరణకు స్థలాన్ని కేటాయించి, అధునాతన వసతులతో క్యాంపస్, థియేటర్ల నిర్మాణం చేపట్టడంతో తెలంగాణ సాంస్కృతిక, కళారంగానికి తలమానికంగా నిలుస్తుందన్నారు.

డీసీఎం అతివేగం.. బలైన వ్యక్తి ప్రాణం

బాలానగర్, న్యూస్‌టుడే: అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపిన డ్రైవర్ ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని బలి తీసుకున్న ఘటన బాలానగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై రామనారాయణ కథనం ప్రకారం..ఇంద్రానగర్ గుడిసెల్లో నివాసముంటున్న బొగ్గులపల్లి చంటిరెడ్డి(28) వాటర్ ప్రూఫ్ పనిచేసుకుంటున్నాడు. ఈ నెల 6న తన యాక్టివా వాహనంపై బాలానగర్ క్రాస్ రోడ్స్ వైపు వెళ్తున్నాడు. వై జంక్షన్ నుంచి బాలానగర్ వైపు డీసీఎం వాహనం వేగంగా వచ్చి వెనుక నుంచి యాక్టివాను ఢీకొట్టడంతో దానిపై ఉన్న చంటిరెడ్డి కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. 108అంబులెన్స్‌లో స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, 4, 5ఏళ్ల కుమార్తె, కుమారుడు ఉన్నారు.

హైడ్రా కసరత్తు..

ఈసారి నాలాల వంతు

చెరువుల గొలుసు కట్టు కాలువలపై సర్వే



నల్లచెరువు అలుగు నుంచి వస్తున్న నాలా గాయత్రీనగర్ వద్ద ఇలా..



దేవీనగర్ కింది భాగంలో పొలాల చెంత పిల్ల కాలువలా మారిన పరిస్థితి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: చెరువుల ఆక్రమణలు ఏ స్థాయిలో జరిగాయో.. వాటి గొలుసు కట్టు నాలాలు అదే స్థాయిలో కబ్జాకు గురయ్యాయి. ముంపు సమస్యను నివారించాలంటే.. చెరువుల ఆక్రమణలు తొలగించడం ఒక ఎత్తైతే.. వాటి గొలుసు కట్టు నాలాల పునరుద్ధరణ మరో సవాలు. ఇప్పటికే హైడ్రా అధికారులు కొన్ని ఆక్రమణలు కూల్చివేయగా.. తాజాగా గొలుసు కట్టు కాలువల పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రారంభించిన కసరత్తు గురించి తెలుసుకుందాం.

డ్రోన్ సర్వేకు శ్రీకారం

నియోజకవర్గంలో 8చెరువులుండగా.. అన్నింట్లోనూ భారీగా ఆక్రమణలు జరిగాయి. అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన హైడ్రా అధికారులు ఈ చెరువుల సమాచారాన్ని నీటిపారుదల శాఖ నుంచి తీసుకున్నారు. పాత గూగుల్ మ్యాపుల ఆధారంగా ఆక్రమణలను గుర్తించి డ్రోన్ సర్వే చేసి తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. హైడ్రా కమిషనర్ సైతం మైసమ్మ చెరువును సందర్శించారు. సున్నం చెరువులో మొదటగా ఆక్రమణలు కూల్చివేయగా.. అది శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జరిగింది. తర్వాత కూకట్‌పల్లిలోని నల్లచెరువులోని ఎఫ్‌టీఎల్‌లో 16 భారీ షెడ్లు.. ఇతర నిర్మాణాలు నేలమట్టం చేశారు. ఈ కూల్చివేతల పరిణామాల నేపథ్యంలో.. తదుపరి కొన్ని రోజులుగా దూరంగా ఉంటూ వచ్చిన అధికారులు తాజాగా వీటి గొలుసు కట్టు నాలాలపై ప్రత్యేక దృష్టి సారించి.. డ్రోన్ సర్వేకు శ్రీకారం చుట్టారు.

ఈ చెరువుల చెంతనే.. సర్వే

❖ కేపీహెచ్‌బీకాలనీ హైటెక్‌సిటీ సమీపంలోని ముళ్లకత్వ చెరువు అలుగు నుంచి ఉప్పొంగిన వరద కాముని చెరువులోకి చేరుతుంది. కాముని చెరువు అలుగు నుంచి మైసమ్మ చెరువుకు చేరుతుంది.

❖ ఈ మూడు చెరువుల గొలుసు కట్టు నాలా నీరు కూకట్‌పల్లి నాలాలో కలుస్తుంది. ఈ కాలువలపై హైడ్రా వారం క్రితం డ్రోన్ సర్వే చేపట్టింది. 2010లో రెండు వేర్వేరు ప్రైవేటు కన్సల్టెన్సీలు నిర్వహించిన సర్వే.. వచ్చే వరద ఉధృతి.. ప్రస్తుతం ఎంతమేర వెడల్పుతో ఉంది? ఎంత విస్తరించాలన్న వివరాలతో నివేదికను అప్పట్లోనే ప్రభుత్వానికి సమర్పించారు.

❖ నివేదికను పరిశీలించిన అధికారులు.. తాజాగా డ్రోన్ సర్వేతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. నల్లచెరువు గొలుసు కట్టు నాలాపై సర్వే జరుగుతుంది. ఈ చెరువు అలుగు నుంచి వస్తున్న కాలువ ఖాజాకుంటలో కలుస్తుంది. ఈ కాలువపై సర్వే జరుగుతుంది.

❖ ఈ కాలువలు దారుణంగా ఆక్రమణకు గురయ్యాయి. అలుగు వద్ద కొంతమేర 4నుంచి 5అడుగుల కాలువ ఉండగా.. తర్వాత తగ్గుతూ అడుగు కూడా లేని దుస్థితి కొన్నిచోట్ల ఉంది. ఆయాచోట్ల నాలాలపైనే భవంతులు నిర్మించారు. సర్వే అనంతరం సమీక్షించి నిర్ణయం తీసుకుంటారని అధికారులు పేర్కొంటున్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

పోలీసుల అదుపులో యువకుడు



యువకుడి వివరాలు సేకరిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరేశ్

రెజిమెంటల్‌బజార్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని వందే భారత్ రైలులో బాంబు ఉందంటూ వచ్చిన ఫోన్‌కాల్ పోలీసులను ఉరుకులు పెట్టించింది. తనిఖీల అనంతరం ఇదంతా బూటకమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. గోదావరిఖనికి చెందిన మధుసూదన్(26) నగరంలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొండాపూర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వందేభారత్‌లో బాంబు ఉందంటూ డయల్ 100కు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు ఫోన్‌కాల్ ఆధారంగా యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ అతడి నుంచి వివరాలు సేకరించారు. తాను ఐటీ కంపెనీలో పనిచేస్తున్నానని, తన ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఎవరో హ్యాక్ చేశారని వివరించాడు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మాట్లాడుకున్న మాటలు విని రైల్లో బాంబు పెట్టారనే భయంతో ఫోన్ చేశానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో పోలీసులు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవటం వల్లనే ఫోన్‌కాల్ చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సైబర్ మాయగాళ్లను పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న మాయగాళ్లను పట్టుకునేందుకు నగర పోలీసులు సిద్ధమయ్యారు. కంబోడియా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాల్లో పాగా వేసిన కేటుగాళ్లు భారతదేశంలో దళారులను ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నారు. ఫెడెక్స్ కొరియర్, సెక్స్‌టార్షన్, ఇన్వెస్ట్‌మెంట్ పేరిట సామాన్యులకు వలవేసి రూ.కోట్లు వసూలు చేస్తున్నారు. కమీషన్ ఆశచూపి బ్యాంకు ఖాతాలను అద్దెకు తీసుకొని తమ గుట్టు బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. తాజాగా మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్‌కు చెందిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. వీరి ద్వారా సేకరించిన వివరాలతో విదేశాల్లో ఉన్న 18 మంది కీలక నిందితులను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు జారీచేశారు.

వ్యక్తి అదృశ్యం



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పనికి రాకుండా ఊరెళ్లకుండా ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కేపీహెచ్‌బీకాలనీ 9వ ఫేజ్ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న **ఎం.నర్సింహులు(29)** స్థానికంగా ఓ ఫుడ్ కోర్టులో రెండేళ్లుగా వంట మనిషిగా పనిచేస్తున్నాడు. గతనెల 13న చెప్పకుండా పని మానేసిన వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదు. సెల్ ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుంది. ఫుడ్‌కోర్టు నిర్వాహకురాలు రత్నకుమారి ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శేరిలింగంపల్లి

• శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

నేత్రపర్వం.. నృత్యాభినయం


కూచిపూడి నృత్య ప్రదర్శన

మాదాపూర్, న్యూస్‌టుడే: శిల్పారామంలో సోమవారం సాయంత్రం కళాకారుల చూడముచ్చటైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నేత్రపర్వంగా సాగాయి. నాట్య గురువు లక్ష్మీశంకర్ శిష్య బృందం వినసొంపైన కీర్తనలకు అనుగుణంగా లయాత్మకంగా చేసిన కూచిపూడి నృత్యాంశాలు అందరినీ అలరించాయి. వారు ప్రదర్శించిన వినాయక కౌతం, పార్వతినందనం నృత్యాంశాలు కనువిందు చేశాయి. అనంతరం అర్చన మిశ్రా శిష్య బృందం చక్కటి నృత్యాభినయంతో కథక్ నృత్యాంశాలను ప్రదర్శించారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బాధ్యతల స్వీకరణ


హబీబుల్లా ఖాన్


సత్యనారాయణ

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ హబీబుల్లా ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్.ఆంజనేయులు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ విభాగానికి బదిలీకాగా శంకర్‌పల్లి ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న హబీబుల్లా ఖాన్ గచ్చిబౌలి ఠాణాకు బదిలీపై ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు.

● మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన షాదనగర్ రూరల్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తూ ఇక్కడకి బదిలీపై వచ్చారు.

రెండు గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

శేరిలింగంపల్లి: బీహెచ్ఈఎల్ పాత ఎంఐజీ కాలనీతోపాటు పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడేసరికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తెల్లాపూర్‌వద్ద 130 కేవీ విద్యుత్తు లైను వైరు తెగిపడటంతో పైనుంచి వచ్చే విద్యుత్ సరఫరా ఆగిపోయిందని ఏఈ బాలకృష్ణ తెలిపారు. మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఆస్పత్రి అధ్వానం.. సేవలు దయనీయం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: రోజుకు 50 నుంచి 100 మంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య సేవలు అందించే శేరిలింగంపల్లి ప్రాథమిక వైద్య కేంద్రం. నవజాత శిశువులకు వ్యాక్సినేషన్ కోసం పెద్ద సంఖ్యలో పేద మహిళల కుటుంబాలు వస్తుంటాయి. ఇలా గర్భిణుల నుంచి మొదలుకొని చిన్నాపెద్దా చాలామంది వైద్య సేవలు వినియోగించుకునే ఆసుపత్రి సరైన పర్యవేక్షణ లేక దయనీయంగా మారింది. ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోకపోవడంతో పరిస్థితులు మరింత దిగజారాయి.


నీటి సదుపాయం లేక..

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ..

ఆసుపత్రి రూపురేఖలను మార్చాల్సిన ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి పట్టించుకోకపోవడంతో పరిస్థితి దయనీయంగా మారింది. ఆసుపత్రికి ప్రభుత్వం అందించే నిర్వహణ నిధులతోపాటు, ప్రజాప్రతినిధులు, దాతల సాయంతో సమస్యలు పరిష్కరించవచ్చు. అందుకు భిన్నంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గాలికి వదిలేశారు.

● నీటికి ఉపయోగించే బోరు మోటారు రెండేళ్లుగా పనిచేయడం లేదు.

● జలమండలి నీటి సరఫరా అవుతోంది. సంపులో నుంచి నీటిని ఓవర్ హెడ్ ట్యాంకుకు ఎక్కించడానికి మోటారు లేదు. సంపు శుభ్రం చేయడంలేదు. ఓవర్ హెడ్ ట్యాంకు పరిశుభ్రత లేదు. సిబ్బంది బిందెలతో నీటిని తెచ్చి మరుగుదొడ్లకు ఉపయోగిస్తున్న దుస్థితి. అపరిశుభ్రమైన మరుగుదొడ్ల కారణంగా రోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

● ఆసుపత్రి ప్రాంగణం పిచ్చి మొక్కలు, భవనం మట్టితో నిండి ఉంది. ప్రాంగణమంతా ఎగుడు దిగుడుగా ఉంది. వర్షం పడితే ఎక్కడపడితే అక్కడే నీరు నిలుస్తోంది.

● ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో ఎవరికీ తెలియదు.


ప్రాథమిక వైద్యాధికారి వైద్య సేవలందించే గది పక్కన పిచ్చి మొక్కలు, అపరిశుభ్రత..


శేరిలింగంపల్లి ప్రాథమిక వైద్య కేంద్రం..

● ఆసుపత్రికి వచ్చిన రోగులకు సిబ్బంది మొక్కుబడిగా మందు గోళీలు ఇచ్చి పంపుతున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య దారుణంగా పడిపోయింది.

బాధ్యత తీసుకోవాల్సిందే


ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారితోపాటు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ బాధ్యత తీసుకొని ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి.. ఎక్కువ మంది రోగులు వైద్య సేవలు పొందేలా చక్కదిద్దాలి. ప్రభుత్వ నిధులు లేకుంటే దాతల సాయంతో ఆసుపత్రిని గాడిన పెట్టాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

నేను రాక ముందునుంచే సమస్యలు

ఆసుపత్రిలో ఉన్న చాలా సమస్యలు నేను రాక ముందు నుంచే ఉన్నాయి. వీఐపీ కార్యక్రమాలకు హాజరుకావాల్సిన పరిస్థితులు ఉండటంతో సమస్యల పరిష్కారం క్లిష్టంగా మారింది. సత్వరమే అన్ని అంశాలపై దృష్టి సారిస్తాను. ప్రాధాన్యాలవారీగా సమస్యలను పరిష్కరిస్తా.

–అన్నపూర్ణ, శేరిలింగంపల్లి ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి

వైద్య సేవలు సక్రమంగా అందించాలి


ల్యాబ్ టెస్టుల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: రోగులకు సరైన వైద్య సేవలు అందించాలని శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్‌వో సుధాకర్ లాల్ అన్నారు. శేరిలింగంపల్లితో పాటు పలు ప్రాంతాల్లోని బస్తీ దవాఖానాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. శేరిలింగంపల్లిలో రోగులకు చేస్తున్న ల్యాబ్ టెస్టుల దస్త్రాలు పరిశీలించారు. సీహెచ్‌వో స్వామి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

పటాన్‌చెరు అర్బన్, రామచంద్రాపురం రూరల్,న్యూస్‌టుడే

? పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఫేజ్-1 పాత నవతా ట్రాన్స్‌పోర్టుకు వెళ్లే రహదారిలో డ్రైనేజ్ మురుగంతా చేరి ఇబ్బందులు పడాల్సివస్తోంది.
–విశ్వేశ్వరావు, శ్రీరాంనగర్‌కాలనీ

✓ మురుగు ఎక్కడి నుంచి వస్తుందో పరిశీలించి రాకుండా చర్యలు తీసుకుంటాం. –రతన్ రాథోడ్, టీజీఐఐసీ జెడ్ఎం.

? కొల్లూర్ మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్ నుంచి కొల్లూరు వైపు వెళుతుండగా రేడియంరోడ్డు చౌరస్తా వద్ద మట్టి రోడ్డు ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు.
–శ్యాంప్రసాద్, కొల్లూరు.

✓ సమస్యను పరిశీలించి తగిన ఏర్పాట్లు చేస్తాను. హెచ్చరిక బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.
–సంగారెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్.

స్పందనకు వందనం

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్ అర్జున్‌రెడ్డి కాలనీ కూడలి వద్ద రోడ్డు సరిగా లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్న విషయమై కాలనీవాసులు 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా' దృష్టికి తెచ్చారు. జీహెచ్ఎంసీ చందానగర్ సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం ఏఈ సంతోష్‌రెడ్డి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పూర్తయిన కుటుంబ డిజిటల్ సర్వే

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: తెల్లాపూర్ పురపాలిక ఎంఐజీకాలనీ మూడో వార్డులో చేపట్టిన కుటుంబ డిజిటల్ సర్వే ముగిసింది. 287 ఇళ్లలో 439 కుటుంబాల వివరాలను సేకరించారు. ఈ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, సీఎం కార్యాలయ ప్రత్యేక కార్యదర్శి సంగీతలు పర్యవేక్షించారు. నివేదిక సమర్పించామని కమిషనర్ సంగారెడ్డి చెప్పారు.

అమ్మోరి వైభవం.. భక్తుల పరవశం

● ఘనంగా నవరాత్రి ఉత్సవాలు


లలితా త్రిపుర సుందరిగా బీహెచ్ఈఎల్ కనకదుర్గమ్మ


చందానగర్ వేంకటేశ్వర ఆలయంలో భవానీ మాతగా..


తారానగర్‌లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


శిల్పా ఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో అన్నపూర్ణగా..


దత్తాత్రేయ కాలనీలో ఆలయంలో మహాచండీ దేవిగా.


హైదర్‌నగర్ మైసమ్మ ఆలయంలో శాకంబరి అమ్మవారిగా..


ఖాజాగూడ సాయిఐశ్వర్య కాలనీ ముత్యాలమ్మ గుడిలో శ్రీమహాలక్ష్మిగా..


మియాపూర్ గ్రామంలో పూజల్లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్, మోహన్ తదితరులు


రాయదుర్గంలో సామూహిక పూజల్లో భక్తులు

శేరిలింగంపల్లి, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు, అన్నదానాల సందడి కొనసాగింది. – బెల్(శేరిలింగంపల్లి), చందానగర్, మియపూర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్‌కాలనీ, రాయదుర్గం–న్యూస్‌టుడే

కనులపండువగా మల్లికార్జున స్వామి కల్యాణం

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: హైదర్‌నగర్ డివిజన్ దుర్గా మైసమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం భ్రమరాంబ మల్లికార్జున కల్యాణం కనులపండువగా జరిగింది. ఉదయం వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకం, అలంకరణ చేశారు. 11 గంటలకు కల్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జరిగింది. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, సమీప కాలనీలవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి


అమీన్‌పూర్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహం వద్ద సోమవారం చిన్నారులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో ఆకట్టుకున్నారు. అనంతరం వారికి గుర్తింపు పత్రాలను మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రదానం చేశారు.

ముగిసిన వికీమీడియా టెక్నాలజీ సదస్సు

ఈనాడు డిజిటల్,హైదరాబాద్: గచ్చిబౌలిలో జరిగిన వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్-2024 ముగిసిందని ట్రిపుల్‌ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ రాధికా మామిడి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండిక్ మీడియావికీ డెవలపర్స్ యూజర్ గ్రూప్, వికీమీడియా ఫౌండేషన్ మద్దతుతో సదస్సు నిర్వహించామన్నారు. ఓపెన్‌సోర్స్ టెక్నాలజీ, వికీమీడియా ప్రాజెక్టులలో వస్తున్న నూతన ఆవిష్కరణలపై చర్చించడానికి దేశం నలుమూలల నుంచి 130 మంది వరకు సాంకేతిక నిపుణులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇండిక్ లాంగ్వేజ్ కమ్యూనిటీలకు, అంతకు మించి అందుబాటులో ఉన్న సాంకేతిక మద్దతును పెంచడానికి విజయవంతమైన కార్యక్రమం వికీమీడియా టెక్నాలజీ సమ్మిట్ అని వివరించారు. హెడ్ ప్రొఫెసర్ వాసుదేవ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం, ప్రగతే ధ్యేయం: ఎమ్మెల్యే


హైటెక్‌సిటీ - యశోద ఆసుపత్రి సర్వీస్ రోడ్డు పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే గాంధీ, ఇతర నేతలు

మాదాపూర్, న్యూస్‌టుడే: మాదాపూర్ డివిజన్ పరిధిలోని వేర్వేరు కాలనీల్లో రూ.5.1 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, వరదనీటి కాలువ నిర్మాణ పనులకు సోమవారం పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . ఆదిత్యనగర్‌లో రూ.73 లక్షలతో సీసీ రోడ్లు, ఇజ్జత్‌నగర్‌లో రూ.69 లక్షలతో సీసీరోడ్లు, హైటెక్‌సిటీ నుంచి యశోద ఆసుపత్రి వరకు రూ.2.62 కోట్లతో సర్వీస్‌రోడు పనులను ప్రారంభిస్తామన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్..

చందానగర్ సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో పీసీఐ ఇండియా గ్లోబల్ ఎన్‌జీవో సహకారంతో ఏర్పాటుచేసిన మహిళాశక్తి క్యాంటీన్‌ను ఉప కమిషనర్ మోహన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే గాంధీ సోమవారం ప్రారంభించారు. కార్పొరేటర్లు మంజుల, జగదీశ్వర్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్: గోకుల్ ప్లాట్స్, హఫీజ్ పేట ఆదిత్యనగర్‌లో రూ.2కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌లోని రాంకీ పెరల్ గృహ సముదాయం ఆధ్వర్యంలో రూ.3కోట్లతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గాంధీ.. కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. నేత ఇబ్రహీం, రాంకీ గృహ సముదాయం అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ నీటి బిల్లుల చెల్లింపుపై ఆరా


తెల్లాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: అభివృద్ధికి వెచ్చించాల్సిన నిధులను ఉచిత నీటి సరఫరాకు ఖర్చు చేయడంపై జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పట్టణంలో ఆమె పర్యటించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల విచారణపై ప్రత్యక్ష పరిశీలన చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెల్లాపూర్ పురపాలికలో ఉచిత నీటి సరఫరాపై కమిషనర్ సంగారెడ్డిని వివరాలు అడిగారు. ఐదేళ్లలో రూ.10 కోట్లపైగా బిల్లుల రూపంలో జలమండలికి చెల్లించామని ఆయన వివరించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించారు. వచ్చేనెల నుంచి నీటి బిల్లులు వసూలు చేయాలన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లలిత, నీటిపారుదల శాఖ ఏఈ సంతోషిణి తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసిన వారికి గుర్తింపు


ఈవో శ్రీధర్‌రెడ్డిని సత్కరించిన ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకర్‌యాదవ్

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ఉద్యోగరీత్యా ఆలయాల్లో సేవ చేసినవారికి గుర్తింపు లభిస్తుందని అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ సుధాకర్ యాదవ్ అన్నారు. పాతికేళ్లుగా ఆలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి ఈవోగా పదోన్నతిపై బదిలీ అయిన శ్రీధర్‌రెడ్డిని సోమవారం సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలం ఒకే ఆలయంలో పనిచేయడం సేవకు గుర్తింపు అని వివరించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు.. భార్య బలవన్మరణం

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పటాన్‌చెరు భగత్‌గల్లీకి చెందిన జహంగీర్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తరచూ భార్య అమ్రిన్ సహేదా(30) తో గొడవపడేవాడు. పలుమార్లు ఇరువురి పెద్దలు నచ్చచెప్పారు. శుక్రవారం రాత్రి మళ్లీ వీరిద్దరి మధ్య గొడవ జరగడంతో.. పడక గదికి వెళ్లి ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుంది. జహంగీర్ చూసి ఇంటి యజమానితో కలిసి తలుపు పగులగొట్టి వెళ్లి చూసేసరికి నిర్జీవంగా మారింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పూల పండగ


బతుకమ్మ వేడుకల్లో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

మాదాపూర్, న్యూస్‌టుడే: కొండాపూర్‌లోని సంస్కృతి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. కళాశాల డైరెక్టర్లు రేవతి రాజు, యామిని రాజు, ప్రిన్సిపల్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రతపై చర్యలు: ఎంపీ


బాధితుడిని పరామర్శిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

బెల్(శేరిలింగంపల్లి), న్యూస్‌టుడే: బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో భద్రతా చర్యల విషయంలో తగిన చర్యలు తీసుకుంటామని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. ఇటీవల బీహెచ్ఈఎల్ కార్మికుడు కార్తీక్ మహాపాత్రపై కొందరు దాడి చేశారు. ఈ క్రమంలో ఎంపీ బాధితుడిని పరామర్శించారు. టౌన్‌షిప్‌లో ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకున్నా, చర్యలు తీసుకోవడంలో బెల్ ఎస్టేట్ అధికారులు విఫలమయ్యారని బీఎంఎస్ నాయకులు తెలిపారు. దీనిపై ఎంపీకి వినతిపత్రం అందించారు. ఆయా అంశాలపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఎన్.మహేష్‌భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డి సన్స్ పటోలా వస్త్ర ప్రదర్శన ప్రారంభం


ప్రదర్శనను ప్రారంభిస్తున్న సుధాజైన్

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: ఉత్తరాది, దక్షిణాది ప్రాంతాలకు చెందిన విభిన్న వస్త్ర ఉత్పత్తులు, చేనేత చీరలు, పటోలా, హ్యాండ్లూమ్స్ సిల్క్ వస్త్రోత్పత్తుల ప్రదర్శన 'డి సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన పేరిట సోమవారం బంజారాహిల్స్‌లోని రోడ్ నం.1లోని లేబుల్స్ పాప్-అప్ స్పేస్‌లో ప్రారంభమైంది. మిస్ ఇండియా ఆసియా పసిఫిక్, నగర సోషలైట్ సుధా జైన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రదర్శన ప్రారంభించారు. నిర్వాహకుడు భవిన్ మక్వానా మాట్లాడుతూ, పదివేల రకాల ఉత్పత్తులు కొలువుదీరాయన్నారు. ఇది ఈనెల 15వ తేదీ వరకు కొనసాగనుంది.

ఆకట్టుకున్న యువ కళోత్సవం

రవీంద్రభారతి న్యూస్‌టుడే: తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో యువ కళోత్సవం కర్ణాటక, హిందుస్థానీ సంగీత కార్యక్రమాలు శ్రోతలను అలరించాయి. వేడుకల్లో భాగంగా సోమవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. సంగీత నాటక అకాడమి అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల మాట్లాడుతూ..ప్రకృతిని ఆరాధించే పండగ అని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శ్రీమతి ఎ.వాణిప్రసాద్, కేంద్ర ప్రభుత్వ నార్త్ ఈస్ట్ జోన్ కల్చర్ సెంటర్ సంచాలకుడు ప్రసన్న గొగోయి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పాల్గొని మాట్లాడారు.

బస్సు షెల్టర్ కూల్చివేసిన ఆగంతుకులు



షెల్టర్‌ను కూల్చివేస్తున్న దృశ్యం..

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని డోయన్స్‌కాలనీ దగ్గర లింగంపల్లి నుంచి గచ్చిబౌలివైపు వెళ్లే రోడ్డులో ఉన్న బస్సు షెల్టర్‌ను గుర్తు తెలియన వ్యక్తులు కూల్చివేశారు. ఈ వ్యవహారంపై స్థానికులు అనుమానం వచ్చి ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ ఘటనపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ బస్ డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డిని వివరాలు కోరగా.. బస్సు షెల్టర్ కూల్చివేసిన విషయం తమ దృష్టికి రాలేదన్నారు. కూల్చివేతకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమీప భవన నిర్మాణదారులు కూల్చివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఘటనపై ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం రూరల్: కార్మికుల గుడిసెల్లో అమ్ముతున్న గంజాయిని పట్టుకున్న ఘటన కొల్లూరు ఠాణా పరిధిలో జరిగింది. సీఐ రవీందర్ తెలిపిన వివరాలివీ.. ఒడిశాకు చెందిన భుబానిబాగ్ అనే వ్యక్తి మైహోమ్ విపినలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. గంజాయి తాగే అలవాటుంది. సొంత గ్రామంనుంచి తెచ్చుకున్న 600 గ్రాముల గంజాయిని అమ్ముతుండగా సోమవారం పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు.

24 మందికి జరిమానా

పటాన్‌చెరు అర్బన్: పరిమితికి మించి మద్యంతాగి వాహనాలు నడిపినవారికి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ ఠాణా సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో 24 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ చిక్కారు. సంగారెడ్డి కోర్టుకు తరలించగా రూ.2వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ వివరించారు.

కుత్బుల్లాపూర్

జంట సర్కిళ్లలో ప్రజావాణికి 15 అర్జీలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: జంట సర్కిళ్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 15 ఫిర్యాదులు అందాయి. పలు కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని అభ్యర్థించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో ఉప కమిషనర్ నర్సింహ, గాజులరామారం సర్కిల్‌లో ఉప కమిషనర్ మల్లారెడ్డిల ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'ప్రజా వాణి' నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో 8 అర్జీలు వచ్చాయి. ఎలక్ట్రికల్ విభాగానికి 2, పట్టణ ప్రణాళికకు 2, ఆస్తిపన్నుల విభాగానికి 2, ప్రజారోగ్యం, ఇంజినీరింగ్ విభాగాలకు ఒక్కోటి వచ్చింది. గాజులరామారం సర్కిల్‌లో మొత్తం 7 రాగా, ఇంజినీరింగ్ విభాగం 5, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్ విభాగాలకు ఒక్కో అర్జీ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రోడ్డు తొలగింపు


పొక్లెయిన్‌తో ధ్వంసం చేయిస్తున్న సిబ్బంది

దుండిగల్, న్యూస్‌టుడే: డి.పోచంపల్లి సారేగూడెంలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం అధికారులు తొలగించారు. స్థిరాస్తి వెంచర్ కోసం ఓ నిర్మాణ సంస్థ ఇటీవల ఈ రోడ్డును నిర్మించింది. ఈ విషయం దుండిగల్ పురపాలిక, రెవెన్యూ అధికారుల దృష్టికి రావడంతో సోమవారం పొక్లెయిన్‌తో రహదారిని ధ్వంసం చేశారు.

ముగిసిన అటవీ అధికారుల క్రీడా పోటీలు

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో రెండు రోజుల పాటు జరిగిన 7వ రాష్ట్రస్థాయి అటవీశాఖ అధికారుల క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఎలుసింగ్ మేరు హాజరై ప్రతిభ కనబరిచిన అధికారులకు బహుమతులు ప్రదానం చేశారు. అన్ని జిల్లాల నుంచి 815 మంది అధికారులు పోటీల్లో పాల్గొన్నారు. జోనల్, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన వారు ఈనెల 16న రాయపూర్ వేదికగా జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొననున్నారు.

అధ్యాపకులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

నిజాంపేట, న్యూస్‌టుడే: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోధన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో వేర్వేరు రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. తామంతా జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి అధ్యాపకులే కారణమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సి.డి.నాయుడు, డైరెక్టర్ చెన్నకేశవరావు, సంఘం అధ్యక్షుడు సి.జగదీశ్వర్‌రెడ్డి, టి.కృష్ణ, జి.సుధీర్, ఎ.నరేష్, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో ఉండకపోతే స్వాధీనం చేసుకుంటాం


◆ రెండు పడక గదుల ఇళ్ల లబ్ధిదారులకు అధికారుల హెచ్చరిక
◆ వారం రోజుల గడువు విధిస్తూ నోటీసుల ప్రదర్శన


నిజాంపేటలోని గృహ సముదాయం

న్యూస్‌టుడే, నిజాంపేట

కేటాయించిన ఇంట్లో ఉండకపోతే తిరిగి స్వాధీనం చేసుకుంటామంటూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు లబ్ధిదారులను అయోమయానికి గురిచేస్తున్నాయి. నిజాంపేటలోని రెండు పడక గదుల గృహ సముదాయం వద్ద ఈ పరిస్థితి నెలకొంది. నిజాంపేట-బాచుపల్లి సరిహద్దుల మధ్యన గత ప్రభుత్వ హయాంలో 22 బ్లాకులతో 2,520 ఇళ్లను నిర్మించారు. గత ఎన్నికలకు ముందు వాటిని లబ్ధిదారులకు కేటాయించారు. నిజాంపేట పరిధిలో 14, బాచుపల్లి పరిధిలో 8 బ్లాకులు ఉన్నాయి. ఈ రెండు సముదాయాలు ప్రస్తుతం జీహెచ్ఎంసీ ఆధీనంలో ఉన్నాయి. నిజాంపేటలోని గృహాల కేటాయింపు జరిగినప్పటికీ నిర్మాణ పనులు పూర్తికాలేదు. ప్రస్తుతం తుది దశ పనులు జరుగుతున్నాయి. బాచుపల్లిలోని 1,080 గృహాల్లో పనులు గతంలోనే పూర్తయ్యాయి. వీటిలో 946 లబ్ధిదారులకు కేటాయించారు. మిగతా 134 మూసీ బాధితులకు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఇక్కడ ప్రస్తుతం కేవలం 150 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. మిగతా ఇళ్లకు తాళాలున్నాయి. ఈ పరిణామాన్ని అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

- ప్రాజెక్టు పేరు: రెండు పడక గదుల ఇళ్ల సముదాయం, నిజాంపేట
- నిర్మించిన బ్లాకులు : 22
- మొత్తం నివాసాలు: 2,520
- ప్రస్తుతం నివాస కుటుంబాలు: 150


అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

దసరాలోపు రాకపోతే అంతే..

బాచుపల్లిలో కేటాయించిన 1,080 ఇళ్లల్లో సంబంధికులు నివాసం ఉండకపోతే స్వాధీనం చేసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. గృహ సముదాయంలోని పలుచోట్ల రెండు రోజుల క్రితం హెచ్చరిక పేరుతో ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. వాటిలో పేర్కొన్నట్లుగా వారం రోజులు అంటే దసరా గడువుగా స్పష్టమవుతుంది. ఇప్పటికే జీహెచ్ఎంసీ సిబ్బంది కాలనీలోనూ విషయమై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఇళ్లు పొందిన వారు నగరంలో ఎక్కడెక్కడో ఉంటారు.. మరి అటువంటప్పుడు అధికారులు హెచ్చరికలు వారికి ఎలా చేరతాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఈ ఇళ్లలోకి రావడానికి కొందరు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. పక్కనే డంపింగ్ యార్డు ఉండటం.. సరైన రవాణా సదుపాయాలు లేకపోవడం వంటి సమస్యల కారణంగా కొన్నాళ్లు వేచి చూశాక వెళ్లాలనే ధోరణితో ఉన్నారు. ప్రస్తుతం అధికారుల నిర్ణయం ఎటువంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాల్సిందే మరి.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, దుండిగల్, న్యూస్‌టుడే

? నర్సాపూర్ ప్రధాన రహదారి రాజీవ్‌పార్కు వద్ద పైప్‌లైన్‌రోడ్డులో మురుగు నిలిచి దుర్గంధం వ్యాపిస్తోంది.
– నాగిళ్ల శ్రీనివాస్, షాపూర్‌నగర్

✓ సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం. లీకేజీ సమస్య ఉంటే జలమండలికి సమాచారం ఇస్తాం.
– డాక్టర్ మమత, జీహెచ్ఎంసీ వైద్యాధికారి

? గాజులరామారం రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేశారు. దానిని తవ్వినచోట తిరిగి నిర్మించకపోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. - సతీష్, గాజులరామారం రోడ్డు

✓ త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం.
– రవి, జలమండలి డీజీఎం

? సమస్య: బౌరంపేట నుంచి స్థానిక డీఆర్‌కే కళాశాల వరకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉంది. వర్షం కురిసినప్పుడు పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.
–వేణు, స్థానిక నివాసి

✓ మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తాం
–సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

పాదచారుల వంతెన ప్రారంభం


ఎస్కలేటర్‌పై ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద, నాయకులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలో రూ. 3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన పాదచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జ్)ను సోమవారం ఎమ్మెల్యే వివేకానంద ప్రారంభించారు. నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్నా ఇప్పటివరకు ప్రారంభోత్సవం వాయిదాపడుతూ వస్తోంది. ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహానగరాభివృద్ధిలో భాగంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 54 ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. నేడు నగరాభివృద్ధిపై ఆలోచించేందుకు నగరం నుంచి ఒక్క మంత్రీ లేడని విమర్శించారు. నగరానికి నార్త్‌సిటీగా ఉన్న కుత్బుల్లాపూర్ ప్రాంతానికి మెట్రో విస్తరించాలని, భరత్‌నగర్ నుంచి బాలానగర్, చింతల్, జీడిమెట్ల మీదుగా గండిమైసమ్మ వరకు కారిడార్ నిర్మించాలని కోరారు. కార్పొరేటర్ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 45 లక్షల విలువచేసే 114 చెక్కులను సోమవారం చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివేకానంద పంపిణీ చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: సూరారం డివిజన్‌లోని షాపూర్‌నగర్, సంజయ్‌గాంధీనగర్, సూరారంలో సోమవారం భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమాన్ని జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి నమోదు చేయాలని స్థానిక నేతలకు సూచించారు. రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు బావిగడ్డ రవి, రఘుపతి పాల్గొన్నారు.

జగన్మాత దర్శనం.. భక్తుల ఆనంద పరవశం

నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు కొన్నిచోట్ల హోమాలు నిర్వహించారు. ఒక్కోచోట ఒక్కో అలంకరణలో కొలువైన అమ్మవారిని దర్శించి భక్తులు ఆనంద పరవశులవుతున్నారు. –న్యూస్‌టుడే బృందం


బాచుపల్లి సాయి అనురాగ్‌కాలనీలో లలితా త్రిపురసుందరి...


దూలపల్లి దుర్గామాత ఆలయంలో మహాచండీదేవిగా


ఎన్సీఎల్ కాలనీ నార్త్‌లో మహాచండీ


చాముండేశ్వరిగా నిజాంపేట కనకదుర్గ


దూలపల్లిలో మహాచండీదేవిగా


సాయి సన్నిధానంలో లలితాదేవిగా


గాజులరామారంలో మహాచండీదేవిగా చిత్తారమ్మ



రహదారిపై మురుగు తిష్ట

మల్లంపేట బస్టాప్ సమీపంలో గృహ సముదాయాలతోపాటు ఓ ప్రైవేటు పాఠశాల ఉన్న ప్రాంతంలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు లీకై రోడ్డుపై పారుతోంది. నెల రోజులుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. రాకపోకలకు వాహనదారులు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. –న్యూస్‌టుడే, దుండిగల్

అడ్డూ అదుపు లేకుండా అదనపు నిర్మాణాలు

● ఇరుకుగా మారుతున్న రోడ్లు ● కాలనీ సంఘాలు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో అదనపు నిర్మాణాలు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం పేద ప్రజల కోసం నిజాంపేట, జగద్గిరిగుట్ట, సూరారం కాలనీల్లో రాజీవ్ గృహకల్ప, గాజులరామారంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయాలను బహుళ అంతస్తులతో సకల సదుపాయాలు కల్పిస్తూ నిర్మించింది. కొందరు స్వార్థంతో వ్యవహరిస్తూ తమకు కేటాయించిన కట్టడానికి అదనంగా మరికొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తూ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ తంతు క్రమంగా విస్తరిస్తుండటంతో కాలనీలు స్వరూపాన్ని కోల్పోతున్నాయి.

రహదారులను ఆక్రమిస్తూ..

గత సంవత్సరం ఈ ఆక్రమణలు ప్రారంభమైనప్పుడు జనవరిలో 'ఆక్రమణలతో అడ్డగోలు దందా' శీర్షికతో 'ఈనాడు'లో ఇచ్చిన కథనానికి అధికారులు స్పందించి అదనపు నిర్మాణాలను నిలిపివేయించారు. తర్వాత ఈ అంశం పట్టించుకోకపోవడంతో మరోసారి ఆక్రమణలకు బరి తెగిస్తున్నారు. కొంతకాలంగా నిజాంపేట, జగద్గిరిగుట్ట, సూరారం కాలనీ ప్రాంతాల్లోని గృహాలను ఆనుకుని రహదారులను ఆక్రమిస్తూ నిర్మాణాలు వెలుస్తున్నాయి. దీంతో రోడ్లు ఇరుకుగా మారుతున్నాయి. ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలనూ వదలడం లేదు. వాటినీ కబ్జా చేస్తున్నారు. ముందుగా నిజాంపేటలో స్థానిక సంక్షేమ సంఘం మొదలుపెట్టిన ఈ నిర్వాకం తర్వాత సూరారం, జగద్గిరిగుట్ట రాజీవ్‌గృహకల్ప కాలనీలకు పాకింది. తాజాగా జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి చేరింది.

గాజులరామారంలో భారీగా..

గాజులరామారం జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలోని 32 బ్లాకులకుగాను 20 బ్లాకుల్లో ఆక్రమణలకు పాల్పడుతూ పనులు ప్రారంభించారు. యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నా రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ విషయమై కుత్బుల్లాపూర్ మండల డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున్‌రావును వివరణ కోరగా..గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి సంయుక్తంగా ఆ కాలనీల్లో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై పరిశీలన చేపడతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


గాజులరామారంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో మొదలైన అదనపు నిర్మాణాలు

ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయగా..

సూరారం, నిజాంపేటలో 100కు పైగా బ్లాక్‌లు, జగద్గిరిగుట్టలో 72 బ్లాకులు, గాజులరామారంలో 32 బ్లాకుల్లో గృహాలు నిర్మించారు. ఒక్కో బ్లాకు మధ్యలో విశాలమైన రోడ్లు, అగ్నిప్రమాదాలు జరిగితే అగ్నిమాపక శకటం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చే విధంగా నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఆక్రమణలతో చిన్నపాటి ట్రాలీకూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఈ దందా నిర్విఘ్నంగా సాగుతోంది. కొందరు సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆక్రమణదారుల వద్ద రూ. 1.25 లక్షల నుంచి 1.50 లక్షల వరకు వసూలు చేస్తూ వారికి వత్తాసు పలుకుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకూ వాటాలు వెళ్తుండటంతో ఎవరూ ఈ వ్యవహారాన్ని పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

ఉర్దూ పోస్టులు బీసీ-ఇ గ్రూపునకు కేటాయించాలని వినతి

కుత్బుల్లాపూర్: ఎస్సీ కేటగిరిలోని ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను బీసీ-ఇ గ్రూపు అభ్యర్థులకు కేటాయించాలని కోరుతూ రంగారెడ్డినగర్ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు మహ్మద్ మతిన్ సోమవారం జిల్లా కలెక్టర్ హరీష్‌కు వినతి పత్రం అందజేశారు. పోస్టులు ఆ భాష రాని వారికి కేటాయిస్తే బోధన చేయలేరని వివరించారు.

మా అన్న బండికే చలానా వేస్తారా..

ట్రాఫిక్ పోలీసులపై ఓ యువకుడి హల్‌చల్

జీడిమెట్ల, న్యూస్‌టుడే: నిబంధనలు పాటించని ఓ వాహనదారుడికి ట్రాఫిక్ పోలీసులు చలానా విధించారు. విషయం తెలిసిన తమ్ముడు.. తన అన్న బండికే చలానా వేస్తారా అంటూ పోలీసులపై చిందులు తొక్కాడు. షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలో సోమవారం ఉదయం జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అపసవ్య దిశలో ఓ వ్యక్తి వచ్చాడు. పోలీసులు అతని వాహనాన్ని ఆపి జరిమానా విధించారు. విషయం తెలుసుకున్న సోదరుడు రంజన్ కుమార్ (35) మద్యం మత్తులో పోలీసుల వద్దకు వచ్చి హల్ చల్ చేశాడు. మీ సంగతి చూస్తానంటూ ఓ కానిస్టేబుల్‌పై దాడికి యత్నించాడు. వెంటనే ట్రాఫిక్ సిబ్బంది జీడిమెట్ల శాంతిభద్రతల పోలీసులకు సమాచారం అందించారు. వారొచ్చి అతడిని అదుపులోకి తీసుకొని పెట్టీ కేసు నమోదు చేశారు.

నడిరోడ్డుపై గుంత.. ప్రమాదాల చింత



గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్ కూడలిలో నడిరోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది. చీకటి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గుర్తించలేక అదుపుతప్పి పడిపోతున్నారు. వారం రోజులుగా ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, షాపూర్‌నగర్

ఉరేసుకుని కార్మికుడి ఆత్మహత్య

శంషాబాద్: పరిశ్రమలోనే ఓ కార్మికుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆర్జీఐఏ ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. జీడిమెట్ల సూరారానికి చెందిన జానకీరావు(23) కొంత కాలంగా గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలోని పుష్ప స్టీల్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఎప్పటిలా పనికి వెళ్లిన జానకీరావు కంపెనీ బాత్‌రూంలో ఉరేసుకున్నాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి



జీడిమెట్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు సహకరించాలని జీడిమెట్ల ఎస్సై నాయుడు ప్రజలను కోరారు. షాపూర్‌నగర్ ప్రధాన రహదారిలో ఆదివారం ఆర్టీసీ బస్సు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. అతడి ఆచూకీ గుర్తించేందుకు ఎలాంటి కార్డులు లభ్యం కాలేదు. ఎవరైనా గుర్తిస్తే 8712663217 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

అర్ధరాత్రి ఇంట్లో అగ్ని ప్రమాదం

కుత్బుల్లాపూర్: ఓ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగి విలువైన సామగ్రి బుగ్గిపాలైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కాలనీవాసి సాయి చిరంజీవి విశ్రాంత ప్రైవేటు ఉద్యోగి. ఈనెల 16న కుమార్తె పెళ్లి ఉండటంతో.. అవసరమైన సామగ్రి సమకూర్చి పెట్టుకున్నారు. అర్ధరాత్రి సమయంలో హాల్లోని ఫర్నిచర్ ఇతర సామగ్రికి నిప్పు అంటుకుంది. పొగలు పడక గదిలోకి వ్యాపించడంతో చిరంజీవి అప్రమత్తమై ఇరుగుపొరుగు వారి సహాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బందికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ. 6 లక్షల విలువైన ఫర్నిచర్, పెళ్లి సామగ్రి, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

సిటీ సివిల్ కోర్టులో బతుకమ్మ వేడుకలు



కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టు ఆవరణలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకలు సందడిగా సాగాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న మహిళా న్యాయమూర్తులు బతుకమ్మలకు పూజలు చేశారు. అనంతరం మహిళ న్యాయవాదులు సంప్రదాయ బతుకమ్మ నృత్యాలు చేశారు.



ఉజ్జయిని మహాకాళి ఆలయం వద్ద..

బన్సీలాల్‌పేట, రాణిగంజ్: సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహాకాళి ఆలయం వద్ద సోమవారం బతుకమ్మ వేడుకలు జరిగాయి. మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్ వేడుకలకు హాజరయ్యారు.



ఎల్లమ్మను దర్శించుకున్న ప్రిన్సిపల్ కార్యదర్శి



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట ఎల్లమ్మను రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి టి.కె. శ్రీదేవి సోమవారం రాత్రి దర్శించుకున్నారు. ఈఓ బి.కృష్ణ ఆమెకు ప్రసాదాలు అందజేశారు. భక్తులకు సోమవారం ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవారి అలంకరణకు మిఠాయిలు అందజేసిన దాత మధుసూదన్‌రావు ఈ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా అమ్మవారి అలంకారోత్సవాలు




భువనేశ్వరిదేవి అలంకారంలో కట్టమైసమ్మ మూలవిరాట్టు



సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో దుర్గామాత లలితాదేవి అలంకారం



గాయత్రిదేవి అలంకారంలో అమీర్‌పేట రాజరాజేశ్వరీ దేవి



అమీర్‌పేట కనకదుర్గా దేవి శ్రీలలితా త్రిపురసుందరి అలంకారం



శ్రీ గౌరీదేవి అలంకారంలో బేగంపేట శ్రీ భూలక్ష్మీ



వాల్మీకినగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



సికింద్రాబాద్ కుమ్మరిగూడ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మహాలక్ష్మీదేవిగా..

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక అలంకారోత్సవాలు కొనసాగుతున్నాయి. సనత్‌నగర్, అమీర్‌పేట, బేగంపేట డివిజన్లలోని ఆలయాల్లో అమ్మవారిని రోజుకో విధంగా అలంకరిస్తున్నారు.

– అమీర్‌పేట, కంటోన్మెంట్, రెజిమెంట్‌బజార్, న్యూస్‌టుడే

బంగారు మైసమ్మకు తలసాని విరాళం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లోని శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తనవంతుగా రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఛైర్మన్ గుర్రం పవన్ కుమార్‌గౌడ్‌కు అందజేశారు. సోమవారం ఆయన ఆలయంలో లలితాదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఢిల్లీ బాల్ రెడ్డి, కార్పొరేటర్ సామల హేమ, సభ్యులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన



పద్మారావునగర్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే తలసాని సోమవారం బన్సీలాల్‌పేట డివిజన్‌లోని గొల్ల కొమురయ్య కాలనీలోని మెయిన్ రోడ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. జయనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, ఆ అడ్డంకులను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉపకమిషనర్ సమ్మయ్యను ఆదేశించారు.

రోడ్ల బాగుకు వినతి



సనత్‌నగర్: గత ప్రభుత్వ హయాంలో రహదారుల నిర్మాణం కోసం రూ.86 లక్షలు మంజూరైనప్పటికీ ప్రస్తుతం పనులు జరగకపోవడంతో సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. సోమవారం కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు డా.మల్లు ప్రసాద్, రాజశేఖర్‌చందు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

బతుకమ్మ వేడుకలు 9న

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: భారాస అమీర్‌పేట డివిజన్ ఆధ్వర్యంలో ఈనెల 9న బుధవారం బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం వద్ద పెద్దఎత్తున బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి తెలిపారు. ఆకర్షణీయ బతుకమ్మలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో అమీర్‌పేట డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఎం.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

కుసుమ విజయకు పురస్కారం



సనత్‌నగర్, న్యూస్‌టుడే: శ్రీ మాతా సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ద్వారా విభిన్న సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్న సమితి వ్యవస్థాపకులు కుసుమ విజయకు విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ టాలెంట్ పురస్కారం ప్రదానం చేసింది.

దురంతో ఎక్స్‌ప్రెస్‌లో రూ.1.20 లక్షల నగదు బ్యాగు చోరీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో ప్రయాణికురాలి నగదు ఉన్న హ్యాండ్‌బ్యాగు చోరీకి గురైంది. బాధితురాలు జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొండాపూర్ శ్రీరామ్‌నగర్ కాలనీ వాసి శ్రీకాంత్ భార్య స్మృతిరావు పనిమీద ముంబయి వెళ్లిన ఆమె తిరిగి వచ్చేందుకు ఈనెల 5న లోకమాన్య తిలక్ టెర్మినల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో నగరానికి బయలుదేరింది. ప్రయాణంలో నిద్రపోయిన ఆమె 6న ఉదయం 7 గంటలకు రైలు షోలాపూర్ రైల్వేస్టేషన్ దాటినప్పుడు నిద్రలేచి చూసుకోగా హ్యాండ్ బ్యాగు కనిపించలేదు. అందులో రూ.1.20 లక్షల నగదు, డ్రైవింగ్ లైసెన్స్, క్రెడిట్, డెబిట్‌కార్డులున్నాయి. రైలు సికింద్రాబాద్ చేరుకున్న తరువాత జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును షోలాపూర్ పోలీసులకు బదిలీ చేశారు.

ఫతేనగర్ పైవంతెన విస్తరణకు గ్రహణం

నిధులు కేటాయించినా మొదలు కాని పనులు



సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఇరుకుగా, ప్రమాదాలకు నిలయంగా ఉన్న ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని విస్తరించే ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. బ్రిడ్జి విస్తరణకు గత ప్రభుత్వ హయాంలోనే నిధుల కేటాయింపు జరిపినప్పటికీ పనులు మాత్రం మొదలు కావడం లేదు. ఫతేనగర్-బల్కంపేట-సనత్‌నగర్‌ను కలుపుతూ ఆంగ్ల అక్షరం 'వై' ఆకారంలో నిర్మించిన ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి చాలా ఇరుకుగా ఉంటుంది. బ్రిడ్జిపై తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జిపై రహదారిని రెండుగా విభజిస్తూ గతంలో విభాగినులను ఏర్పాటు చేశారు. ఆ విభాగినులతో బ్రిడ్జి మరింత ఇరుకుగా మారింది. ఏదైన పెద్ద వాహనం బ్రిడ్జి ఈ వైపు నుంచి మరో వైపు దాటే వరకు వెనుక వచ్చే వాహనాలు బారులు తీరాల్సివస్తోంది. బల్కంపేట, సనత్‌నగర్ నుంచి బాలానగర్, జీడిమెట్ల వైపు వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఇరుకైన బ్రిడ్జి కారణంగా రోజూ ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ సమస్యలకు ప్రత్యామ్నాయంగా బ్రిడ్జిని విస్తరించేందుకు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచనల మేరకు 2020లోనే అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. రూ.45 కోట్లతో పనులను అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్ఆర్‌డీసీఎల్), రైల్వే శాఖ కలిసి బ్రిడ్జి విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉండగా రెండేళ్లు గడిచినా ప్రాజెక్టు దస్త్రాలను దాటి బయటకు రావడం లేదు.

నిధులు మంజూరైనా పనుల ఊసే లేదు

ఫతేనగర్ బ్రిడ్జి విస్తరణతోపాటు సనత్‌నగర్-బాలానగర్ అండర్ పాస్ రహదారి నిర్మాణం కోసం సుమారు రూ.110 కోట్లను గతంలో మంజూరు చేశారు. ఈ నిధుల నుంచే ఫతేనగర్ బ్రిడ్జిని విస్తరించాల్సి ఉంది. ప్రస్తుతం రెండు లేన్లతో ఉన్న ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఏమాత్రం నష్టం కలగకుండా విస్తరించేందుకు ప్రణాళికలు కూడా సిద్ధం చేశారు. ఫతేనగర్-సనత్‌నగర్-బల్కంపేటను మూడు వైపులా ఉండే ఈ బ్రిడ్జికి అదనంగా మరో రెండు లేన్లు విస్తరించాలనుకున్నారు. రైలు పట్టాలున్న ప్రాంతంలో నిర్వహించే పనులకు సంబంధించి రూ.36 లక్షలను గతంలో హెచ్ఆర్‌డీసీఎల్ అధికారులు రైల్వే శాఖకు చెల్లించినట్లు తెలిసింది. అయినప్పటికీ ఈ బ్రిడ్జి విస్తరణ జరగకపోవడం ఎన్నో సమస్యలకు కారణమవుతుంది.

పైన ఇరుకు, కింద ఆక్రమణలు

ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి ఇరుకుగా ఉండటంతో పైన వాహనాల రాకపోలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. బ్రిడ్జిపై ఏదైనా వాహనం ఆగితే దాన్ని తొలగించేవరకు మూడు వైపులా ట్రాఫిక్ స్తంభించిపోతుంది. గతంలో బ్రిడ్జిపై జరిగిన ప్రమాదాల్లో ఎందరో మృత్యువాత పడ్డారు. ఇక చిన్నా చితకా ప్రమాదాలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. మరోవైపు బ్రిడ్జి కింద మొత్తం సర్వీసు రోడ్లను ఆక్రమించేశారు. బ్రిడ్జి కింద రోడ్డును కూడా విస్తరించాల్సి ఉన్నప్పటికీ ఆ పనులు కూడా పూర్తికావడం లేదు. బ్రిడ్జి కింద ఖాళీ స్థలాన్ని, రోడ్డును డ్రమ్ములు, చెక్కలు, తుక్కు వ్యాపారులు ఆక్రయించారు. వాహనాలు, శిథిలమైన వాహనాలు నిలుపుతున్నారు. దీంతో సనత్‌నగర్ నుంచి బల్కంపేటకు బ్రిడ్జి కిందుగా రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. ఫతేనగర్ బ్రిడ్జిని విస్తరించడంతోపాటు కింద ఆక్రమణలు తొలగించి రహదార్లను పునరుద్ధరిస్తే తప్ప ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాలను నిలువరించే అవకాశం లేదు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

– రసూల్‌పురా, న్యూస్‌టుడే

? విద్యుత్ మీటర్ రీడింగ్‌ను కొన్నిసార్లు 5వ తేదీ తరువాత నమోదు చేస్తున్నారు. దీని వల్ల యూనిట్లు పెరిగి జీరో బిల్‌కు అర్హత కోల్పోతున్నాం.

– చెన్నమ్మ, కృష్ణానగర్.

* అధికారులతో మాట్లాడి సకాలంలో బిల్లులు ఇచ్చేలా చూస్తాం.

– శ్రీ గణేష్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే

ఘనంగా చండీహోమం



బౌద్ధనగర్, న్యూస్‌టుడే: బౌద్ధనగర్ డివిజన్‌లోని సంజయ్‌గాంధీనగర్‌లోని జై భవానీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి వద్ద మహాచండీ హోమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు



లాలాపేట, న్యూస్‌టుడే: తార్నాక చౌరస్తాలో సోమవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు హాజరయ్యారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: భాజపా ఆన్‌లైన్ సభ్యత్వ నమోదును సోమవారం ఎస్సార్‌నగర్ ఎస్ఎస్ బేకరీ వద్ద ప్రారంభించారు. భాజపా ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు డి.బిక్షపతి గౌడ్, అమీర్‌పేట డివిజన్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సీతాఫల్‌మండి డివిజన్‌లోని విశాల్ మార్ట్ ఎదురు బ్యాంక్ కాలనీ వద్ద సోమవారం భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు హాజరయ్యారు.



స్పా సెంటర్‌పై దాడులు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పా కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. ఎస్సార్‌నగర్ పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్సార్‌నగర్‌లోని స్వస్తిక్ ప్లాజా హిమాలయ బిల్డింగ్‌లో ఏఎస్ రూబీ ప్లాజా పేరిట అనిల్‌కుమార్ స్పా కేంద్రం నిర్వహిస్తున్నాడు. అది నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతుందని సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో స్పా కేంద్రంలో ఓ కస్టమర్‌తోపాటు నలుగురు మహిళా థెరపిస్టులున్నారు. ఎటువంటి అనుమతి లేకుండా, ట్రేడ్ లైసెన్సు, అగ్నిమాపక నిబంధనలు, సీసీ కెమెరాలు లేకుండా, రిజిస్టర్ నిర్వహించకుండా ఆథీకృత థెరపిస్టులు లేకుండా స్పా కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిర్వాహకుడు అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, తదుపరి విచారణ నిమిత్తం ఎస్సార్‌నగర్ పోలీసులకు కేసు బదిలీ చేశారు.

ఆకట్టుకున్న దాండియా



కార్ఖానా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో జయనగర్ కాలనీలో దాండియా, గర్బా నృత్యాల సందడి నెలకొంది.

లాలాపేట, న్యూస్‌టుడే: సిఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి హాల్లో నిర్వహించిన దాండియా నైట్స్ ఆకట్టుకుంది. ఫౌండేషన్ ప్రతినిధి కృష్ణారెడ్డి ప్రారంభించారు.

నియామకాలు



సికింద్రాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సీతాఫల్‌మండికి చెందిన మల్లూరి అనిల్‌కుమార్ నియమితులయ్యారు.



అడ్డగుట్ట, న్యూస్‌టుడే: కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కమిటీలో సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన గంట రాజుసాగర్‌ను సికింద్రాబాద్ జిల్లాకు ఛైర్మన్‌గా నియమించారు.

బీఎస్పీ సికింద్రాబాద్ ఇన్‌ఛార్జిగా దొరపల్లి రమేష్



బంజారాహిల్స్ న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇంఛార్జిగా బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన దొరపల్లి రమేష్ నియమితులయ్యారు. నగరంలోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లాల సమీక్ష సమావేశంలో బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్.. రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

బోర్డు పరిధిలోని ఒప్పంద కార్మికులకు వేతనాలు చెల్లించాలి

విద్యానగర్, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు కార్మిక చట్టాల వెంటనే అమలు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, కంటోన్మెంట్ బోర్డ్ ఒప్పంద వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ శివం రోడ్డులోని కార్యాలయం ముందు సోమవారం నిర్వహించిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డ్ సబ్ ఏరియాలో పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు రెండు నెలలుగా వేతనాలను చెల్లించడం లేదని విమర్శించారు. బోనస్ యాక్ట్ 1965 ప్రకారం దసరా పండగకు నెల బోనస్ వేతనం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అధికారులు స్పందించి ప్రతీ నెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాస్‌కు సమర్పించారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

పోలీసుల అదుపులో యువకుడు



యువకుడిని ప్రశ్నిస్తున్న గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని వందేభారత్ రైలులో బాంబు ఉందంటూ వచ్చిన ఫోన్‌కాల్ పోలీసులను ఉరుకులు పెట్టించింది. తనిఖీల అనంతరం ఇదంతా బూటకమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. గోదావరిఖనికి చెందిన మధుసూదన్(26) నగరంలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొండాపూర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వందేభారత్‌లో బాంబు ఉందంటూ డయల్ 100కు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు ఫోన్‌కాల్ ఆధారంగా యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్ అతడి నుంచి వివరాలు సేకరించారు. తాను ఐటీ కంపెనీలో పనిచేస్తున్నానని, తన ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఎవరో హ్యాక్ చేశారని వివరించాడు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మాట్లాడుకున్న మాటలు విని రైల్లో బాంబు పెట్టారనే భయంతో ఫోన్ చేశానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దీంతో పోలీసులు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవటం వల్లనే ఫోన్‌కాల్ చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



కంటోన్మెంట్, న్యూస్‌టుడే: న్యూబోయిన్‌పల్లిలోని సెంటర్ పాయింట్ చౌరస్తా నుంచి మారేడుపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే ప్రధాన రహదారిలోని ఫుట్‌పాత్ ఆక్రమణలను బోర్డు అధికారులు సోమవారం తొలగించారు. దుకాణదారులు ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకొని వ్యాపారాలతోపాటు వాహనాలను అక్కడే పార్కింగ్ చేస్తుండడంతో తలెత్తుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తొలగించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశుతోష్‌చౌహాన్ తెలిపారు.

అతివేగంగా వచ్చిన కారు హల్‌చల్



లాలాపేట, న్యూస్‌టుడే: తార్నాక వీధినెం.1లో అతివేగంగా వచ్చిన ఓ కారు హల్‌చల్ చేసింది. సోమవారం సాయంత్రం మారుతీ కారు (టీఎస్ 08 ఈపీ 3083) అతివేగంగా వచ్చింది. అదుపు తప్పి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ సెక్యూరిటీ గార్డును, చెట్టును ఢీకొట్టింది. అయినా నియంత్రణ కాలేదు. ఐఐసీటీ ప్రహరీని ఢీకొట్టి ఆగిపోయింది. గాయపడిన వ్యక్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ పారిపోయాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కారు నంబర్ ఆధారంగా డ్రైవర్ వివరాలను సేకరిస్తున్నారు.

బస్తీల్లో అపారిశుద్ధ్యం



రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: బస్తీల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో స్థానిక బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు వర్షాలు, ఇటు చెత్తచెదారం తొలగించకపోతుండటంతో ప్రాంతాలు దుర్గంధభరితంగా మారాయి. జనం విషజ్వరాలబారిన పడుతున్నారు. రెజిమెంటల్‌బజార్‌లోని 7వ వీధిలోని మెదక్ డయోసిస్ వద్ద వారం రోజులుగా చెత్త కుప్పలు పేరుకుపోయాయి.

అంధకారంలో కాలనీలు, ప్రధాన రహదారులు



బీకేగూడలో..

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: వీధి దీపాల నిర్వహణ ఇటీవల మరీ అధ్వానంగా మారింది. ఏ ప్రాంతంలో చూసినా వెలగడం లేదు. దీంతో కాలనీలు, ప్రధాన రహదారులు అంధకారంగా మారుతున్నాయి. ఎస్సార్‌నగర్, బల్కంపేట, బీకేగూడ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు చీకటిలో మగ్గుతున్నాయి. బీకేగూడ వార్డు కార్యాలయం నుంచి నల్లపోచమ్మ దేవాలయం, ఇటువైపు బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం వరకు ప్రధాన రహదారిపై అంధకారం అలముకుంది. ఎస్సార్‌నగర్ గ్రంథాలయం పరిసర ప్రాంతాల్లో అయితే మరీ దారుణంగా మారింది. శ్రీరామ్‌నగర్, 60 అడుగుల ప్రధాన రహదారిలోనూ ఇదే పరిస్థితి. కొన్ని ప్రాంతాల్లో పట్టపగలూ వెలుగుతున్నాయి. ఆరితే వెలగవు.. వెలిగితే ఆరవు.. చందంగా వీధిదీపాల నిర్వహణ తయారైంది. సాయంత్రం చీకటి పడగానే వేయాల్సిన వీధి దీపాలు ఏడెనిమిది గంటల వరకు ఆన్ చేయడం లేదు.

మల్కాజిగిరి

చంద్రబాబుకు ఆహ్వానం



గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఈనెల 27న జరగనున్న తన కుమార్తె శ్రేయారెడ్డి వివాహానికి హాజరు కావాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డితో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

భాజపా సభ్యత్వ నమోదు

గౌతంనగర్, న్యూస్‌టుడే: భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం గౌతంనగర్ డివిజన్ సాయినగర్‌లో ఇంటింటికి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. 400 మంది సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తేజ, బాలసుబ్రమణ్యం, గణ, ప్రకాష్, నర్సింహ పాల్గొన్నారు.

మురుగు నీటితో ఇబ్బందులు

మౌలాలి, న్యూస్‌టుడే: మౌలాలి డివిజన్‌లోని ఆండాల్ నగర్ సాయిగార్డెన్‌లోని ప్రధాన రహదారిపై వర్షం పడినప్పుడల్లా మురుగు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు కాలనీలోని పలు సమస్యలను ఫిర్యాదులో ప్రస్తావించారు. కాలనీ ప్రతినిధులు ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్, పుష్ప, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

ఈనాడు కథనానికి స్పందన

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి శైలిగార్డెన్‌లో పలు వీధి దీపాలు వెలగడం లేదు. ఈ విషయాన్ని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం అందించారు. సమస్యను వీధి దీపాల నిర్వహణ అధికారి వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన లైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు ఆపాలి


నిరసన ప్రదర్శనలో వామపక్ష పార్టీల నేతలు

మల్కాజిగిరి: పాలస్తీనాలోని గాజా పట్టణంపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఎందరో అమాయక ప్రజలు మృతి చెందుతున్నారని.. వెంటనే దాడులను నిలిపివేయాలని సీపీఐ, సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మల్కాజిగిరి చౌరస్తాలో యుద్ధానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి కృపాసాగర్ అధ్యక్షత వహించారు. నేతలు కొమటి రవి, బాలమల్లేశ్, కృష్ణమూర్తి, యాదయ్య, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

● ఏడు నెలల క్రితం ప్రారంభం ● గుంతల రహదారులతో స్థానికులు సతమతం

గౌతంనగర్, న్యూస్‌టుడే: వరద, మురుగు నీరు సమస్య నివారణకు గౌతంనగర్ డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్‌లో సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో బాక్స్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సంబంధించిన టెండరు ప్రక్రియ పూర్తయి పనులను గుత్తేదారుకు అప్పగించారు. రైల్వేస్టేషన్ ఎదురు మార్గంలో బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి చేసిన గుత్తేదారు రోడ్డు నిర్మాణ పనులను విస్మరించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తోంది. గుంతలమయమైన రోడ్లతో పాటు మ్యాన్‌హోళ్లు కుంగి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పని వివరం: బాక్సు డ్రెయిన్
అంచనా వ్యయం: రూ.40లక్షలు
డ్రెయిన్ పొడవు: 180 మీటర్లు
లోతు: 5 అడుగులు
ప్రారంభం: 7నెలల క్రితం
చేయాల్సిన సమయం: రెండు నెలలు
ప్రస్తుత పరిస్థితి: నిలిచిన పనులు

ఇళ్లల్లోకి వరద నీరు.. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ వాసులు ఏటా వర్షాకాలం ఎగువ నుంచి వచ్చే వరద నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలోని మూడో వీధిలో సుమారు 180 మీటర్ల పొడవు, 5 అడుగుల లోతుతో బక్స్ డ్రెయిన్ నిర్మించేందుకు జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏడు నెలల క్రితం పనులు ప్రారంభించారు. గుత్తేదారు పనులు మూడు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంది. నిబంధనల మేరకు రూ.20 లక్షల పైబడిన పనులకు సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి విడతల వారీగా గుత్తేదారుకు నిధులు మంజూరవ్వాలి. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేశారు. దీంతో ఇళ్ల ముందు పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డుగా ఉండటంతో పాటు మ్యాన్‌హోళ్లు కుంగి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి.


మల్లికార్జున్‌నగర్‌లో అధ్వానంగా అంతర్గత రహదారి


ప్రమాదకరంగా మారిన రోడ్డు

రాత్రిళ్లు ఇబ్బందులు: -వెంకటయ్య, కాలనీ సంఘం అధ్యక్షులు



కాలనీలోని మూడో రోడ్డు పనులు సగంలోనే ఆపేశారు. ఏడో నంబరు వీధిలోనూ రోడ్డు పనులు పూర్తి చేయలేదు. రాత్రిళ్లు వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలి.

అధికారులకు నివేదించాం



-సునీతాయాదవ్, కార్పొరేటర్

గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగానే పనులు నిలిచి పోయాయి. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులకు కూడా సమస్యను నివేదించాం. అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, డిఫెన్స్ కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? మల్కాజిగిరి డివిజన్ పటేల్‌నగర్‌లో రహదారులను సక్రమంగా శుభ్రం చేయటం లేదు. చెత్తకుప్పలు తీయడం లేదు. – చక్రపాణి, స్థానికుడు

✓ మీ ప్రాంతంలో పారిశుద్ధ్య సమస్యను పరిశీలించి చెత్త తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, పర్యవేక్షకుడు, సర్కిల్ పారిశుద్ధ్య విభాగం



? గౌతంనగర్ డివిజన్ దయానంద్‌నగర్‌లో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి ఇళ్లముందు పడిలేశారు. అవి కుళ్లడంతో ఇబ్బందుల పడుతున్నాం. – అలివేలు మంగ, దయానంద్‌నగర్

✓ చెట్ల కొమ్మలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం. – ఉమ, ఏఈ, మిర్జాలగూడ విద్యుత్తు ఉపకేంద్రం

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి ఆఫీసర్స్‌కాలనీ, ఆర్.కె.పురంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రి వేళల్లో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. – నరేష్, ఆఫీసర్స్ కాలనీ

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. –మారుతి, వెటర్నరీ అధికారి

? వెంకటాపురంలోని కాలనీ రోడ్లు శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య కార్మికులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వకపోతే చెత్త తొలగించేందుకు నిరాకరిస్తున్నారు. – ప్రియదర్శిని, స్థానికురాలు

✓ కార్మికులకు ఎవరూ డబ్బులు ఇవ్వనవసరం లేదు. సంబంధిత కార్మికులపై చర్యలు తీసుకుంటా. – ప్రభాకర్, అధికారి, పారిశుద్ధ్యం

మంగళ చండికే.. బ్రహ్మాండ మండల నాయికే

అల్వాల్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: మల్కాజిగిరి నియోజకవర్గంలో నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా జరుగుతున్నాయి. పలు ఆలయాల్లో పెద్ద ఎత్తున సామూహిక కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. మహిళలు లలిత పారాయణం చేస్తున్నారు. మహాచండీ అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. టెంపుల్‌అల్వాల్‌లోని ఉమాచంద్రమౌళీశ్వర ఆలయంలో కమిటీ సభ్యుడు శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ★ కానాజిగూడలోని మరకత లక్ష్మీగణపతి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక ట్రస్టీ మొత్కూరు సత్యనారాయణ శాస్త్రీ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. ★ దీన్‌దయాల్‌నగర్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ★ సంతోష్‌నగర్‌లో కొలువుదీరిన అంబ, భవాని అమ్మవారు కామాక్షి అలంకరణలో పూజలందుకున్నారు.

వీనుల విందుగా భక్తి సంగీత విభావరి

గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా కూచిపూడి నృత్య భారతి అకాడమి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భక్తి సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. భాగ్యలక్ష్మి ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.


టెంపుల్‌అల్వాల్ ఉమాచంద్ర మౌళీశ్వర ఆలయంలో..


కానాజిగూడ మరకత లక్ష్మీగణపతి మందిరంలో..


వాణీనగర్ విజయవినాయక ఆలయంలో..


తూర్పుఆనంద్‌బాగ్ శిర్డీసాయి గుడిలో..


శృంగేరి శంకరమఠంలో..


ఇందిరానెహ్రూనగర్‌లో..


కచేరీ నిర్వహిస్తున్న భాగ్యలక్ష్మి


దీన్‌దయాల్ నగర్‌లోని మండపంలో..

ఉత్సాహంగా.. ఉల్లాసంగా బతుకమ్మ వేడుకలు



మల్కాజిగిరి, న్యూస్‌టుడే: తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ ప్రశాంత్‌నగర్‌లోని ఫాబెల్ గార్డెన్స్ హైస్కూల్‌లో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి.. పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. వారితో పాటు పలువురు ఉపాధ్యాయినిలు ఆడిపాడారు. పాఠశాల నిర్వాహకులు ఇందుమతి, వినూత్న, ప్రిన్సిపల్ వికసిత తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (సోమవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 63, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 21, క్యారెట్ 43, దొండ 45, ఆలు 39, ఉల్లి 37, సొర 17, పొట్ల 13, బీన్స్ 95, గోరుచిక్కుడు 35, చిక్కుడు 50, దోస 28, బీర 50, కాకర 38, చామగడ్డ 37, కీర 26, క్యాప్సికం 70, బీట్‌రూట్ 25, కందగడ్డ 55, చిలకడదుంప 35, మామిడి 115, మునగ 75, ముల్లంగి 7(ఒకటి).

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.63, వంగ 40, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 50, క్యాబేజీ 21, బీన్స్ 95, క్యారెట్ 43, దొండ 50, చిక్కుడు 50, క్యాప్సికం 70, ఆలు 37, కీర 25, దోస 28, చామగడ్డ 37, అరటి 11, బీటరూట్ 25, సొర 17, గోకర 35, చిలకడదుంప 36, మామిడి 115, మునగ 76.

రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర


ప్రజాసంఘాల నేతలతో సైకిల్ యాత్రికుడు

అల్వాల్, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోరుతూ కర్ణాటకలోని కోలార్ నుంచి ప్రారంభమైన సైకిల్‌యాత్ర సోమవారం అల్వాల్‌కు చేరుకొంది. ఈ సందర్భంగా యాత్రికుడు శ్రీనివాసులకు గద్దర్ కుమారుడు సూర్యకిరణ్ స్వాగతం పలికారు. అనంతరం గద్దర్ సమాధిని సందర్శించారు. నాగ్‌పూర్‌లోని అంబేడ్కర్ దీక్షభూమి వరకు యాత్ర కొనసాగుతుందని శ్రీనివాసులు తెలిపారు. గద్దర్ తనకు స్ఫూర్తిప్రదాత అన్నారు. అంబేడ్కర్‌నగర్‌లో స్థానిక ప్రజాసంఘాల నేతలు యాదగిరి, రాజయ్య, రాములు స్వాగతం పలికారు.

ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడ వెంకటేశ్వరస్వామి ఆలయ 31వ బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. సంపత్‌కుమార్, శ్రీధరాచార్యుల అర్చక బృందం ఆధ్వర్యంలో తొలి రోజు శ్రీవారికి అభిషేకం, అంకురార్పణ, రక్షాబంధం, వాస్తు హోమం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజావాణికి 139 అర్జీలు


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ఆమ్రపాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల విజ్ఞప్తులను కమిషనర్ స్వీకరించారు. జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 90 విజ్ఞప్తులు వచ్చాయని అందులో టౌన్ ప్లానింగ్ 22, హౌసింగ్ 59, ట్యాక్స్ విభాగం 5, ఐటీ సెక్షన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్, మూసాపేట డిప్యూటీ కమిషనర్‌లకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు.

మేడ్చల్ కలెక్టరేట్‌లో 60 ఫిర్యాదులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 60 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారి హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో భూసమస్యలు, ధరణి, ప్రభుత్వ భూముల కబ్జాలు, ఆక్రమణలపై 17 ఫిర్యాదులు వచ్చాయి. రోడ్లు, భవనాల శాఖకు 8, పంచాయతీ రాజ్‌శాఖకు 6, నీటి పారుదలశాఖకు 3 రాగా వివిధ మున్సిపాలిటీలకు సంబంధించి 5, కీసర ఆర్డీవో, శామీర్‌పేట, మేడ్చల్ తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి 6 ఫిర్యాదులు అందాయి.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

పోలీసుల అదుపులో యువకుడు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని వందేభారత్ రైలులో బాంబు ఉందంటూ వచ్చిన ఫోన్‌కాల్ పోలీసులను ఉరుకులు పెట్టించింది. తనిఖీల అనంతరం ఇదంతా బూటకమని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. గోదావరిఖనికి చెందిన మధుసూదన్(26) నగరంలోని ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. కొండాపూర్‌లో ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు వందేభారత్‌లో బాంబు ఉందంటూ డయల్ 100కు సమాచారమిచ్చాడు. అప్రమత్తమైన పోలీసులు ఫోన్‌కాల్ ఆధారంగా యువకుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తాను ఐటీ కంపెనీలో పనిచేస్తున్నానని, తన ఫోన్, ల్యాప్‌టాప్‌ను ఎవరో హ్యాక్ చేశారని వివరించాడు. పాకిస్తాన్ ఉగ్రవాదులు మాట్లాడుకున్న మాటలు విని రైల్లో బాంబు పెట్టారనే భయంతో ఫోన్ చేశానంటూ పొంతనలేని సమాధానాలు చెప్పాడు. పోలీసులు అతడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. అతని మానసిక పరిస్థితి సరిగా లేకపోవటం వల్లనే ఫోన్‌కాల్ చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్

ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్‌వ్యాప్తంగా మురుగు తొలగింపు పనులు జోరుగా సాగుతున్నాయి. అక్టోబరు 2వ తేదీ నుంచి 90 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ దిశగా అధికారులు కార్యాచరణ ముమ్మరం చేశారు. ఈ మేరకు సోమవారం ఎండీ అశోక్ రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించి ఈ పనులను పర్యవేక్షించారు.

సాయినామ ఏకాహం 12న

మల్కాజిగిరి: దత్తగురు బండారు ట్రస్టు మల్కాజిగిరి కమిటీ ఆధ్వర్యంలో విజయదశమిని పురస్కరించుకుని సాయినామ ఏకాహాన్ని ఏర్పాటు చేశారు. చాణుక్యపురిలోని సమతాగోపాల్ కళానిలయంలో 12వ తేదీ ఉదయం 7నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. వివిధ హారతి కార్యక్రమాలు ఉంటాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ఇస్త్రీ పెట్టె అంటుకుని మంటలు

మౌలాలి, న్యూస్‌టుడే: సాయినాథపురంలోని ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. పరిసర ప్రాంతాల వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సాయినాథపురంలోని వెంకటేశ్వరకాలనీలోని హెచ్ నెం. 17లో నివసించే మహర్షి.. ఎలక్ట్రిక్ ఐరన్ బాక్స్‌ను ఆన్‌చేసి మర్చిపోయాడు. దీంతో మంటలు చెలరేగాయి. మంచం, పుస్తకాలు దగ్ధమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

డీజే ఈవెంట్ నిర్వాహకులపై కేసు

ఉప్పల్: నిబంధనలకు విరుద్ధంగా ఓ ఈవెంట్‌లో డీజే వాడిన నిర్వాహకులపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉప్పల్‌లోని మున్సిపల్ మైదానంలో ఎం/ఎస్ ట్రైవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో దాండియా కార్యక్రమం నిర్వహించారు. ఈవెంట్ నిర్వాహకులైన దిలీప్‌కుమార్, జి.యశ్, పి.శివశంకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

సైబర్ మాయగాళ్లను పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: విదేశాల్లో ఉంటూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న మాయగాళ్లను పట్టుకునేందుకు నగర పోలీసులు సిద్ధమయ్యారు. కంబోడియా, థాయ్‌లాండ్, సింగపూర్ తదితర దేశాల్లో పాగా వేసిన కేటుగాళ్లు భారతదేశంలో దళారులను ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నారు. 18 మంది కీలక నిందితులను నగర సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. వీరిని పట్టుకునేందుకు లుకౌట్ నోటీసులు జారీచేశారు.

నేత్రపర్వం.. నృత్యాభినయం



మాదాపూర్: శిల్పారామంలో సోమవారం సాయంత్రం నాట్య గురువు లక్ష్మీశంకర్ శిష్య బృందం వినసొంపైన కీర్తనలకు అనుగుణంగా లయాత్మకంగా చేసిన కూచిపూడి నృత్యాంశాలు అందరినీ అలరించాయి. అర్చన మిశ్రా శిష్య బృందం చక్కటి నృత్యాభినయంతో కథక్ నృత్యాంశాలను ప్రదర్శించారు.

జల ప్రసాద కేంద్రాలు ప్రారంభం

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం సోమవారం దివిస్ లేబొరేటరీ ఆధ్వర్యంలో రూ.32 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జల ప్రసాదాలను ప్రారంభించారు. దివిస్ యాజమాన్యాన్ని ఆలయ ఛైర్మన్ టి.నాగలింగంశర్మ అభినందించారు.

ఇక్కడ ఇంకుడు గుంత ఉండేదట..!



నగరం కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో కురిసిన వర్షం భూమిలోకి ఇంకే పరిస్థితి కానరావడం లేదు. భూగర్భంలోకి నీటిని ఇంకించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ప్రస్తుతం నగరంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నా వర్షపు నీరు డ్రైనేజీ పాలవకుండా భూమిలోకి ఇంకించేందుకు బహిరంగ ప్రదేశాల్లో నిర్మించిన ఇంకుడు గుంతలు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని చిన్మయ్‌మార్గ్‌లో పిచ్చి మొక్కలు మొలిచి ఆనవాళ్లు కోల్పోయిన ఇంకుడు గుంత ఇలా దర్శనమిస్తోంది. – న్యూస్‌టుడే, గౌతంనగర్

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మౌలాలి: నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ, ఉద్యోగ అవకాశాలకు టెక్ మహీంద్రా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి నాగరాజు తెలిపారు. 4 నెలలు పాటు ఉచితంగా కంప్యూటర్ బేసిక్స్, ఎమ్మెస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టైపింగ్, సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇంటర్ చదివిన నిరుద్యోగ యువతి, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 91000 56583, 88855 12037 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



వైద్యురాలితో మాట్లాడుతున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, చికున్‌గన్యా తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ కోరారు. సోమవారం పటేల్‌నగర్ చౌరస్తాలోని బస్తీ దవాఖానాను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రక్తపోటు, మధుమేహం తదితర వాటికి సంబంధించిన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యురాలు అయేషా, సిబ్బంది పుష్పలత, శిల్పలకు సూచించారు. నేతలు ఆంజనేయులు, సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నుంచి నేతల బహిష్కరణ

నల్లకుంట, న్యూస్‌టుడే: సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు నేతలను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) నుంచి బహిష్కరిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ తెలిపారు. కొన్ని నెలలుగా సంఘానికి దూరంగా ఉంటున్న ఎస్.నాగేశ్వర్‌రావు, స్వాతి, సుమంత్‌లు నెల రోజుల క్రితం వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖ ద్వారా తెలిపారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో వారితో పలుమార్లు మాట్లాడి రాజీనామా ఉపసంహరించుకోవాలని కోరినా నిరాకరించారు. ఈ ముగ్గురు ఇటీవల సంఘం, పార్టీ కార్యాలయం పేరుతో పీడీఎస్‌యూ నిబంధనలకు విరుద్ధంగా చలామణి అవుతున్నారన్నారు. దీంతో రాష్ట్ర కమిటీ చర్చించి ముగ్గురిని అన్ని స్థాయిల బాధ్యతల నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి తమ సంఘానికి వీరికి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

మాతా విశాల్ జాగరణ్

గోల్నాక, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మాతా విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం రాత్రి నెహ్రూనగర్‌లో జరిగిన కార్యక్రమానికి కార్పొరేటర్ ఉమారాణి, భాజపా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. కృష్ణంరాజు, సంతోష్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

గోల్నాక మార్కెట్‌లో కూరగాయల ధరలు...

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (సోమవారం నాటివి... కిలో.రూ.ల్లో) టమాట 50, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 60, దొండ 40, దోసకాయ 30, కాకర 50, బీర 60, సోర 30, క్యాబేజి 35, క్యాప్సికం 50, బీన్స్ 70, చిక్కుడు 60, క్యారెట్ 45, బీట్‌రూట్ 40, ఉల్లిగడ్డ 40, పచ్చిమిర్చి 40, వెల్లుల్లి 350, అల్లం 80.

దొరకని రిజర్వేషన్... జనరల్ టిక్కెట్లకు డిమాండ్

కాచిగూడ రైల్వేస్టేషన్‌లో పెరిగిన రద్దీతో కౌంటర్ల పెంపు

కాచిగూడ, న్యూస్‌టుడే: నగరంలోని ప్రముఖ కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రిజర్వేషన్ దొరకకపోవడంతో జనరల్ టిక్కెట్లకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దసరా పండగకు నాలుగు నెలల ముందుగానే నగరవాసులు టిక్కెట్లను బుక్ చేసుకున్నారు. దీంతో అన్ని రైళ్లలో నిరీక్షణ జాబితానే దర్శనమిస్తోంది. ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితిలో జనరల్ టిక్కెట్లను తీసుకుని సొంతూళ్లకు పయనమవుతున్నారు. విద్యా సంస్థలకు ప్రభుత్వం పండగ సెలవులను ఇప్పటికే ప్రకటించడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది.

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కౌంటర్లు: రైల్వేస్టేషన్లో టిక్కెట్ కౌంటర్లు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2 నుంచి రాత్రి 10 గంటలు, తిరిగి రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు మూడు షిఫ్టులలో పనిచేస్తున్నాయి. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కౌంటర్ల సంఖ్యను పెంచారు.



ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ప్రయాణికులు

సాధారణ రోజుల్లో		
జనరల్ టిక్కెట్ల విక్రయం	:	9 వేలు
ప్రస్తుతం దసరా పండగకు	:	12 వేలు
రోజువారి టిక్కెట్ కౌంటర్లు	:	4
ప్రస్తుతం	:	6

ధర తక్కువగా ఉండడంతో.. మరుగుదొడ్లు, కేటరింగ్ వసతులు ఉండటంతో ప్రజలు రైలు ప్రయాణానికే ఇష్టపడుతున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ ట్రావెల్స్ ఛార్జీలతో పోల్చుకుంటే టిక్కెట్ ధర చాలా తక్కువగా ఉండటంతో పండగకు నగవాసులు రైలు ప్రయాణానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. టిక్కెట్ల రిజర్వేషన్ దొరకకున్నా జనరల్ బోగీలలో వెళ్లడానికి సమాయత్తమవుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, న్యూస్‌టుడే:

? అడిక్‌మెట్ డివిజన్ పరిధి వీఎస్టీ జంక్షన్ రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన ఇనుప గ్రిల్ రోడ్డు పక్కన వృథాగా పడి ఉంది. దీంతో వాహనదారుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

–జగదీశ్వర్‌రావు, పద్మకాలనీ

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –సన్ని, జీహెచ్ఎంసీ డీఈ

బీఎస్పీ సికింద్రాబాద్ ఇన్‌ఛార్జిగా దొరపల్లి రమేష్



బంజారాహిల్స్ న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఇన్‌ఛార్జిగా బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన దొరపల్లి రమేష్ నియమితులయ్యారు. నగరంలోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లాల సమీక్ష సమావేశంలో బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్.. రమేష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. రమేష్ మాట్లాడుతూ..బీఎస్పీ విధానాలను సమాజంలో ప్రచారం చేస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య సమావేశం 20న

నల్లకుంట, న్యూస్‌టుడే: విప్లవోద్యమాల్లో అమరులైన మహానేతల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 20న వరంగల్ జిల్లా నర్సంపేటలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు తెలిపారు. సోమవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో జరిగిన హైదరాబాద్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత యాభై ఏళ్లుగా కార్మిక, కర్షక, విద్యార్థి, రైతాంగ తదితర ఉద్యమాలకు మద్దతుగా సమాఖ్య ఆటపాటలతో గజ్జెకట్టి పోరాడుతూ వస్తోందని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో కొత్త రక్తంతో నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాల కమిటీ ఎన్నిక: అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ అధ్యక్షుడిగా ముషీరాబాద్‌కు చెందిన కొండల్, ప్రధాన కార్యదర్శిగా రాంనగర్‌కు చెందిన కోలా స్వప్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం విద్యానగర్ సీపీ భవన్‌లో జరిగిన ఆయా సమావేశంలో వీరి నియామకాన్ని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వేణు ప్రకటించారు.

ఉర్దూ మీడియం పోస్టులు భర్తీ చేయాలని ధర్నా

రాంనగర్, న్యూస్‌టుడే: ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులు పూర్తిగా భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు వద్ద నిరుద్యోగ యువతీ, యువకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను సవరిస్తూ 11,062 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అందులో ఉర్దూ మీడియం పోస్టులు 1183 ఉన్నాయని, ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో 550 మందికి మాత్రమే అపాయింట్‌మెంట్ లెటర్ వచ్చే అవకాశం ఉందని, బ్యాక్‌లాగ్‌లో 600కు పైగా పోస్టులు మిగిలిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో వేడుకలు రేపు

రాంనగర్, న్యూస్‌టుడే: బ్రహ్మకుమారీస్ చిక్కడపల్లి శాఖ ఆధ్వర్యంలో దేవీనవరాత్రుల మహోత్సవాన్ని ఈ నెల 9న త్యాగరాయ గానసభలో సాయంత్రం 6గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ఇన్‌ఛార్జి జయశ్రీ తెలిపారు. అందుకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం శాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. మహోత్సవంలో దేవీ రాత్రులు- ఆధ్యాత్మిక రహస్యం, నవరాత్రులకు నేటి సమాజానికి గల ఆధ్యాత్మిక సంబంధం గురించి వివరిస్తారని పేర్కొన్నారు. ప్రముఖులచే ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ సంబరాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మకుమారీ ప్రతినిధులు రశ్మిత, ప్రియాంక, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జయశ్రీ తదితరులు

అనూహ్యారెడ్డికి ప్రతిష్ఠాత్మక పురస్కారం



మైక్ రోలీ నుంచి పురస్కారాన్ని అందుకుంటూ..

కాచిగూడ: మహిళా వ్యాపారవేత్త అనూహ్య రెడ్డికి లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. అక్టోబరు 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు నిర్వహించిన 55వ అంతర్జాతీయ సదస్సులో ఆయా రంగాలకు చెందిన ప్రముఖులను సన్మానించారు. అందులో భాగంగా అనూహ్య రెడ్డికి మైక్ రోలీ చేతుల మీదుగా దిగ్గజ వ్యాపారవేత్త పురస్కారాన్ని ప్రదానం చేశారు.

కిలోన్నర గంజాయి స్వాధీనం

కాచిగూడ, న్యూస్‌టుడే: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న యువకుడిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్సై సుభాష్ కథనం ప్రకారం... కింగ్‌కోఠికి చెందిన సాలమ్‌బిన్ మహమ్మద్(27) సోమవారం కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద ఓవ్యక్తి నుంచి కిలోన్నర గంజాయిని తీసుకున్నాడు. బర్కత్‌పుర రాజేంద్రనగర్ కాలనీ నుంచి తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

కిషన్‌రెడ్డికి లేఖ రాసిన టీడీసీఏ అధ్యక్షుడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘానికి(టీడీసీఏ) సభ్యత్వం వచ్చేలా బీసీసీఐకి లేఖ రాసి మద్దతు ఇవ్వాలంటూ టీడీసీఏ అధ్యక్షుడు, మాజీ సాట్స్ ఛైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. దీనిపై ఆయన స్పందించి తెలంగాణ గ్రామీణ క్రీడాకారులకు కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చి వెంకటేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

హిందూ దేశం చేస్తే మిగతా మతస్తులు ఎక్కడికెళ్లాలి?: వీహెచ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారత్‌ను హిందూ దేశం చేయాలన్న విశ్వ హిందూ పరిషత్తు(వీహెచ్‌పీ) చీఫ్ మోహన్ భగవత్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు సమాధానం చెప్పాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్ సెక్యులర్ దేశం, స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఇక్కడ అనేక మతాల వారు ఉన్నారన్నారు. మోహన్ భగవత్ ఆలోచన సరికాదు, హిందూ దేశం చేస్తే ముస్లిం, సిక్కు, ఇతర మతస్తులు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. దేశాన్ని.. కులాలు, మతాల పేరిట విభజకండి. ఓట్ల రాజకీయం కోసం దేశాన్ని విభజిస్తారా? అని వీహెచ్ ప్రశ్నించారు.

అమ్మవారి దర్శనం.. ఉప్పొంగిన భక్తిభావం

బాగ్‌లింగంపల్లి, గోల్నాక, కాచిగూడ, అంబర్‌పేట, బర్కత్‌పుర, ముషీరాబాద్, న్యూస్‌టుడే: అంబర్‌పేట, ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు రోజుకొక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. చారిత్రక ముషీరాబాద్ మహంకాళి ఆలయంలోని అమ్మవారు అన్నపూర్ణ దేవీ, భోలక్‌పూర్ డివిజన్ దేవుని తోటలోని భవాని శంకరాలయంలోని అమ్మవారు మహాలక్ష్మిదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక లలిత సహస్రనామ కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లోని అమ్మవారి విగ్రహాలను సైతం భక్తులు, ప్రజాప్రతినిధులురాజకీయ ప్రముఖులు దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



జైస్వాల్‌గార్డెన్‌లో లలితాదేవి అలంకరణలో అమ్మవారు



జవహర్ నగర్ ప్రాంతంలో మాత అసోసియేషన్ ఆధ్వర్యంలో..



శంకరమఠంలో ఇంద్రాణి అలంకరణలో శారదాంబ




ముషీరాబాద్‌లో మాత విగ్రహం వద్ద..



బాపూజీనగర్‌లో అంజన్‌కుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌యాదవ్



భోలక్‌పూర్‌లో సెంట్రల్‌జోన్ అదనపు డీసీపీ ఆనంద్, భారాస నేత శ్రీనివాస్‌రావు తదితరులు



కాచిగూడలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ ఉమారాణి తదితరులు



బర్కత్‌పురలో అన్నం వడ్డిస్తున్న రాంబాబు



రెడ్డి కళాశాల ఎదురుగా రాజగోపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి



చిక్కడపల్లిలో తెదేపా నేతలు సాయిబాబా, బాల్‌రాజుగౌడ్

నకిలీ ధ్రువపత్రాల విక్రయం.. ఇద్దరి అరెస్ట్

అంబర్‌పేట: నకిలీ ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ధ్రువపత్రాలను తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరిని అంబర్‌పేట, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ అశోక్ కథనం ప్రకారం.. ఓవైసీనగర్‌కు చెందిన మహమ్మద్ మహఫూజ్ ఇక్బాల్(41), బేగంపేట ప్రకాష్‌నగర్‌కు చెందిన షేక్ ఇలియాస్ అహమ్మద్(34) రామంతాపూర్ రోడ్డులో జిరాక్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. రూ.8 వేలకు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లను విక్రయిస్తుండగా.. వారిని అదుపులోకి తీసుకుని 84 నకిలీ ధ్రువపత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

తిరుపతికి వెళ్తున్నానని చెప్పిన ఒకరి అదృశ్యం

నల్లకుంట, న్యూస్‌టుడే: తిరుపతికి వెళ్తున్నానని చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూనల్లకుంటలో నివాసముంటున్న వెంకటేశ్వర్లు(58) ఈ నెల 5న ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయనకు ఫోన్ చేయగా తిరుపతికి వెళ్తున్నానని చెప్పి ఫోన్ కట్ చేశాడు. భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంగళసూత్రం చోరీ

కాచిగూడ: నాలుగు తులాల మంగళసూత్రం చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం.. నెల్లూరుకు చెందిన ఫణికుమార్ తన భార్య వెంకట పద్మావతితో కలిసి ఆదివారం నాగర్‌సోల్ నుంచి అజంతా ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు వస్తున్నారు. రైలు ఉమ్రి స్టేషన్ వద్ద ఉండగా ఆమె మెడలోని నాలుగు తులాల మంగళసూత్రాన్ని ఆగంతుకుడు లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

మరో సంఘటనలో.. మహిళ మెడలోని గొలుసు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి కథనం ప్రకారం... నగరంలోని వెస్ట్‌మారెడుపల్లికి చెందిన అరుణ్ సెంగర్ తన భార్య సలోని చౌహాన్‌తో కలిసి ఆదివారం ఉజ్జయిని నుంచి కాచిగూడకు జైపూర్-కర్నూల్ రైలులో వస్తున్నారు. రైలు ఉమ్రి స్టేషన్ వద్దకు రాగానే ఆమె మెడలోని 7 గ్రాముల బంగారు గొలుసును ఆగంతుకుడు లాక్కుని పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణకు నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

'అమెరికా అండతోనే ఇజ్రాయెల్ దాడులు'



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

రాంనగర్, న్యూస్‌టుడే: అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయెల్ చేస్తున్న దుర్మార్గాలు ప్రపంచ మానవాళికి వినాశనంగా మారిందని పలువురు వామపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న దారుణ హత్యాకాండకు ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీఎస్ బోస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావులు హాజరై మాట్లాడారు.

ఆర్య వైశ్యులు రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలి



నూతన కమిటీ సభ్యులను సత్కరిస్తున్న నీలా శ్రీధర్

రాంనగర్, న్యూస్‌టుడే: ఆర్య వైశ్యులు సామాజిక, రాజకీయ రంగాల్లో ముందుండాలని అంతర్జాతీయ వైశ్య సమాఖ్య తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడు, వాసవి ఆర్ట్ థియేటర్ అధ్యక్షుడు డా.నీలా శ్రీధర్ పిలుపునిచ్చారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సంఘం కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి రమేశ్, కోశాధికారి రవీందర్, ఉపాధ్యక్షుడు రమేశ్‌తో పాటు కమిటి సభ్యులను శ్రీధర్ సత్కరించి మాట్లాడారు. వైశ్యులు సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి ఉపయోగిస్తారని, అన్ని సేవా రంగాల్లో ముందుంటారని కొనియాడారు. వైశ్యసంఘం సభ్యులు రాజశేఖర్, కేవీకేప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బోర్డు పరిధిలోని ఒప్పంద కార్మికులకు వేతనాలు చెల్లించండి

విద్యానగర్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పని చేస్తున్న ఒప్పంద కార్మికులకు కార్మిక చట్టాల వెంటనే అమలు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ, కంటోన్మెంట్ బోర్డ్ కాంట్రాక్ట్ వర్క్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. శివం రోడ్డులోని కార్యాలయం ముందు సోమవారం నిర్వహించిన ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డ్ సబ్ ఏరియాలో పని చేస్తున్న కంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలను చెల్లించడం లేదని విమర్శించారు. బోనస్ యాక్ట్ 1965 ప్రకారం దసరా పండగకు నెల బోనస్ వేతనం ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అధికారులు స్పందించి ప్రతి నెల వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని హైదరాబాద్ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాస్‌కు సమర్పించారు. నేతలు కిషన్‌తో పలువురు కార్మికులు ధర్నాలో పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్



విద్యానగర్, న్యూస్‌టుడే: సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండగ సంబరాల్లో యువతను భాగస్వాములు చేద్దామని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మ కోరారు. సోమవారం నందనవనం కాలనీ, శ్రీనివాస్ కాలనీలో ఆమె బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ లయబద్ధంగా అడుగులో అడులేస్తూ ఆడిపాడారు. పలువురు స్థానిక మహిళలకు వేడుకల్లో పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని నిరసన

రాంనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి కరుమలయన్ డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్(టీఎంఎస్ఆర్‌యూ) ఆధ్వర్యంలో మెడికల్ రిప్రజెంటేటీవ్‌ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని రాష్ట్ర కార్మిక కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. టీఎంఎస్ఆర్‌యూ సంయుక్త ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'సగరులను బీసీ-ఏ గ్రూపులోకి మార్చాలి'

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: సగర(ఉప్పర) సామాజిక వర్గాన్ని బీసీ-బీ గ్రూపు నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో సగర సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రతిభగల విద్యార్థులకు అభినందన సభ జరిగింది. పది నుంచి పీజీ వరకు ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటికి సగర జాతిలో ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ పదవికి నోచుకోలేదన్నారు. ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ రాజయ్య మాట్లాడుతూ.. సగరుల న్యాయమైన డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సగరులు ఐక్యమై రాజ్యాధికారం సాధించాలని పేర్కొన్నారు. మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ.. విద్యార్థులు గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. సగర సంఘం ఆత్మగౌరవ భవనం ట్రస్ట్ ఛైర్మన్ మారుతీ సగర, రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్‌సగర, కుమారస్వామి, హరికిషన్‌సగర, స్రవంతి, నగర అధ్యక్షుడు రవిసగర తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న మారుతీ సగర, హరికిషన్ సగర, వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు

స్కూల్ అసిస్టెంట్ పోస్టులు బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

నల్లకుంట: ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేవలం బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతుల ద్వారా 70 శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. బీఈడీ నిరుద్యోగ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీఈడీ అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్‌తో డీఎడ్ పూర్తి చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులు ప్రాథమిక పరిజ్ఞానం మాత్రమే ఉంటోందనే విషయాన్ని ప్రభుత్వం గమనించాలన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగనుందని ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం 26 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వం కేవలం 11 వేలకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే విద్యాశాఖను ప్రక్షాళన చేసి ఆ శాఖకు మంత్రిని కేటాయించాలన్నారు. తెలంగాణ నిరుద్యోగ ఐకాస ఛైర్మన్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ప్రజావాణికి 139 అర్జీలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జీహెచ్ఎంసీ ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 90 విజ్ఞప్తులు వచ్చాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 49 అర్జీలు వచ్చాయని జీహెచ్ఎంసీ పేర్కొంది. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పద్మావతి, సత్యనారాయణ, యాదగిరిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉప్పల్

● ఉప్పల్ ● మేడ్చల్

ఆది పరాశక్తి.. పాహిమాం..!


ఎన్ఎఫ్‌సీనగర్


గట్టు మైసమ్మ


కీసరగుట్టలో


ప్రజాసాయిగార్డెన్‌లో


అన్నోజిగూడ


శంకరకాలనీలో..


శ్రీలలిత గౌరి నిమిషాంబికాదేవి


పర్వతాపూర్


మేడ్చల్‌లో ..


చక్రీపురం కాలనీలో


తూంకుంట


లక్ష్మాపూర్


శ్రీనగర్ కాలనీ


రాఘవేంద్రనగర్


నాచారం మహంకాళి ఆలయంలో


గోఖలేనగర్


హబ్సిగూడలో..


న్యూగోఖలేనగర్..


రామంతాపూర్..


నాగారం ఎస్వీనగర్‌లో

జల ప్రసాద కేంద్రాలు ప్రారంభం


కీసరగుట్టలో ప్రారంభిస్తున్న ప్రతినిధులు

కీసర, న్యూస్‌టుడే: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం సోమవారం దివిస్ లేబరేటరీ ఆధ్వర్యంలో రూ.32 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జల ప్రసాదాలను ప్రారంభించారు. ఆలయానికి ఎదురుగా రెండు చోట్ల జల ప్రసాద కేంద్రాలను ఏర్పాటు చేసిన దివిస్ లేబరేటరీ యాజమాన్యాన్ని ఆలయ ఛైర్మన్ టి.నాగలింగంశర్మ, కార్యనిర్వహణాధికారి కె.సుధాకర్‌రెడ్డి అభినందించారు. అనంతరం ఆలయం ముందు మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ సహకారంతో జమ్మి మొక్కను నాటారు. మాజీ సర్పంచి మాధురి, దివిస్ ప్రతినిధులు, కిషోర్‌కుమార్, శ్రీనివాసులు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భలే చౌక బియ్యం బేరం..!

? 'తీసుకుంటావా అన్నా?' -కార్డుదారు
'కొద్దిగా ఆగు' -డీలర్
? 'ఎట్ల తీసుకుంటావు'? -కార్డుదారు
'కిలో రూ.10' -డీలర్
? 'రూ.12లాగా తీసుకోవా'? -కార్డుదారు
'ఆ రేటుకైతే ఇవ్వు అంత కన్నా ఎక్కువంటే ఎక్కడైనా అమ్ముకో' -డీలర్

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే



● నిఘా కొరవడి..దందా చొరబడి
● కార్డుదారుల నుంచి కొంటున్న కొంతమంది డీలర్లు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేషన్ బియ్యం విక్రయానికి సంబంధించిన చౌకధరల దుకాణాల వద్ద కొందరు లబ్ధిదారులు, డీలరు మధ్య ప్రతి నెల జరిగే బేరమిది. ఈ దందా వెనక భారీ ముఠానే ఉంది. రాష్ట్రంలోనే కాకుండా.. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటకలకు బియ్యం తరలిపోతున్నాయి.

ఘట్‌కేసర్, పోచారం, రామంతాపూర్, చిలుకానగర్, ఉప్పల్, నాగారం, దమ్మాయిగూడ, నాచారం, హబ్సిగూడ, కాప్రా, మేడ్చల్, కీసర, శామీర్‌పేట,ఏఎస్‌రావునగర్,తదితర ప్రాంతాల్లోని పలు చౌకధర దుకాణాల్లో డీలర్లు లబ్ధిదారుల నుంచి యథేచ్ఛ బియ్యం కొనుగోలు చేస్తున్నారు. గతంలో రేషన్ బియ్యం అవసరంలేని లబ్ధిదారులు దుకాణంలో తీసుకుని బయట వ్యాపారులకు అమ్మేవారు వారు రైసుమిల్లర్లకు అధిక ధరకు విక్రయించేవారు. తాజాగా కొందరు డీలర్లు రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు కొత్త విధానానికి తెర లేపారు. కార్డుదారుల నుంచే నేరుగా కొనుగోలు చేస్తున్నారు. బయట వ్యాపారులకు విక్రయించడం కంటే డీలరుకే విక్రయిస్తే శ్రమ తగ్గుతుందని లబ్ధిదారులు భావిస్తున్నారు.

ముద్ర వేయించుకుని..: రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం కార్డులోని సభ్యుల వేలిముద్రల అనుసంధానాన్ని ప్రవేశపెట్టింది. కార్డులోని సభ్యుల్లో ఒకరు వచ్చి వేలిముద్ర వేసినా సరకులు ఇస్తున్నారు. అలా బియ్యం కోసం వచ్చిన వారి నుంచి వేలిముద్రలు తీసుకోగానే ఎన్ని కిలోల బియ్యం తీసుకున్నదీ చీటి వస్తుంది. ఆ చీటిని పెట్టుకుని కార్డుదారుకు కిలో రూ.10 చొప్పున చెల్లిస్తున్నారు. డీలరు అదే బియ్యాన్ని రైసుమిల్లర్లకు కిలో రూ.12 నుంచి రూ.14 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన రైసుమిల్లర్లు పాలిష్ చేసి తమకు కేటాయించిన సీఎంఆర్ స్థానంలో భారత ఆహార సంస్థతో పాటు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

ఇదీ ఉదాహరణ ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన సంఘటననే ఉదాహరణ.. ఒషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి సుమారు 4టన్నుల బియ్యం పట్టుకున్నారు. తొమ్మిది మందిని అరెస్టు చేశారు.

కేసులు నమోదు చేస్తాం: జిల్లాలోని రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులతో దాడులు చేయిస్తాం.. అక్రమాలకు పాల్పడిన డీలర్లను పట్టుకుని కేసు నమోదు చేసి డీలర్ షిప్‌ను రద్దు చేసేలా చూస్తాం.
–సరిత, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రేషన్‌కార్డుల వివరాలు

మండలం	దుకాణాలు	ఆహార భద్రత కార్డులు	అంత్యోదయ	అన్నపూర్ణ
ఘట్‌కేసర్	28	18276	5	1096
మేడిపల్లి	9	17769	2	416
మేడ్చల్	37	19222	77	2361
శామీర్‌పేట	24	14470	0	2199
కీసర	24	17818	0	1499
కాప్రా	16	13888	0	817
ఉప్పల్ సర్కిల్	240	178001	4	3284


భూమిపూజలో మేయర్, ఇతరులు

అభివృద్ధి పనులు షురూ

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: జవహర్‌నగర్ 18వ డివిజన్‌లో అంతర్గత మురుగు కాలువ పనులను మేయర్ దొంతగాని శాంతి ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 10 లక్షలతో 210 మీటర్ల అంతర్గత మురుగు కాలువ నిర్మించనున్నట్లు తెలిపారు.

ఎర్రపోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


పూజలో పాల్గొన్న ఈటల, బేతి సుభాష్‌రెడ్డి, హంసారాణి తదితరులు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో కౌన్సిలర్ హంసారాణి ఆధ్వర్యంలో ఎర్రపోచమ్మతల్లి విగ్రహప్రతిష్ఠాపన సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్‌మాజీ శాసనసభ్యుడు బేతి సుభాష్‌రెడ్డి, భాజపా అధ్యక్షుడు విక్రంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీజే ఈవెంట్ నిర్వాహకులపై కేసు

ఉప్పల్: నిబంధనలకు విరుద్ధంగా ఓ ఈవెంట్‌లో డీజే వాడిన నిర్వాహకులపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్‌లోని మున్సిపల్ మైదానంలో ఎం/ఎస్ డ్రైవ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో దాండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా డీజే వాడటంతో పెద్ద శబ్దాలు బయటకు వచ్చాయి. దీంతో ఈవెంట్ నిర్వాహకులైన దిలీప్‌కుమార్, జి.యశ్, పి.శివశంకర్‌రెడ్డిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఇంటి నుంచి వెళ్లిపోయి..

మేడిపల్లి(బోడుప్పల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండాపోయాడు. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చెంగిచర్ల రోడ్‌లో నివాసం ఉండే ప్రభాత్ రాజ్ జోనావార్ (55) ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని కోసం వెదికినా ప్రయోజనం లేకపోయింది. మేడిపల్లి పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్రాఫిక్ సమస్యపై పరిశీలన

ఉప్పల్: ఉప్పల్ రింగురోడ్డులో ట్రాఫిక్ సమస్యపై వివిధ విభాగాల అధికారులు సోమవారం పరిశీలన చేశారు. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చేపట్టాల్సిన చర్యలను అధికారులు చర్చించారు. జోనల్ కమిషనర్ హేమంత్‌కుమార్ పాటిల్, హెచ్ఎండీఏ ఎండీ జీవన్‌బాబు, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏకరూపం.. అపురూపం



బతుకమ్మ పండగ వచ్చిందంటే మహిళల అలంకరణకు చాలా ప్రాధాన్యం ఇస్తారు. తమ ఆభరణాలు, ఆడంబరాలను కొంత మంది మహిళలు ప్రదర్శిస్తారు. ఈ ఏడాది చాలా కాలనీల్లో మహిళలు ఏకరూప చీరలను ధరించి బతుకమ్మ సంబరాల్లో పాల్గొంటున్నారు. ఒకే రంగు, ఒకే ధరతో ఆ కాలనీ మహిళలు సంబరాలు చేసుకోవడం అబ్బుర పరుస్తోంది. – న్యూస్‌టుడే, ఘట్‌కేసర్


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సమస్యలను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులతోనే కాలనీల్లో సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిలుకానగర్ డివిజన్‌లో రూ.52 లక్షలతో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీతాముదిరాజ్ ప్రారంభించారు.

కనుల పండువగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ గోఖలే నగర్‌లో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. సోమవారం శ్రీపుష్పయాగంలో స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. ఆలయఛైర్మన్ హరీశ్, కార్పొరేటర్ చేతన దంపతులు పాల్గొన్నారు.


శ్రీపుష్పయాగంలో స్వామివారు

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: ఏఎస్‌రావునగర్, ఘట్‌కేసర్, నాగారం, కాప్రా

? రాధిక రోడ్డు నుంచి ఓల్డ్ కాప్రాకు పోయే రోడ్డు గుంతలతో అస్తవ్యస్తంగా తయారైంది.
- శ్రీనివాసచారి, హైటెక్ కాలనీవాసి

✓ పరిశీలించి రోడ్డుకు మరమ్మతులు చేపడుతాం **- కాప్రా సర్కిల్ డీఈ బాలకృష్ణ**

? అన్నోజిగూడ లోని సర్వీసు రోడ్డుపై రాత్రి వేళ వాహనాలు పార్కింగ్ చేయడంతో రాకపోకలకు ఇబ్బంది ఉంటోంది.
- సుదర్శన్, అన్నోజిగూడ

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – పరుశరాము, ట్రాఫిక్ సీఐ, ఘట్‌కేసర్

? నాగారం ప్రధాన రహదారిపై ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు.
- రామకృష్ణ , సత్యనారాయణ కాలనీ, నాగారం

✓ ట్రాఫిక్ పోలీసులకు చెప్పి సమస్య పరిష్కారం చేయిస్తా **- వెంకటయ్య, సీఐ కీసర**

? ప్రశాంత్ నగర్‌లో కొన్ని రోజులుగా పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి.
- రమణ, ప్రశాంత్ నగర్

✓ టైమర్లలో లోపాలున్నాయి. బాగుచేసి దీపాలు అర్పివేస్తాం.
– రవీంద్ర, డీఈ, జీహెచ్ఎంసీ

త్వరితగతిన దరఖాస్తుల పరిశీలన

జిల్లా ప్రజావాణికి 60 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 60 ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రెవెన్యూ అధికారిణి హరిప్రియ, లాఆఫీసర్ చంద్రావతితో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల్లో భూసమస్యలు, ధరణి, ప్రభుత్వ భూముల కబ్జాలు, ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చాయి.

రేషన్ బియ్యం రావడం లేదు:

– కొల్లాల అశోక్–సంతోష దంపతులు, అన్నోజిగూడ, దివ్యాంగుల కాలనీ, ఘట్‌కేసర్



భార్యాభర్తలం దివ్యాంగులమే. ప్రభుత్వం పింఛన్ ఇస్తుంది. వచ్చే పింఛన్ ఇంటి అద్దెకే సరిపోతోంది. రేషన్ కార్డు లేక ఉచిత బియ్యాన్ని పొందలేకపోతున్నాం. రెండు పూటల తినేందుకు ఇబ్బంది కలుగుతుంది. కలెక్టరేట్ కీసరలో ఉన్నప్పటి నుంచి శామీర్‌పేటకు వచ్చే తిరుగుతూనే ఉన్నాం.. అధికారులు చర్యలు తీసుకుని రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతున్నాం.

కబ్జాలో మూడు అంతర్గత రహదారులు

– చీదు వీరభద్రారెడ్డి, రాఘవేంద్రనగర్ కాలనీ, మేడ్చల్



జాతీయ రహదారి 44 నుంచి 17 కాలనీలకు, 5 పాఠశాలలకు, ఓ కంపెనీకి అనుకూలంగా 4 రహదారులు ఉన్నాయి. వాటిలో మూడింటిని ఓ వెంచర్ వారు కబ్జా చేశారు. కోర్టు ముందు నుంచి ఉన్న ఒక్క రోడ్డులో అన్ని కాలనీల ప్రజలు, పాఠశాలల వెళ్లే వాహనాలు, విద్యార్థులు, ప్రజలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మున్సిపాలిటీలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం లభించడం లేదు.

ఏడేళ్లుగా తిరుగుతున్నా:

– మొక్క ఉపేందర్, దివ్యాంగుడు, అన్నోజిగూడ, దివ్యాంగుల కాలనీ, ఘట్‌కేసర్



నా పిల్లల పేర్లు రేషన్ కార్డులో నమోదు చేయాలని మీసేవా, జిల్లా ప్రజావాణి ఇలా అన్ని చోట్లకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ వెళ్లి ఏడేళ్లుగా ఫిర్యాదు చేస్తున్నా, ఇప్పటి వరకు పరిష్కారం లభించలేదు. ఈసారి మా కుటుంబంతో వచ్చి ప్రజావాణిలో ఆర్జీ పెట్టుకున్నాం.

ఆనకట్టకు మరమ్మతు చేయించాలి..

– సంగిశెట్టి ఆంజనేయులు, ఉద్దెమర్రి గ్రామ ఆదర్శ రైతు సంఘం, మూడుచింతలపల్లి మండలం



శామీర్‌పేట పెద్ద చెరువు వాగు ఉద్దెమర్రి గ్రామం వద్ద 20ఏళ్ల క్రితం నిర్మించిన ఆనకట్టకు మరమ్మతులు లేక నీరు వృథా అవుతోంది. మరమ్మతులు చేస్తే పొలాలకు సాగు నీరు, భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఇతరులు

నాచారం, న్యూస్‌టుడే: సాంకేతిక రంగంలో నైపుణ్యం కలిగిన యువత టీ-హబ్ సహకారాన్ని అందిపుచ్చుకుని పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని తెలంగాణ ప్రభుత్వ ఐటీ-పరిశ్రమల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ (వర్చువల్) తెలిపారు. సోమవారం నాచారం పారిశ్రామికవాడలోని ఇండస్ట్రీస్ అసోసియేషన్ భవన్‌లో ఐలా అసోసియేషన్-టీ-హబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఎంఎస్ఎంఈ స్టార్టప్ సినర్జీ సమ్మిట్‌లో జయేష్ రంజన్ వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. టీ-హబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు, ఏఐసీ-టీ-హబ్ సీఈఓ రాజేష్ అడ్లా వర్చువల్‌గా యువ పారిశ్రామిక వేత్తలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య (టీఐఎఫ్) అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే ఆసక్తి ఉన్న యువకులు నూతనంగా స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకుని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయానికి వంట పాత్రల వితరణ

మేడిపల్లి (బోడుప్పల్): మేడిపల్లి ఆంజనేయస్వామి ఆలయానికి మేడిపల్లి లయన్స్‌క్లబ్ నిర్వాహకులు సోమవారం వంట పాత్రలను వితరణ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యురాలు లావణ్య ఈ వంట పాత్రలు అందజేశారు. ఆలయకమిటీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, చార్టెడ్ అధ్యక్షుడు వేముల నాదంగౌడ్ పాల్గొన్నారు.

మాకు అన్యాయం జరుగుతోంది..

నాగారం: రోడ్డు విస్తరణకు పట్టణ రాంపల్లి సిగ్నల్ నుంచి రాంపల్లి వరకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ విస్తరణలో అన్యాయం జరుగుతోందని సోమవారం నాగారం ప్రజావాణిలో వ్యాపారులు ఫిర్యాదు చేశారు.

బొంతురామ్మోహన్‌ను పరామర్శించిన ఎంపీ

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: మాతృవినియోగంతో ఉన్న నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కుటుంబాన్ని సోమవారం ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. కమలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అలరించిన 'అమ్మ నీరాజనం'

ఉప్పల్: ఉప్పల్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. దసరా-బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం శిల్పారామంలో అభినయ దర్పణం ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువర్యులు కళారత్న ఓలేటి రంగమణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య 'అమ్మ నీరాజనం' ఆకట్టుకుంది.

గాజాపై యుద్ధం వద్దు

పీర్జాదిగూడ(బోడుప్పల్): శాంతి, సంక్షేమానికి విఘాతం కలిగిస్తూ గాజాపై యుద్ధం చేయడాన్ని సీపీఐ నిరసిస్తుందని రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ పేర్కొన్నారు. మేడిపల్లి మండల సీపీఐ కార్యదర్శి రచ్చకిషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్‌డిపో వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఉప్పల్: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను వెంటనే నిలిపివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఉప్పల్ రింగ్‌రోడ్డులో నిరసన తెలిపారు.

ఈఎమ్ఐ కట్టలేదని చితకబాదారు


మేడ్చల్: బైకు నెలవారీ బకాయిలు కట్టలేదని ఉదయ్ మేడ్చల్‌లో ని ఆదిత్య బైకు జోన్‌లో ఈఎమ్ఐతో ద్విచక్రవాహనం తీసుకున్నాడు. నాలుగువాయిదాలు కట్టలేదు. సోమవారం ఉదయ్‌పై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉత్తమ సామాజిక కార్యకర్త



అవార్డు అందుకుంటున్న సునీల్ వర్మ

ఏఎస్ రావునగర్, న్యూస్ టుడే: సామాజిక భావనతో సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరి మన్ననలు పొందుతున్న ఈసీఐఎల్‌కు చెందిన సునీల్ వర్మను తెలుగు రాష్ట్రాల క్షత్రియ సేవాసమితి ఉత్తమ సామాజిక కార్యకర్తగా గుర్తించింది. సోమవారం బెస్ట్ సోషల్ వర్కర్‌గా అవార్డును ఆయనకు ప్రదానం చేయడంతో పాటు రూ.లక్ష రివార్డును ప్రకటించింది. ఈ మేరకు క్షత్రియ సేవాసమితి ప్రతినిధులు పేర్కొన్నారు. లక్ష్మీ అంబులెన్స్, లక్ష్మీ వృద్ధాశ్రమం, లక్ష్మీ గోశాల ఏర్పాటుచేసి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సునీల్ వర్మను వారు అభినందించారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని సునీల్‌వర్మ పేర్కొన్నారు.



ఉప్పల్ రింగురోడ్డులో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ లిట్టర్ ఫ్రీ హైదరాబాద్'

పోలీస్ శిక్షణ కేంద్రంలో స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

మేడ్చల్: కండ్లకోయ పోలీస్ శిక్షణకేంద్రంలో స్విమ్మింగ్‌పూల్‌ను డీజీ అభిలాష బిస్త్ సోమవారం ప్రారంభించారు. అనంతరం పోలీసు శిక్షణార్థులతో కలిసి బతుకమ్మ, కోలాటం ఆడారు.

అందరి లక్ష్యం 'చెత్త రహిత హైదరాబాద్'

ఉప్పల్, న్యూస్‌టుడే: అందరి లక్ష్యం 'చెత్త రహిత హైదరాబాద్' కావాలనే లక్ష్యంతో ఉప్పల్ రింగురోడ్డులో ఏర్పాటు చేసిన 'ఐ లవ్ లిట్టర్ ఫ్రీ హైదరాబాద్' ఆకట్టుకుంటోంది. దీన్ని గాంధీ జయంతి రోజున ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కుమార్ పాటిల్ ఆవిష్కరించారు.

విధులకు ఆటంకం.. మహిళపై కేసు

ఏఎస్ రావునగర్: విధి నిర్వహణలో ఉన్న మహిళా కండక్టర్, మహిళా కానిస్టేబుల్‌పై దురుసుగా ప్రవర్తించిన మహిళాపై కేసు నమోదు చేసిన సంఘటన కుషాయిగూడ ఠాణా పరిధిలో జరిగింది. కుషాయిగూడ సీఐ జి.అంజయ్య కథనం ప్రకారం. ఈ నెల 4న కొయ్యల సరిత ప్రయాణికురాలు ఈసీఐఎల్ నుంచి ఉప్పల్ వెళ్లేందుకు బస్సు ఎక్కింది. కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గద్ద శ్రీదేవికి సరితల మధ్య ఆధార్ కార్డు విషయంలో వాగ్వాదం జరిగింది. ప్రయాణికురాలు కండక్టర్‌తో దురుసుగా ప్రవర్తించడంతో పాటు బస్సు ఎదుట రోడ్డుపై బైఠాయించి ప్రయాణికులను ఇబ్బందికి గురిచేసింది. మహిళా కానిస్టేబుల్‌తోనూ అలాగే వ్యవహరించింది. కండక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు


గోధుమకుంటలో పాల్గొన్న భాజపా నాయకులు

గోధుమకుంట(కీసర), న్యూస్‌టుడే: వెళ్లిన ప్రతిచోట భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి యువత నుంచి మంచి స్పందన వస్తుందని ఓబీసీ మోర్చా మేడ్చల్-మల్కాజిగి జిల్లా గొర్రెల కాపరుల సెల్ కన్వీనర్ చీర సురేష్ అన్నారు. సోమవారం గోధుమకుంటలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, రాష్ట్ర నాయకులు ఎస్.వెంకట్‌రెడ్డి, భాజపా మండల ప్రధాన కార్యదర్శి కె.బాలరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.